


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 13 గురువారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 149

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




# గీత దాటితే వేటే!

- పార్టీని ధిక్కరించిన కాంగ్రెస్ నేతలపై వేటు..
- ఎమ్మెల్సీ మల్లన్నపై యాక్షన్ తప్పదా?
- రేవంత్ సన్నిహితుడికే తప్పని వేటు
- పలువురికి షోకాజు నోటీసులు
- గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టే యత్నం

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లివచ్చాక అధిష్ఠానంలో వచ్చిన మార్పుతో నేతల నోళ్లకు తాళాలు పడుతున్నాయంటున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రూటు మార్చింది. ఇంటర్నల్ డెమొక్రసీ పేరుతో పార్టీ క్రమశిక్షణను తప్పుతున్న నేతలపై చర్యలకు సిద్ధమంటోంది. మాట వింటే ఓకే.. వినకపోతే వేటు అంటూ సంకేతాలు పంపుతోంది. ఇప్పటికే ఓ నేతను బయటకి పంపగా, మరికొందరి పేర్లతో లిస్టు రెడీ అయిందంటున్నారు. ఎవరికి తోచింది వారు మాట్లాడుతూ.. రోడ్డెక్కుతామంటే గతంలో బుజ్జగింపులు ఉండవని హెచ్చరిస్తోంది కాంగ్రెస్ హైకమాండ్. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లివచ్చాక అధిష్ఠానంలో వచ్చిన మార్పుతో నేతల నోళ్లకు తాళాలు పడుతున్నాయంటున్నారు. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క అంటోంది తెలంగాణ పీసీసీ. కాంగ్రెస్ అంటేనే అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో బోలెడంత స్వేచ్ఛ. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించే నేతలు.. అధిష్ఠానం సడన్ వార్నింగుతో మారుతారా? అనేది ఆసక్తి రేపుతోంది. పార్టీకి నష్టం కలిగిస్తే ఎవరైనా ఉపేక్షించేది లేదని అధిష్ఠానం తేల్చిచెబుతోంది. శాంపిల్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా పేరున్న ఎల్లారెడ్డి నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి సుభాష్ రెడ్డిపైనే వేటు వేసింది. మారకపోతే మరికొంత మందిపై వేటు పడటం ఖాయమని గాంధీభవన్‌లో వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అంతర్గత కుమ్ములాటలు ఎక్కువే. గత ఎన్నికలకు ముందు పార్టీలో గ్రూప్ వార్ పతాకస్థాయిలో ఉండేది. అయితే ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. సీనియర్లు అంతా సిన్సియర్‌గా పనిచేయడంతో గెలుపు గాంధీభవన్ వాకిట వాలింది. ఇక అధికారంలో వచ్చాక షరా మామూలే అన్నట్లు మళ్లీ గ్రూపుల గొడవ ఎక్కువవుతోంది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, ఒక నేత తీసుకున్న నిర్ణయాన్ని మరో నేత తప్పుపట్టడం రివాజుగా మారింది. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఈ సమస్య మరింత తీవ్రంగా కలవరపెడుతోందని అంటున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఈ తలనొప్పిగా ఎక్కువగా ఉంది. మరోవైపు పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా కొందరు మాట్లాడటంతో సోషల్ మీడియాలో ట్రోల్స్, పబ్లిక్‌లోకి నెగెటివ్

## ఉచితాలపై సుప్రీం సీరియస్..!

3



## వణికిస్తోన్న కోడి జ్వరం

ఏడువేల కోట్లను చంపిన మహారాష్ట్ర

2



# మళ్లీ ఎన్నికలు జరిగితే.. ఎన్డీఏకు 300 సీట్లు

- దేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీఏ క్లీన్‌స్వీప్
- ఇండియా కూటమికి భారీగా స్థానాలు తగ్గి 188కే పరిమితం
- ఎన్డీఏకు 3శాతం ఓటు బ్యాంకు పెరిగి 47% సాధన
- ఇండియా టుడే- సీ ఓటర్ ఒపినియన్ పోల్ వెల్లడి
- దేశవ్యాప్తంగా 1,25,123 మందిని సర్వే చేసిన ఇండియాటుడే

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే మళ్లీ భారతీయ జనతా పార్టీనే భారీ మెజార్టీతో అధికార చేపడుతుందని ఇండియా టుడే-సీ ఓటర్ సర్వే తేల్చింది. ఇప్పటికిప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగితే బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ 343 స్థానాల్లో విజయం సాధిస్తుందని ఇండియా టుడే సీఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ ఓపీనియన్ పోల్ వెల్లడించింది. ఇక, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 232 స్థానాలు సాధించిన కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమికి భారీగా స్థానాలు తగ్గి 188 సీట్లకే పరిమితమవుతుందని తాజా సర్వే తేల్చింది. ఈ ఏడాది జనవరి 2 నుంచి ఫిబ్రవరి 9 వరకు అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లోని 1,25,123 మందిని సర్వే చేయగా ఈ విషయాలు వెలుగుచూశాయి. ఓట్ షేర్ కూడా ఎన్డీఏకు 3 శాతం పెరిగి 47 శాతం సాధిస్తుందని తెలిపింది. ఇండియా కూటమి కేవలం 1 శాతం ఓట్లను పెంచుకుంటుందని పేర్కొంది. .ఇప్పటికిప్పుడు ఈరోజే ఎన్నికలు జరిగితే బీజేపీ ఒంటరిగానే 281 సీట్లను సాధిస్తుందని ఇండియా టుడే సర్వే స్పష్టం చేసింది. ఇక, కాంగ్రెస్ పార్టీ

# స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం

- తెలంగాణలో మరోసారి కులగణన చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందాకే ఎన్నికలు నిర్వహించే అవకాశం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కులగణన పూర్తి కావడంతో ఈ నెల 15వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని భావించారు. కానీ తెలంగాణ

# సిక్కుల ఊచకోత కేసులో సజ్జన్ దోషి

- 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ దోషిగా తేల్చిన కోర్టు
- తండ్రీ కొడుకుల హత్య కేసులో కూడా ప్రమేయం

3

**ఈ నెల 19కి తుది వాదనలు**



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌ను రౌస్ అవెన్యూ కోర్టు దోషిగా తేల్చింది. 1984 నవంబర్ 1న సరస్వతి విహార్‌లో తండ్రీకొడుకుల హత్య కేసులో ఆయన ప్రమేయం ఉన్నట్టు తేల్చింది.

# డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు

- డీఎస్సీ 2008 అభ్యర్థులకు గుడ్‌న్యూస్ చెప్పిన రేవంత్ సర్కార్
- 7రోజుల్లోగా కాంట్రాక్ట్ విధానంలో ఎస్జీటీ టీచర్ల పోస్టులు
- మెరిట్ ఉన్నా ఉద్యోగాలు రాని అభ్యర్థులు ఏళ్లుగా పోరాటం
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ ఉద్యోగాలిస్తామని హామీ

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

2008 డీఎస్సీలో నష్టపోయి వారిలో 1382 మంది బీఈడీ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారందర్నీ వారం రోజుల్లోగా కాంట్రాక్ట్ విధానంలో తెలంగాణ విద్యాశాఖ టీచర్ ఉద్యోగాలను ఇవ్వనుంది. వారిని సెకండ్ గ్రేడ్ టీచర్లుగా నియమిస్తూ ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆనాడు చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయంతో మంచి మార్కులు సాధించి, మెరిట్ జాబితాలో ఉన్నా.. బీఈడీ అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ నాటి నుంచి నేటి వరకు అభ్యర్థులు పోరాడుతున్నారు. ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు.

# 3 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు

- 3 ఎకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో రూ.1,230 కోట్లు జమ
- ఇప్పటి వరకు రైతు భరోసా కింద తెలంగాణ ప్రభుత్వం రూ.3,487.25 కోట్లు పంపిణీ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేస్తోంది. ఇప్పటివరకు రెండు ఎకరాల లోపు భూమిని కలిగిన రైతుల ఖాతాల్లో నగదును జమ చేసిన ప్రభుత్వం.. గురువారం నుంచి మూడెకరాల లోపు భూమి కలిగిన అన్నదాతల ఖాతాల్లో పంట పెట్టుబడి డబ్బులను జమ చేస్తోంది. ఈ మేరకు మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు ఎకరానికి రూ. 6వేల చొప్పున రైతుభరోసా నిధులు జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. 3 ఎకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో రూ. 1,230 కోట్లు జమ చేసింది. ఇప్పటి వరకు రైతు భరోసా కింద తెలంగాణ ప్రభుత్వం రూ. 3,487.25 కోట్లు పంపిణీ చేసింది. డీబీటీ పద్ధతిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. గత సర్కారు పెట్టుబడి సాయాన్ని రైతుబంధు పేరుతో అమలు చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా ఈ పథకాన్ని రైతు భరోసాగా

# ఓటమికి కారణాలివే..

- కూటమి నేతలు అబద్ధాలు చెప్పి ప్రజల్ని మోసం చేశారు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి వచ్చింది 10% ఓట్లు మాత్రమే
- వైసీపీ పాలనలో రెండున్నర ఏళ్లు కోవిడ్ ఉంది..
- అందుకే ప్రజలకు,కార్యకర్తలకు ఏమీ చేయలేకపోయాం
- మీ జగన్ మరో 25-30 ఏళ్లు రాజకీయాల్లో ఉంటాడు
- గుంటూరు పర్యటనలో మాజీ సీఎం జగన్ మనోభావాలివి..

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఓటమికి కారణం చెబుతున్న జగన్! గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఎందుకు ఓడిపోయింది అని అంటే.. ఆ పార్టీ నేతలే ఒక్కొక్కరూ ఒక్కో అభిప్రాయాన్ని వెళ్లబుచ్చిన పరిస్థితి. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఎందుకు ఓడిపోయింది అని అంటే.. ఆ పార్టీ నేతలే ఒక్కొక్కరూ ఒక్కో అభిప్రాయాన్ని వెళ్లబుచ్చిన పరిస్థితి. ఇందులో భాగంగా... కొంతమంది ఈవీఎంల వల్ల అని అంటే.. మరికొంతమంది లిక్కర్ పాలసీ వల్ల అని అన్నారు. అయితే... వాస్తవం ఏమిటనేది అందరికీ తెలుసనేది కూటమి మాట.తాజాగా ఉమ్మడి గుంటూరు జిల్లా వైసీపీ నేతలతో జరిగిన భేటీలో జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము ఎందుకు ఓటమిపాలైంది వెల్లడించారు. ఇదే సమయంలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... టీడీపీ నేతలు ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్లే పరిస్థితులు లేవు. బాబు ష్యూరిటీ ఇప్పుడు మోసం అయ్యిందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా స్పందించిన జగన్... ప్రజలకు ఇచ్చిన మాటను గాలికి వదిలేసిన చంద్రబాబు ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దారుణమైన పరిస్థితులు తప్పవని.. చంద్రబాబు చెప్పిన ప్రతి పథకం.. అబద్ధం, మోసం అని అన్నారు. గత ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయిని.. కూటమి కంటే మనకు 10 శాతం ఓట్లు మాత్రమే తగ్గాయని తెలిపారు. అందుకు గల కారణం... వారిలా అబద్ధాలు చెప్పలేకోవడనే జగన్ చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టారని.. ఆయన మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశారని.. రాష్ట్రంలో విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలు తిరోగమనంలో ఉన్నాయని జగన్ తెలిపారు. అయితే మనం చేసిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉందని జగన్ నొక్కి చెప్పారు. ఇదే సమయంలో... రాజకీయాల్లో విలువలు, విశ్వసనీత ఉండాలని చెప్పిన జగన్.. మీ జగన్ మరో 25-30 సంవత్సరాలు రాజకీయాల్లో ఉంటాడని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో.. మనం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చామని.. ప్రజల కోసం ఇన్ని బటన్లు నొక్కిన మనకే ఈ పరిస్థితి ఉంటే.. రేపు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన ఈ సర్కార్ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇదే సమయంలో... రాబోయేది జగన్ 2.0 పాలన అని చెప్పిన జగన్.. అన్యాయాలు ఎవరు చేసినా వదిలి పెట్టమని.. తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతామని.. మన పాలనలో రెండున్నరేళ్లు కోవిడ్ ఉందని.. అందుకే కార్యకర్తలకు చేయాల్సింది చేయలేకపోయామన్నారు.

# మళ్లీ కులగణన..!

- 16 నుంచి 28 వరకు సర్వే సిబ్బందికి వివరాలు అందజేయాలి
- రాష్ట్ర జనాభా లెక్కల్లోకి వచ్చే విధంగా అందరూ చూసుకోవాలి
- ఇప్పటి వరకు జరిగిన కులగణన సర్వే శాస్త్రీయంగానే జరిగింది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన కులగణనకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లతోపాటు కులగణన సర్వేపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశం అనంతరం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగిందన్నారు. వివిధ కారణాలతో కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు సర్వే సిబ్బందికి వివరాలు అందజేయాలని సూచించారు. రాష్ట్ర జనాభా లెక్కల్లోకి వచ్చే విధంగా అందరూ చూసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి కోరారు. కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్ వంటి వాళ్లు కొందరు ఉద్దేశపూర్వకంగా సర్వేలో పాల్గొనలేదని డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు. ఇక ఎన్నికల్లో మాట ఇచ్చినట్లుగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఆయన తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మార్చి మొదటి వారంలో కేబినెట్ తీర్మానం చేయనుందని భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభలో బిల్లు ఆమోదింపజేసి చట్టబద్ధం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కులగణన బిల్లును కేంద్ర

# అత్యాచార బాధితురాలికి గర్భాన్ని తొలగించుకునే హక్కు

- బిడ్డ కావాలా..వద్దా నిర్ణయించుకునే అధికారం మహిళకే
- ఆమెను అడ్డుకోవడం..మానవ హక్కును హరించడమే
- బాధితురాలికి గర్భాన్ని తొలగించుకునే హక్కు కల్పిస్తూ తీర్పు

2



**అలహాబాద్-నవభూమిబ్యూరో**

లైంగిక వేధింపులకు గురైన మహిళకు వైద్యపరంగా తన గర్భాన్ని తొలగించుకునే హక్కు ఉందని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. 17 ఏళ్ల బాలిక తనకు బిడ్డ కావాలా వద్దా అని నిర్ణయించుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. లైంగిక వేధింపుల సందర్భంలో ఒక మహిళ తన గర్భాన్ని రద్దు చేసుకోకుండా అడ్డుకోవడం, ఆమెను మాతృత్వ బాధ్యతకు బంధించడం అంటే ఆమె గౌరవంగా జీవించే మానవ హక్కును హరించడమే అవుతుందని పేర్కొంది. తల్లి కావడానికి అవును లేదా కాదు అని చెప్పే హక్కు మహిళకు ఉందని కోర్టు తెలిపింది. బాధితురాలికి వైద్యపరంగా గర్భాన్ని తొలగించుకునేందుకు అనుమతి ఇస్తూ జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి, జస్టిస్ ప్రశాంత్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాఖ్య చేసింది. మైనర్ కావడంతో.. భదోహికి చెందిన 17 ఏళ్ల బాలిక తండ్రి తన మైనర్ కుమార్తెను ప్రలోభపెట్టి, కిడ్నాప్ చేసి, అత్యాచారం చేశాడనే ఆరోపణలపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాడు. పోలీసులు కూతురిని వెతికి ఆమె తండ్రికి అప్పగించారు. ఈ సమయంలో

# నేడు ఐటీ బిల్లు

- కొత్త బిల్లులో 622 పేజీల్లో 526 సెక్షన్లు. 23 చాప్టర్లు, 16 షెడ్యూళ్లు
- పార్లమెంటు, స్థాయీసంఘం ఆమోదం పొందాక 2026 ఏప్రిల్ 1 నుంచి నూతన చట్టం అమల్లోకి

2


**దిల్లీ-నవభూమిబ్యూరో:** ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. పాత చట్టంలోని 'అంతక్రితం సంవత్సరం, మదింపు సంవత్సరం' వంటి పదాలను తొలగించి, 'పన్ను సంవత్సరం' వంటి సరళ భాషను వాడనున్నారు. 60 ఏళ్ల నాటి ప్రస్తుత చట్టంలో 880 పేజీలు, 298 సెక్షన్లు, 14 షెడ్యూళు ఉండగా.. కొత్త బిల్లులో 622 పేజీల్లో 526 సెక్షన్లు. 23 చాప్టర్లు, 16 షెడ్యూళ్లు ఉంటాయి. పార్లమెంటు, స్థాయీసంఘం ఆమోదం పొందాక 2026 ఏప్రిల్ 1 నుంచి నూతన చట్టం అమల్లోకి రానుంది. చిన్న చిన్న వాక్యాలు, టేబుళ్లు, ఫార్ములాలతో సులభంగా చదవగలిగేలా, అర్థం చేసుకునేలా తీసుకొస్తున్నారు. ఇందుకోసం 'ఎక్స్ నేషన్స్' తొలగిస్తున్నారు.. క్రితం ఆర్థిక సంవత్సరంలో సంపాదించిన ఆదాయానికి (ఉదాహరణకు 2023-24), మదింపు సంవత్సరంలో చెల్లించిన పన్ను (2024-25) అని ప్రస్తుత చట్టంలో ఉంది. కొత్త బిల్లులో పన్ను ఏడాది అని మాత్రమే వాడతారు.

పన్ను వివాదాలను పరిష్కరించేందుకు ఉద్యోగులకు కేటాయించే షేర్ల (ఎసాప్స్) విషయంలో ప్రతిపాదిత చట్టంలో స్పష్టత ఇవ్వనున్నారు. టీడీఎస్ సంబంధిత సెక్షన్లన్నిటినీ ఒక దగ్గర చేరుస్తారు. ఒకే క్లాజ్తో



# జీహెచ్ఎంసీలో కొత్త రాజకీయం.. బీఆర్ఎస్ ప్లాన్ ఇదే..

**హైదరాబాద్-నవభూమి:** జీహెచ్ఎంసీ రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శోభన్ రెడ్డిలపై అవిశ్వాస కత్తి వేలాడుతోంది. ఈ సమయంలో బీఆర్ఎస్ ఎలాంటి ప్లాన్ చేస్తుందనేది ఇప్పుడు అందరిలో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత పాలక మండలికి నాలుగేళ్లు పూర్తి కావడంతో ఏ క్షణంలోనైనా మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ప్లాన్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్ఎంసీ రాజకీయాలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై నిర్ణయం ఉంటుందని చెప్పారు. నెంబర్ గేమ్‌ను బట్టి మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ఉంటుందని తెలిపారు. బీసీ మూమెంట్ తెలంగాణ రాష్ట్రంలో బలంగా ఉందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన కులగణన సర్వేలో చాలా తప్పులు ఉన్నాయని తెలిపారు. కేసీఆర్ చేసిన సర్వేలో బీసీలు 51శాతం మంది ఉన్నారన్నారు. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు 90శాతం మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా పిల్లలున్నారని చెప్పారు. రాష్ట్రంలో 60లక్షల మందికి లెక్కలు లేవన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు అసెంబ్లీలో చట్టం చేసి 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు ఇస్తే బీసీలు ఒప్పుకోరని చెప్పుకొచ్చారు. పునర్విభజన జరిగితే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు తెలంగాణకు తగ్గుతాయన్నారు.



# రైతులకు మరో శుభవార్త.. ఈసారి వాళ్లందరి ఖాతాల్లో డబ్బులు జమ.. ఎంజాయ్ పండగో..!



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ వినిపించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాతలకు రైతుభరోసా పేరుతో పెట్టుబడి సాయం అందిస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. జనవరి 26వ తేదీన పథకాన్ని ప్రారంభించిన సర్కార్.. ఎకరం, రెండెకరాలు ఇలా వరుసగా సాగు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేస్తోంది. ఈ క్రమంలోనే.. తాజాగా మూడెకరాలున్న రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేసింది ప్రభుత్వం. తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో భారీ శుభవార్త వినిపించింది. జనవరి 26వ తేదీ నుంచి రైతు భరోసా పథకం కింద అన్నదాతలకు పెట్టుబడి సాయం అందిస్తోన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. తొలుదు పైలెట్ ప్రాజెక్టు కింద జనవరి 27న 563 గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం జమ చేయగా.. ఆ తర్వాత ఒక్క ఎకరా ఉన్న రైతులకు, రెండు ఎకరాలున్న అన్నదాల అకౌంట్లలో డబ్బు జమ చేసింది. కాగా.. ఇప్పుడు మూడు ఎకరాలు సాగు చేస్తున్న రైతులకు రైతు భరోసా డబ్బులు జమ చేసినట్టు వ్యవసాయ శాఖ ప్రకటించింది. కాగా.. రైతు భరోసా పథకం కింద అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్.. రూ.2223.46 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. కాగా.. సాగు చేస్తున్న భూమిని (ఎకరాల్లో) బట్టి వరుసగా పెట్టుబడి సాయం అందిస్తోంది ప్రభుత్వం. మార్చిలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే.. రైతు భరోసా పథకం ప్రారంభించిన వెంటనే జనవరి 27వ తేదీన 563 గ్రామాల్లోని 4,41,911 రైతులకు సంబంధించి 9,48,332.35 ఎకరాలకు పెట్టుబడి సాయం కింద రూ.5,68,99,97,265 నిధులు విడుదల చేసింది ప్రబుత్వం. అనంతరం.. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఎకరం సాగు భూమి ఉన్న 17,03,419 మంది రైతులకు చెందిన 9,29,234.20 ఎకరాలకు రూ.5,57,54,07,019 నిధులు విడుదల చేసింది సర్కార్. ఇక ఫిబ్రవరి 10వ తేదీన రెండెకరాల సాగు భూమి ఉన్న 8,65,999 మంది రైతులకు చెందిన 11,79,247.17 ఎకరాలకు గానూ రూ.7,07,54,84,664 జమ చేసింది రేవంత్ రెడ్డి సర్కార్. కాగా.. మొన్నటి వరకు మొత్తంగా 30,11,329 రైతులకు చెందిన 30,56,814.32 ఎకరాలకు రూ.1834,08,88,948 పెట్టుబడి సాయాన్ని లబ్దిదారుల ఖాతాల్లో జమచేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. తాజాగా.. మూడు ఎకరాల సాగు భూమి ఉన్న రైతులకు కూడా పెట్టుబడి సాయాన్ని అన్నదాతల ఖాతాల్లో జమ చేసినట్టు పేర్కొనటంతో.. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. ఇక ఆ టెన్షన్ అక్కర్లేదు




**హైదరాబాద్-నవభూమి:** శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. మరిన్ని పుష్పక్ సర్వీసులను నడపనున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని బస్సులు సర్వీసులందిస్తుండగా.. నేటి నుంచి మరో 6 సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సులు సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మీదుగా రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. మొత్తం ఆ బస్సులు 24 ట్రిప్పులు నడుపుతున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రాణిగంజ్, సెక్రటేరియట్, రవీంద్రభారతి, హజ్‌హౌజ్, నాంపల్లి, గాంధీభవన్, ఎంజే మార్కెట్, అఫ్జల్‌గంజ్, బహదూర్‌పుర, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు మొదటి బస్సు, రాత్రి 11.55 గంటలకు చివరి బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు మొదటి బస్సు, రాత్రి 11.50 గంటలకు చివరి బస్సు బయల్దేరుతుందని అన్నారు. ప్రయాణికులు ఈ విషయాలను గమనించాలన్నారు. కాగా, పుష్పక్ బస్సుల నడుపుతుండటంతో ప్రయాణికులకు టెన్షన్ తీరనుంది. ప్రస్తుతం పలువురు ఎక్కువ డబ్బులు చెల్లించి క్యాబ్‌లు బుక్ చేసుకొని వెళ్తుండగా.. ఇప్పుడు ఆ తిప్పలు తప్పనున్నాయి.

అధికారుల తనిఖీలతో నిలిచిన బస్సులుఇక హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారుల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలకు భయపడి ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను డ్రైవర్లు వనస్థలిపురంలోనే నిలిపివేశారు. రవాణాశాఖ అధికారుల తనిఖీలు పూర్తయ్యే వరకు బస్సులను సిటీలోకి తీసుకెళ్లబోమని డ్రైవర్లు ప్రయాణికులకు తెగేసి చెప్పారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ట్రావెల్స్ కాల్ సెంటర్లకి కాల్ చేసి మాట్లాడితే వారు నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైనా పత్రాలు లేకుండా రోడ్లపై బస్సులు ఎలా నడుపుతున్నారని డ్రైవర్లను నిలదీశారు. బస్సుల్లో వృద్ధులు, చంటి పిల్లలు ఉన్నారని.. తాము వెళ్లాల్సిన చోటుకు తీసుకెళ్లకుండా ఇక్కడే గంటలకొద్ది నిలిపేయటం ఏంటని మండిపడ్డారు. డ్రైవర్, కాల్ సెంటర్ల నుంచి సరైన స్పందన రాకపోవటంతో కొందరు క్యాబ్‌లు బుక్ చేసుకొని వెళ్లిపోయారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 'నోటా'.. హస్తంకు 'నో', కారుకు 'ఎస్'..




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో.. రాష్ట్ర ఎన్నికల సంఘం సరికొత్త విధానం తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు.. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో భేటీ అయ్యింది. ఎన్నికల్లో నోటాను ఓ కల్పిత అభ్యర్థిగా పరిగణించాలా వద్దా అనే అంశాన్ని రాజకీయ పార్టీలతో చర్చించింది. ఈమేరకు కొన్ని ప్రతిపాదనలు తెలపగా.. రాజకీయ పార్టీల నుంచి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమ య్యాయి. మరి ఎవరెవరూ ఏమన్నారో చూడండి. తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంస్థ ఇప్పటి నుంచి గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టేసింది. ఇందులో భాగంగానే.. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కీలక విషయంపై చర్చించింది. ట్రయల్ ప్రాతిపదికన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోటాను కూడా ఒక కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్దా అనే అంశంపై రాజకీయ పార్టీల అభిప్రాయం తీసుకుంది. రాజకీయ పార్టీల ముందు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కొన్ని ప్రతిపాదనలు పెట్టగా.. ఈ అంశంపై పార్టీల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. ఈ పద్దతిని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మాత్రం స్వాగతించింది. బీజేపీ మాత్రం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆ అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇక.. సీపీఎం కూడా నోటా ఉండాలని చెప్పింది కానీ.. అభ్యర్థిగా మాత్రం గుర్తించొద్దని స్పష్టం చేసింది.

**నోటాపై ఎన్నికల సంఘం ప్రతిపాదనలు**

ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు నోటాను ఒక "కల్పిత ఎన్నికల అభ్యర్థి"గా పరిగణిస్తారు. ఈ క్రమంలో పోటీ చేస్తున్న అభ్యర్థి.. నోటా (కల్పిత ఎన్నికల అభ్యర్థి) తో అత్యధిక సంఖ్యలో సమాన ఓట్లను పొందినట్లయితే.. పోటీ చేస్తున్న అభ్యర్థినే ఎన్నికైనట్టు ప్రకటిస్తారు. ఒకవేళ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ వ్యక్తిగతంగా నోటా (కల్పిత ఎన్నికల అభ్యర్థి) కంటే తక్కువ ఓట్లు పొందితే మాత్రం.. పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఏ ఒక్కరూ ఎన్నికైనట్టు ప్రకటించరు. అలాంటి సందర్భంలో.. ఆ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహిస్తారు. అందులోనూ.. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారు. ఆ ఎన్నికల్లోనూ.. నోటాకు మళ్లీ అత్యధిక ఓట్లు వస్తే.. ఆ తర్వాత మరోసారి ఎన్నికలు నిర్వహించబడవు. రెండోసారి నిర్వహించిన ఎన్నికల్లో నోటాను మినహాయించి.. పోటీ చేసిన అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయో వారినే ఎన్నికైనట్టుగా ప్రకటిస్తారు.

నోటాపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు

అయితే.. ఎన్నికల సంఘం పెట్టిన ఈ ప్రతిపాదనలుపై రాజకీయ పార్టీలు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చాయి. నోటాను కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. ఒకవేళ నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చి ఎన్నికలు మళ్లీ నిర్వహించాల్సి వస్తే.. అటు ప్రభుత్వానికి, ఇటు అభ్యర్థులకు ఖర్చు పెరిగిపోతుందని.. హస్తం పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. మొత్తానికి నోటాకు హస్తం పార్టీ 'నో' చెప్పింది. ఇక.. నోటాను కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం పూర్తిగా స్వాగతించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవానికి బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందని గులాబీ పార్టీ పేర్కొంది. ఈ క్రమంలో.. నోటా ఉండాలని అభిప్రాయపడుతూ.. ఎన్నికల సంఘం ప్రతిపాదనలకు కారు పార్టీ 'ఎస్' చెప్పింది. ఇదిలా ఉంటే.. సుప్రీంకోర్టులో కేసు ఉందని గుర్తుచేసిన బీజేపీ.. తమ అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. అయినప్పటికీ.. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి నిర్ణయం తీసుకునే అవకాశం లేదని.. పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం ప్రభుత్వమే తీసుకోవాలని కమలం పార్టీ స్పష్టం చేసింది. మరోవైపు.. నోటాతో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పిందని గుర్తు చేసిన సీపీఎం.. నోట ఉండాలని అయితే అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మాత్రం మళ్లీ ఎన్నికలు నిర్వహించటం కరెక్ట్ కాదని అభిప్రాయపడింది. కాగా.. ఈ అంశంపై తమ అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్తామని తెలంగాణ తెలుగుదేశం పార్టీ చెప్పగా.. బరిలో ఒక్క అభ్యర్థి ఉన్నా సరే.. నోటా ఉండాలని జనసేన పార్టీ తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. ఇక.. రాష్ట్రంలో సర్పంచ్ పదవుల వేలం పద్ధతిని అరికట్టేందుకు ఈ కల్పిత అభ్యర్థి నిర్ణయం అని రాష్ట్ర ఎన్నికల సంఘం వివరిస్తోంది. ఈ కల్పిత అభ్యర్థి విధానాన్ని ఇప్పటికే మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలు అవలంభిస్తున్నాయని ఎన్నికల సంఘం రాజకీయ పార్టీను సూచించింది. మరి.. చివరికి ఈ నోటా విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది తెలియాల్సి ఉంది.

# జీహెచ్ఎంసీ ఎన్నికలకు కూడా బీఆర్ఎస్ దూరమా..?



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాజకీయాలు రోజు రోజుకు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధిస్తామని రంగంలోకి దిగిన బీఆర్ఎస్ పార్టీ.. అనూహ్యంగా ఓటమి పాలైంది. ఏమాత్రం అంచనాలు లేకుండా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అదే జోరు కంటిన్యూ చేయగా.. బీఆర్ఎస్ పార్టీ కనీసం ఒక్క సీటు కూడా గెలవకుండా ఘోరాతి ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకుంది. కాగా.. ఇప్పుడు పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుండగా.. వాటికి దూరంగా ఉంటోంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల మీద ప్రత్యేక దృష్టి పెట్టిన బీఆర్ఎస్.. మరి త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తుందా లేదా అన్నది ఆసక్తిరంగా మారింది. కాగా.. ఈ అంశంపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈనెల 25న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈరోజు (ఫిబ్రవరి 12న) ఉదయం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం జరిగింది. సమావేశం అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 17లోపు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తలసాని స్పష్టం చేశారు. పోటీ చేయాలా, వద్దా అప్పుడు చెబుతామని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. త్వరలోనే.. గులాబీ బాస్ కేసీఆర్‌తో బీఆర్ఎస్ కార్పొరేటర్లు సమావేశమవుతారని తెలిపారు. త్వరలో మాజీ సీఎం కేసీఆర్‌తో కార్పొరేటర్లు సమావేశం అవుతారు. రాష్ట్రంలో బీసీ మూమెంట్ చాలా ఎక్కువగా ఉందని తలసాని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం బీసీ జనాభా చాలా తక్కువగా ఉందని.. ఒరిజినల్ బీసీలు 57 శాతం కంటే ఎక్కువగా ఉన్నారని.. కానీ ప్రభుత్వం మాత్రం బీసీ జనాభాను తగ్గించి చూపించిందన్నారు. జనాభా తక్కువ చూపించడం ద్వారా బడ్జెట్ కేటాయింపులు కూడా తక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. బీసీలకు సీట్లు కూడా తక్కువగా వస్తాయన్నారు. రీసర్వే చేస్తే కేసీఆర్, కేటీఆర్ కూడా పాల్గొంటారని తలసాని ఆసక్తికర కామెంట్లు చేశారు. ఇదిలా ఉంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా ఎలాంటి ఫలితం వచ్చినా.. హైదరాబాద్‌లో మాత్రం బీఆర్ఎస్ తన హవా గట్టిగానే చూపించింది. కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు రాకపోగా.. మొత్తం సీట్లు గులాబీ పార్టీనే కైవసం చేసుకుంది. అయితే.. తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో కొందరు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు.. గులాబీ కండువా తీసేసి హస్తంతో దోస్తీ కట్టారు. అందులో.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవటంతో.. హైదరాబాద్‌లో కూడా బీఆర్ఎస్ బలం తగ్గినట్టయింది. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గులాబీ పార్టీ పోటీ చేస్తుందా లేదా అన్నది ఆసక్తికర చర్చ నడుస్తోంది.

# గీత దాటితే వేటే!

**(1వపేజీ తరువాయి)**టాక్ వస్తుందని కాంగ్రెస్ హైకమాండ్ గుర్తించినట్లు చెబుతున్నారు. ఈ మధ్యకాలంలో కొందరు కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ విధానాలపై చేస్తున్న విమర్శలు ప్రతిపక్షాలకు అస్త్రాలు అవుతున్నాయి. సొంత పార్టీ నేతలే ప్రభుత్వ తీరును తప్పు పడుతున్నారని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నారు. మరికొన్ని చోట్ల గ్రూపు తగాదాలతో రచ్చ నడుస్తుంది. ఇవన్ని పార్టీకి తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా పది మంది ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీ పార్టీలో అగ్గిరాజేసింది. దీంతో ఇంటర్నల్ ఇష్యూస్‌పై కాంగ్రెస్ అధిష్ఠానం ఫోకస్ పెంచింది. ఇటీవల జరిగిన సీఎల్పీ సమావేశంలోనూ ఈ అంశంపై సీరియస్‌గా చర్చించారు. ఇకపై పార్టీ గీత దాటితే వేటు తప్పదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలను ఎవరూ వ్యతిరేకించొద్దని, డౌట్స్ ఉంటే ఉంటే పార్టీ ఇంటర్నల్ వేదికలపై చర్చించాలని సూచించారు. బహిరంగంగా మాట్లాడి పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందులు తేవొద్దని వార్నింగ్ ఇచ్చారు. పార్టీ లైన్ దాటితే ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని, పార్టీ క్రమశిక్షణ సంఘం ఈ విషయంలో అలర్ట్‌గా ఉండాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించడంతో పార్టీలో మార్పు వస్తుందని ఆశిస్తున్నారు. ఈ క్రమంలనే సమస్య తీవ్రత గుర్తించిన పార్టీ క్రమశిక్షణ కమిటీ ఈ మధ్య పలువురికి షోకాజ్ నోటీస్ జారీ చేసింది. ఎల్లారెడ్డి నియోజకవర్గ కీలక నేత సుభాష్ రెడ్డి..ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుపై అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో సుభాష్ రెడ్డి అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. సుభాష్ రెడ్డి ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో ఆయన్ని పార్టీ నుంచి బహిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డి వర్గంగా ముద్రపడిన సుభాష్‌రెడ్డిపై ఆల్ అఫ్ సడెన్‌గా పార్టీ బహిష్కరణ వేటు వేయడం గాంధీభవన్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ లైన్ దాటితే ఎవరైనా..ఎంతటి వారైనా వదిలేదని చెప్పేందుకే తన అనుచరుడిపై ముందుగా సీఎం వేటు వేశారని అంటున్నారు. దీంతో ఇన్నాళ్లు వాయిస్ పెంచి మాట్లాడిన నేతలు సైలెంట్ అవుతున్నారని గాంధీ భవన్ వర్గాల సమాచారం. ఇక ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న, కరీంనగర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీనివాస్ కు క్రమశిక్షణ సంఘం నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా గాంధీభవన్‌లో గొడవ పడిన యూత్ కాంగ్రెస్ నేతలలో కొందరికి నోటీసులు జారీ అయ్యాయంటున్నారు. వీరంతా ఇచ్చే సమాధానంపైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ మల్లన్న ఎలా రియాక్ట్ అవుతారన్నది ఆసక్తి రేపుతోంది. పార్టీ ఆదేశాలను పాటించి వివరణ ఇస్తారా? లేక తన స్వతంత్రతను కొనసాగిస్తారా? అనేది చూడాల్సివుంది. ఏదిఏమైనా కాంగ్రెస్ అధిష్టానం తీరు చూస్తే ఇకపై కఠిన నిర్ణయాలు ఉంటాయనే సంకేతాలే అందుతున్నాయంటున్నారు.

# మళ్లీ ఎన్నికలు జరిగితే..ఎన్డీఏకు 300 సీట్లు

**(1వపేజీ తరువాయి)**ఇంతకుముందు వచ్చిన 99 స్థానాల నుంచి 78కి పడిపోతుందని అంచనా వేసింది. బీజేపీకి 3 శాతం ఓటింగ్ పెరగడంతో 41 శాతానికి చేరనుండగా. కాంగ్రెస్ పార్టీ మాత్రం 20 శాతం దగ్గరే నిలిచిపోయింది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వ లోపంతో బాధపడుతోందని, అది ఆ పార్టీ నిర్మాణంలోనే ఉందని రాజకీయ విశ్లేషకులు యామిని అయ్యర్ ఇండియా టుడేతో అన్నారు. కాగా, గత ఎన్నికల్లో 400 సీట్లు సాధించాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చినప్పటికీ.. ఆ మార్క్ సాధించలేకపోయింది. అంతేగాక, ప్రభుత్వ ఏర్పాటులో బీహార్ సీఎం, జేడీయూ నేత నితీష్ కుమార్, ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మద్దతుతో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. బీజేపీని 400 సీట్ల నినాదమే దెబ్బతీసిందని తెలుస్తోంది. 400 సీట్లు వస్తే బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. దీంతో దళిత, ఓబీసీ ఓట్లను బీజేపీకి దూరం చేసే కాంగ్రెస్ ప్రయత్నం కొంతమేర సఫలీకృతమైనట్లు తెలుస్తోంది. అయితే, సార్వత్రికి ఎన్నిలు జరిగిన ఆరు నెలల తర్వాత వరుసగా జరిగిన మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం గమనార్హం.

# అత్యాచార బాధితురాలికి గర్భాన్ని తొలగించుకునే హక్కు

**(1వపేజీ తరువాయి)**బాలికకు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఆమె 15 వారాల గర్భవతి అని తేలింది. దీనిపై బాధితురాలి తండ్రి మైనర్ తరపున గర్భాన్ని వైద్యపరంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది మన్మోహన్ మిశ్రా వాదిస్తూ, పిటిషనర్ పై అనేకసార్లు అత్యాచారం జరిగిందని అన్నారు. ఆమె ఇప్పుడు గర్భవతి అని పేర్కొన్నారు. ఇది ఆమె మానసిక ఆరోగ్యంపై హానికరమైన ప్రభావాన్ని చూపుతోందని వాదనలు వినిపించారు. పిటిషనర్ మైనర్ కావడంతో పిల్లల బాధ్యతను కోరుకోవడం లేదని కోర్టుకు తెలిపారు.

# నేడు ఐటీ బిల్లు

**(1వపేజీ తరువాయి)**సరళతరమైన పట్టికలతో అందజేస్తారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, 66 బడ్జెట్లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు బిల్లును రూపొందించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం

**(1వపేజీ తరువాయి)**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కులగణనలో పాల్గొనని వారి కోసం మరోసారి సర్వే చేపడుతున్నట్లు ప్రకటించారు.

ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ క్రమంలో మరోసారి కులగణన చేపట్టి, రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందాకే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు

**(1వపేజీ తరువాయి)**కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వారికి కాంట్రాక్టు విధానంలో మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేస్తూ ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం 2024 సెప్టెంబర్ 24న నిర్ణయం తీసుకుంది. 2008 డీఎస్సీ నోటిఫికేషన్‌లో నష్టపోయిన అభ్యర్థులు మొత్తం 2367 మంది ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. వారికి సంబంధించిన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని, కాంట్రాక్టు విధానంలో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తామంటూ అభ్యర్థులు ఒప్పుకోవాల్సి ఉంటుందని విద్యాశాఖ కోరింది. ఈ క్రమంలో 1382 మంది అభ్యర్థులు కాంట్రాక్టు విధానంలో పనిచేయడానికి అంగీకరించారు. ఈ నేపథ్యంలో వారికి పోస్టింగ్స్ ఇచ్చేందుకు విధి విధానాలను రూపకల్పన చేసే ఫైల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెల రోజుల క్రితమే ఆమోదం తెలిపారు. అయితే, ఉద్యోగాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రభుత్వం త్వరితగతిన వారికి ఉద్యోగాలనిస్తూ ఉత్తర్వులు జారీ చేసేందుకు సిద్ధమైంది.

# 3 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు


**(1వపేజీ తరువాయి)**మార్చారు. ఈ పంట పెట్టుబడి సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12వేలకు కూడా పెంచారు. దీంతో ఎకరానికి ప్రతి రైతు ఖాతాలో రూ.6వేలు జమ అవుతాయి. ప్రతి ఏడాదికి రైతుభరోసా కింద రెండు సార్లు పంట పెట్టుబడి సాయం రైతులకు అందుతుంది. రైతు భరోసా స్కీమ్ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా రూ.20 వేల కోట్లను రైతుల ఖాతాలో జమ చేయనుంది. ప్రస్తుతం తక్కువ విస్తీర్ణంలో ఉన్న భూముల నుంచి మొదలుకొని ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న భూములకు నిధులను విడుదల చేస్తున్నారు.

# మళ్లీ కులగణన..!

**(1వపేజీ తరువాయి)**ప్రభుత్వానికి పంపుతామన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంటులో ఆమోదానికి కృషి చేస్తామని వివరించారు. ఓబీసీల రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నాయకులను కలుస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. దశాబ్దాల ఓబీసీల కలలను నిజం చేసేందుకు కృషి చేస్తామని చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లపై రాజకీయపరంగా కుట్రలు చేస్తే చెప్పుకొడతామన్నారు. రాజకీయ లబ్ధి పక్కన పెట్టి మద్దతు పలకాలని కోరుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

# కిరణ్ రాయల్ ఇష్యూ.. తిరుపతి లక్ష్మికి బెయిల్!

**తిరుపతి-నవభూమి:** చెక్ బౌన్స్ కేసులో రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేసిన తిరుపతికి చెందిన లక్ష్మికి బెయిల్ మంజూరైంది. రెండు రోజుల క్రితం తిరుపతిలో ఆమెను జైపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి కోర్టులో హాజరుపరిచారు. అయితే లక్ష్మి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆమె పిటిషన్ ను విచారించిన న్యాయమూర్తి రూ.50 వేల పూచీకత్తుతో ఇద్దరు ష్యూరిటీలు చూపించాలని ఆదేశిస్తూ బెయిల్ మంజూరు చేశారు. దీంతో తిరుపతి జనసేన ఇన్ చార్జి కిరణ్ రాయల్ వివాదం మరో మలుపు తిరిగింది. జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్ తనను మోసం చేశాడని తిరుపతికి చెందిన లక్ష్మి వారం రోజుల క్రితం ఆరోపించిన విషయం తెలిసిందే. రూ.1.20 కోట్ల నగదు, 25 సవర్ల బంగారం తీసుకుని కిరణ్ రాయల్ తనను మోసం చేశాడని బాధితురాలు సెల్ఫీ వీడియో విడుదలచేశారు. అంతేకాకుండా ఆయనతో ఆమె సన్నిహితంగా ఉన్న కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కిరణ్ రాయల్ మెడలో ఆమె తన బంగారం చెయిన్ వేసిన వీడియోను ప్రతిపక్షాలు తీవ్రంగా ట్రోల్ చేశాయి. దీంతో కిరణ్ రాయల్ కూడా బాధితురాలు లక్ష్మిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె మోసకారి అంటూ ఆరోపించడమే కాకుండా, లక్ష్మిపై దేశవ్యాప్తంగా కేసులు పెండింగులో ఉన్నాయని వెల్లడించారు. దీంతో కిరణ్ రాయల్, లక్ష్మి మధ్య వివాదం రాష్ట్రవ్యాప్తంగా హీట్ పెంచింది. కిరణ్ రాయల్ వీడియోలు వైరల్ అవడంతో జనసేన కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆయనను ఆదేశించింది. ఈ వ్యవహారంలో నిజానిజాలు తేల్చాలంటూ పార్టీ కమిటీని ఆదేశించింది. జనసేన నాయకత్వం జోక్యం చేసుకున్న తర్వాత ఈ వివాదం మరో మలుపు తిరిగింది. పార్టీ నష్ట నివారణ చర్యలు మొదలుపెట్టిన మరునాడే.. తిరుపతిలో రాజస్థాన్ పోలీసులు ప్రత్యక్షమయ్యారు. ముందు సెల్ఫీ వీడియో విడుదల చేసిన లక్ష్మి ఆ తర్వాత నేరుగా మీడియా ముందుకు వచ్చి కిరణ్ రాయల్ ను టార్గెట్ చేశారు.



## ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్?కు తప్పిన ముప్పు.. అసలేం జరిగిందంటే..

**చెన్నై-నవభూమి:** కరూర్ జిల్లా తిరుకాంబులియూర్ ప్రాంతాల్లో రైలు పట్టాలపై ఏర్పడిన పగుళ్లను సకాలంలో గుర్తించడంతో ఎర్నాకుళం-కారైక్కాల్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పింది. తిరుకాంబులియూర్ మార్గంలో మంగళవారం ఉదయం రైల్వే రిటైర్డ్ ఉద్యోగి కలియమూర్తి వెళ్తున్న సమయంలో, రైలు పట్టాలపై పగుళ్లను గుర్తించాడు. కలియమూర్తి ఈ విషయాన్ని వెంటనే గ్యాంగ్‌మెన్‌లకు తెలియజేశాడు. అదే సమయంలో వస్తున్న ఎర్నాకుళం-కారైక్కాల్ ఎక్స్‌ప్రెసకు గ్యాంగ్‌మెన్‌లు




ఎర్రజెండా చూపించి నిలిపివేశారు.
పగుళ్లు ఏర్పడిన వంద మీటర్ల దూరంలోనే రైలు నిలవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే, వాస్కోడిగామా-వేలాంకన్ని ఎక్స్‌ప్రెస్ మాయనూరు రైల్వేస్టేషన్‌లో, కరూర్-తిరుచ్చి అన్ రిజర్వ్‌డ్ రైలు వీరాక్కియం రైల్వేస్టేషన్‌లలో నిలిపివేశారు. పగుళ్లు ఏర్పడిన ప్రాంతాన్ని కార్మికులు సరిచేయడంతో 45 నిమిషాలు ఆలస్యంగా ఎర్నాకుళం-కారైక్కాల్ ఎక్స్‌ప్రెస్ బయల్దేరి వెళ్లింది.

## ఇంద్రాణి ముఖర్జీ విదేశీ పర్యటన అభ్యర్థనపై సుప్రీం ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలంటూ షీనా బోరా హత్య కేసు )లో కీలక నిందితురాలు ఇంద్రాణీ ముఖర్జీ చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు బుధవారంనాడు తోసిపుచ్చింది. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను న్యాయమూర్తులు ఎంఎం సుందరేశన్, రాజేష్ బిందాల్‌లో కుడిన సుప్రీం ధర్మాసనం సమర్ధించింది. ఏడాది లోగా కేసు విచారణను పూర్తి చేయాలని విచారణ కోర్టును ఆదేశించింది."మీరు విదేశాల నుంచి తిరిగి వస్తారనే గ్యారెంటీ లేదు. కేసు విచారణ తుది దశకు చేరుకుంది. ఈ దశలో మీ అభ్యర్థనను పరిశీలించలేం. విచారణను వేగవంతం చేసి ఏడాదిలోగా పూర్తి చేయాలని విచారణ కోర్టును ఆదేశిస్తున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. ఇంద్రాణి ముఖర్జీ ట్రయిల్ కోర్టుకు వెళ్లేందుకు కూడా సుప్రీం ధర్మాసనం అనుమతించింది.దీనికి మందు, ముఖర్జీ విదేశాలకు వెళ్లేందుకు చేసుకున్న అభ్యర్థనను సీబీఐ తరఫు న్యాయవాది వ్యతిరేకించారు. ఇది సున్నితమైన కేసు అని, విచారణ సగానికి పైగా పూర్తయిందని, 96 మంది సాక్ష్యులను విచారించామని కోర్టుకు తెలిపారు. ముఖర్జీ తరఫు న్యాయవాది వాదన వినిపిస్తూ, సుప్రీంకోర్టు ఆమెకు బెయిలు ఇచ్చిందని, అయితే ఈ కేసులో ఇంకా 92 మంది సాక్ష్యులను విచారించాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. నాలుగు నెలలుగా ట్రయిల్ కోర్టు చేసిందేమీ లేనందున విచారణ మరింత జాప్యం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇంద్రాణి ముఖర్జీ స్పెయిన్, యూకే పర్యటనకు ప్రత్యేక కోర్టు గత జూలై 19న అనుమతి ఇచ్చింది. అయితే, దీనిపై సీబీఐ ముంబై హైకోర్టుకు వెళ్లడంతో ప్రత్యేక కోర్టు ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. ఈ నిర్ణయాన్ని ఇంద్రాణి ముఖర్జీ అత్యున్నత న్యాయస్థానంలో సవాలు చేశారు. 2012లో తన కుమార్తె షీనా బోరా హత్య కేసులో ప్రధాన నిందితురాలైన ఇంద్రాణి ముఖర్జీ 2015 నుంచి జైలులో ఉంటున్నారు. ఆమెకు 2022లో సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది.

## మహారాష్ట్రను వణికిస్తున్న జీబీఎస్.. 8కి చేరిన మృతుల సంఖ్య.. కేసులు ఎన్నంటే?




**ముంబై-నవభూమి:**మహారాష్ట్ర ప్రజలను గులియన్ బారే సిండ్రోమ్ వణికిస్తోంది. రోజురోజుకూ మృతుల సంఖ్య పెరుగుతుండగా.. కేసులు కూడా అంతకంతకూ ఎక్కువ అవుతున్నాయి. ఓవైపు వైద్యారోగ్య శాఖ చర్యలు తీసుకుంటున్నా కేసులు, మృతుల సంఖ్య పెరగడంతో.. ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముంబైలోనూ తొలి మరణం నమోదు కాగా.. మొత్తం మృతుల సంఖ్య 8కి చేరుకుంది. అలాగే ఈరోజు నమోదు అయిన 5 కేసులతో మొత్తం కేసుల సంఖ్య 172కు చేరుకుంది. ఆ పూర్తి వివరాలు మీకోసం. ముందుగా పుణేలోనే ఎక్కువ గులియన్ బారే సిండ్రోమ్ కేసులు నమోదు కాగా.. కొన్నిరోజుల నుంచి ముంబయి నుంచి కూడా కేసులు వస్తున్నాయి. ముఖ్యంగా ఈరోజు కొత్తగా 5 కేసులు నమోదు కాగా.. 167గా ఉన్న కేసుల సంఖ్య.. 172కు చేరుకుంది. అలాగే ఈ వ్యాధి కారణంగా ఇప్పటి వరకు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అయితే తాజాగా ముంబయిలోనూ తొలి మరణం నమోదు అయింది. ఇలా మృతుల సంఖ్య 8కి చేరుకుంది. %వాడాలా ప్రాంతానికి చెందిన 53 ఏళ్ల వ్యక్తికి అనారోగ్యంగా ఉండడంతో జనవరి 22వ తేదీన ఆస్పత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు జీబీఎస్ సోకినట్లు 23వ తేదీన గుర్తించారు. ఆసుపత్రిలో వార్డు బాయ్‌గా పని చేస్తున్న ఇతడిని.. దవాఖానాలోనే ఉంచుకుని చికిత్స చేశారు. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తడంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. మూడు వారాలుగా వెంటిలేటర్ మీదే ఉన్న అతడి పరిస్థితి మరింత విషమించగా.. మంగళవారం రోజు ప్రాణాలు కోల్పోయాడు.ఈ విషయాన్ని నేరుగా మహారాష్ట్ర వైద్యారోగ్య శాఖయే వెల్లడించింది. ముఖ్యంగా 172 గులియన్ బారే సిండ్రోమ్ కేసులు నమోదు కాగా.. అందులో పుణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 40, ఇతర గ్రామాల నుంచి 92, పింప్రి చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 29, పుణే రూరల్ ఏరియాలో 28, మిగతా జిల్లాల నుంచి 8 కేసులు ఉన్నట్లు చెప్పారు. ఇలాగే ఇప్పటి వరకు వ్యాధి సోకి ఆస్పత్రిలో చికిత్స పొందిన 104 మంది డిశ్చార్జ్ అయ్యారని చెప్పారు.ప్రస్తుతం 50 మంది రోజులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతుండగా.. మరో 20 మంది వెంటిలేటర్లపై ఉన్నట్లు వివరించారు. అలాగే రోగుల కడుపులో ఇన్ఫెక్షన్ ఉందని.. ఇది ఎక్కువగా క్యాంపిలోబాక్టర్ బెజుని అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని చెప్పారు. ప్రభావిత ప్రాంతాల నుంచి సేకరించిన నీటి నమూనాల్లో ఈ సూక్ష్మజీవిని కూడా అధికారులు గుర్తించినట్లు వెల్లడించారు.

## బర్డ్ ఫ్లూ కలకలం.. 7 వేలకు పైగా కోళ్లను చంపిన మహారాష్ట్ర సర్కారు!



**చంద్రాపూర్-నవభూమి:**రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రను బర్డ్ ఫ్లూ కుదిపేస్తోంది. ఇప్పటికే బర్డ్ ఫ్లూ కారణంగా అనేక కోళ్లు, పక్షులు, జంతువులు మృత్యువాత పడగా.. తాజాగా మహారాష్ట్ర సర్కారే కోళ్లను చంపేస్తోంది. అలాగే బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే గుడ్లను సైతం నాశనం చేస్తోంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్కారు చెబుతుండగా.. ప్రజలంతా తీవ్రంగా భయపడిపోతున్నారు. ఆ పూర్తి విశేషాలు మీకోసం.మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి ఒకటవ తేదీ నుంచి బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతమైన 7 ప్రాంతాలను గుర్తించింది. ఈక్రమంలోనే అక్కడ ఉన్న 7,200 కోళ్లను చంపేసింది. అలాగే 2 వేల 230 గుడ్లను నాశనం చేసింది. చంద్రపూర్ జిల్లాలోని మంగ్లీ గ్రామంలో తాజాగా బర్డ్ ఫ్లూ వ్యాప్తిని చెందింది. ఈక్రమంలోనే అక్కడి నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఇప్పటికే 2,065 కోళ్లు చనిపోయాయి.
అయితే విషయం గుర్తించిన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతం నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని కోళ్లు, గుడ్లు, పశుగ్రాసాన్ని నాశనం చేయాలని నిర్ణయించింది. ఈక్రమంలోనే చంద్రాపూర్ జిల్లాలో 1,165 గుడ్లతో పాటు 50 కిలోల దాణాను నాశనం చేయించింది. అలాగే కోళ్ల పెంపకం దారులకు నష్ట పరిహారంగా రూ.2,91,963 అందించారు.ఫిబ్రవరి 6వ తేదీ వరకు మహారాష్ట్రలోని లాతూర్, నాందేడ్, నాగ్‌పూర్, థానే, రాయ్‌గఢ్, చంద్రాపూర్ జిల్లాల నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 7 బర్డ్ ఫ్లూ ప్రభావిత కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా లాతూర్ జిల్లాలోని ఉద్గిర్ తాలూకాలో 71 కాకులు చనిపోయాయి. ఈక్రమంలోనే వీటికి పరీక్షలు చేయగా.. బర్డ్ ఫ్లూ కారణంగానే ఇవి ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు.కేవలం కాకులు, కోళ్లలోనే కాకుండా పులులు, చిరుతలు, రాబందుల్లోనూ బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయినట్లు వివరించారు. అలాగే నాగ్‌పూర్‌లోని గోరేవాడ రెస్క్యూ సెంటర్‌లో ఉంచిన 3 పులులు, ఒక చిరుత పులి సహా 693 జంతువులు, పక్షులు బర్డ్ ఫ్లూ కారణంగా చనిపోయిట్లు తెలిపారు. ముఖ్యంగా ఇందులో మూడు తెల్లటి వీపు గల రాబందులు కూడా ఉన్నట్లు చెప్పారు.పశు సంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ.. వ్యవస్థీకృత పౌల్ట్రీ సంస్థల నుంచి ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నివేదించబడలేదని తెలిపారు. కోళ్ల ఫాంల యజమానులు బయో భద్రతా చర్యలు చేపట్టారని.. ముఖ్యంగా కోళ్లు వలస పక్షులతో సంబంధంలోకి రాకుండా చూసుకుంటున్నాయని చెప్పుకొచ్చారు.

## ప్రభుత్వాస్పత్రిలోవిధులకు వైద్యుల డుమ్మా..



**చెన్నై-నవభూమి:** పోరూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్ళిన తమిళ సినీ హాస్యనటుడు గంజా కరుప్పు అక్కడ వైద్యులు విధులకు హాజరు కాలేదని తెలిసి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగుల బంధువులతో కలిసి ఆకస్మికంగా ధర్నాకు దిగారు. మంగళవారం ఉదయం గంజాకరుప్పు కాలినొప్పితో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్ళారు. ఆ సమయంలో వైద్యులెవరూ లేకపోవడం గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.చాలా సేపటివరకూ వేచిఉన్నప్పటికీ వైద్యులెవరూ రాలేదు. అదే సమయంలో కొన ఊపిరితో ఉన్న ఓ వృద్ధురాలిని తీసుకువచ్చారు. అంతేగాక కుక్కకాటుకు గురైన వ్యక్తి కూడా లబోదిబోమంటూ చికిత్స కోసం వచ్చాడు. కానీ డాక్టర్లు లేకపోవడంతో వారు కారిడార్‌లోనే వుండిపోవాల్సివచ్చింది. దీంతో ఆగ్రహం చెందిన గంజాకరుప్పు ఆస్పత్రి సిబ్బందితో వాగ్వివాదానికి దిగడమే కాకుండా రోగుల బంధువులతో కలిసి ధర్నా చేశారు.ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తూ లక్షలాది రూపాయలను జీతంగా తీసుకుంటున్న డాక్టర్లు ఉదయం 8 గంటలకు డ్యూటీకి హాజరుకావాల్సి ఉండగా మధ్యాహ్నం 3 వరకు ఆస్పత్రి ఛాయలకు కూడా రావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాపాయ స్థితిలో వచ్చేరోగులకు చికిత్స చేసేందుకు ఆస్పత్రిలో అందుబాటులో ఎవరూ లేరని, ఈ విషయమై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని గంజాకరుప్పు డిమాండ్ చేశారు.

## సిక్కుల ఊచకోత కేసులో దోషిగా తేలిన కాంగ్రెస్ మాజీ ఎంపీ



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ ను రౌస్ అవెన్యూ కోర్టు దోషిగా తేల్చింది. 1984 నవంబర్ 1న సరస్వతి విహార్ ప్రాంతంలో తండ్రీకొడుకుల హత్య కేసులో ఆయన ప్రమేయం ఉన్నట్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా బుధవారంనాడు తీర్పునిచ్చారు. శిక్షపై వాదనలు వినేందుకు కేసును ఫిబ్రవరి 19వ తేదీకి వాయిదా వేశారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లో జరిగిన మరో సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో ప్రస్తుతం సజ్జన్ కుమార్ యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నారు.తీర్పు సందర్భంగా సజ్జన్ కుమార్‌ను తీహార్ జైలు నుంచి బుధవారంనాడు కోర్టు ముందు హాజరుపరిచారు. 1984 నవంబర్ 1న జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్ దీప్ సింగ్ హత్య కేసులో కోర్టు ఆయనను దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.

**1984లో ఏమి జరిగింది?**

ప్రాసిక్యూషన్ వాదన ప్రకారం, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్యానంతరం ఒక పెద్ద గుంపు మారణాయుధాలతో విరుచుకుపడింది. సిక్కులను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున లూటీలు, గృహదహనాలకు పాల్పడింది. అల్లరిమూక సింగ్, ఆయన కుమారుడిని హత్య చేసి ఇల్లు లూటీ చేసిందని, ఆ తర్వాత ఇంటికి నిప్పుపెట్టిందని ప్రాసిక్యూషన్ పేర్కొంది. సజ్జన్ కుమార్ కేవలం ఈ అల్లర్లలో పాల్గొనడమే కాకుండా ఆ గుంపునకు నాయకత్వం వహించాడని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు తగిన సాక్ష్యాలు లభించాయని తెలిపింది.కాగా, సజ్జన్ కుమార్‌ను దోషిగా కోర్టు ప్రకటించడాన్ని ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజిమెంట్ కమిటీ (డీఎస్‌జీఎంసీ) ప్రధాన కార్యదర్శి జగ్‌దీప్ సింగ్ కహ్లోన్ స్వాగతించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా సిట్‌ను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మూసేసిన కేసులను తిరిగి ఇన్వెస్టిగేట్ చేయడం వల్ల ఈ ఫలితం వచ్చిందని, జగ్‌దీష్ టైట్లర్ల విషయంలోనూ న్యాయం జరుగుతుందని తాము ఆశిస్తున్నామని చెప్పారు. 1984 సిక్కు అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్‌ను దోషిగా నిర్ధారిస్తూ 2018లో తీర్పు వెలువడింది. ఆయనకు యావజ్జీవ జైలుశిక్ష పడింది.

## ఉచితాలతో ప్రజలను సోమరులుగా మారుస్తున్నారు..
# సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఉచితాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటించిన ఉచితాలను తప్పుబట్టింది. ఉచితంగా రేషన్, నగదు అందుతుండటంతో ప్రజలు పనిచేయడానికి ఇష్టపడటం లేదని వ్యాఖ్యానించింది. ఉచితాలతో పని చేయకుండా ఆహారం, డబ్బు సంపాదిస్తున్నారని పేర్కొంది. ఎన్నికల్లో ఉచిత పథకాలను ప్రకటించే విధానం మంచిది కాదని అభిప్రాయపడింది. ఉచిత పథకాలతో లబ్దిదారులను పరాన్నజీవులుగా మారుస్తు న్నామని జస్టిస్ బిఆర్ గవాయ్ మండిపడ్డారు. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. ఈ అంశంపై విచారణను ఆరు వారాల పాటు వాయిదా వేసింది.
జనవరిలోనూ సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. ఎన్నికలు రాగానే లాడ్లీ బెహెన్‌తో పాటు పలు పథకాలను ప్రకటించి.. సొమ్ములను పంచిపెడతారని మండిపడింది. ఢిల్లీలో ఇప్పుడు ఓ పార్టీ రూ.2,500 ఇస్తామంటే.. ఇంకో పార్టీ తాము దీనికి రెట్టింపు ఇస్తామని హామీ ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉచితాలకు డబ్బులు ఉంటాయని, కోర్టుల్లో పనిచేసే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి మాత్రం ఉండవని తూర్పారబట్టింది. గతంలో సీనియర్ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సమయంలో ఉచితాలు అంటే ఏమిటి? అని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిని తాము అడ్డుకోలేమని తేల్చిచెప్పింది. అంతేకాదు, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, తాగునీరు వంటివి సౌకర్యాలు ఉచితాలుగా పరిగణించవచ్చా? ప్రజల హక్కా..? అని ప్రశ్నించిందిఅయితే, ఉచితాలపై అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. 2013లో సుబ్రమణ్యం బాలాజీ కేసులో మాత్రం భిన్నమైన వ్యాఖ్యలు చేసింది. 'అర్హులైన వ్యక్తులకు కలర్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు మొదలైన వాటి రూపంలో పెద్ద మొత్తంలో పంపిణీ చేయడం అనేది నేరుగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించింది.. ఇందులో జోక్యం చేసుకోలేము' అని కోర్టు స్పష్టం చేసింది.
కాగా, ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ పోటాపోటీగా ఉచితాలను ప్రకటించాయి. దీనిని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత తాయిలాలు.. నగదు ఆధారిత పథకాలపై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు. దీనిని పరిశీలించిన హైకోర్టు. అత్యవసరంగా విచారించేందుకు నిరాకరించింది

## ప్రధాని ప్రయాణ విమానంపై ఉగ్రదాడి బెదిరింపు కాల్.. తర్వాత ఏమైందంటే..



**చెంబూర్-నవభూమి:**చాలా రోజుల తర్వాత మళ్లీ ఫేక్ కాల్స్ భయాందోళన మొదలైంది. ఇది వరకు దేశంలోని పలు విమానాశ్రయాల్లో బాంబులు పెట్టారని పలువురు ఫోన్ కాల్స్ చేయడంతో అనేక ఫ్లైట్స్ ఆలస్యంగా ప్రయాణించిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాదు కొన్ని స్కూల్స్, ఆస్పత్రుల విషయంలో కూడా ఇలాగే జరిగింది. ఈ క్రమంలోనే తాజాగా మళ్లీ ఇదే అంశం వెలుగులోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక విదేశీ పర్యటనకు ముందు, ఆయన ప్రయాణించనున్న విమానంపై ఉగ్రవాద దాడి జరిగే అవకాశం ఉందని బెదిరింపు కాల్ వచ్చింది.ముంబై పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫిబ్రవరి 11, 2025న ఈ సమాచారం వచ్చింది. ఈ కాల్ వచ్చిన వెంటనే ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిని ఎవరు చేశారనే సమాచారం తెలుసుకుని, చెంబూర్‌కు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఆ క్రమంలో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో ఈ వ్యక్తి కాల్‌లో ప్రధానమంత్రి మోదీ ప్రయాణించనున్న విమానంపై ఉగ్రవాద దాడి జరిగే అవకాశం ఉందని హెచ్చరించినట్లు చెప్పాడు. అయితే ఆ వ్యక్తిచే ఎవరైనా కావాలని ఫోన్ చేయించారా లేదా ఆకతాయి చేష్టలతో ఫోన్ చేశాడా అనే వివరాలు తెలియాల్సి ఉంది.

**నెటిజన్ల ఆగ్రహం...**ఈ క్రమంలో అరెస్టు చేసిన వ్యక్తిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారణ కొనసాగిస్తున్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తేలాల్సి ఉంది. బెదిరింపు కాల్ నేపథ్యంలో ముంబై పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దీంతోపాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమాచారం తెలిసిన నెటిజన్లు ఇలాంటి పేక్ కాల్స్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ ఇలాంటివి చేయకుండా వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అవినీతిమయ దేశాల జాబితా విడుదల! భారత్ పరిస్థితి ఏంటంటే..


**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ దేశాల్లో అవినీతి ఏ స్థాయిలో ఉందో చెబుతూ ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టీఐ) సంస్థ కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్‌ను విడుదల చేసింది. అవినీతి అత్యల్పంగా ఉన్న డెన్మార్క్ ఈ జాబితాలో తొలి స్థానం సొంతం చేసుకోగా భారత్ 96వ స్థానంలో నిలిచింది. వివిధ దేశాల్లోని నిపుణులు, వ్యాపారుల అభిప్రాయాల ఆధారంగా ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉన్నదో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ముదింపు వేసింది. మొత్తం 180 దేశాలతో ఈ లిస్టు సిద్ధం చేసింది. అత్యంత అవినీతిమయ దేశాలకు సున్నా స్కోరు, అవినీతి ఇసుమంతైనా లేని దేశాలకు 100 స్కోరు కేటాయించింది.ఈ లిస్టు ప్రకారం, గత నివేదికలతో పోలిస్తే భారత్ స్కోరు స్వల్పంగా తగ్గింది. 2023 నివేదికలో భారత్ 38 పాయింట్లు, 2022 నాటి రిపోర్టులో 40 పాయింట్స్ సాధించింది. తాజాగా 2024 రిపోర్టులో భారత్ స్కోరు 38గా నిర్ధారించారు. ఇక భారత్ పొరుగు దేశాలై పాకిస్థాన్ 135వ స్థానం, శ్రీలంక 121 స్థానంలో ఉన్నాయి. బంగ్లాదేశ్ 149 స్థానంలో ఉండగా చైనా 76వ ర్యాంకు సొంతం చేసుకుంది.గతశతాబ్దంలో ఎన్నడూ లేని విధంగా అనేక దేశాల్లో అవినీతి పెరిగిందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ పేర్కొంది. అగ్రరాజ్యాలైన అమెరికా, ఫ్రాన్స్‌తో పాటు నిరంకుశత్వ పాలన సాగుతున్న రష్యా, వెనిజువెలాలో కూడా ప్రభుత్వాల అవినీతి పెరిగిందని టీఐ పేర్కొంది. అమెరికా స్కోరు 69 నుంచి 65 పాయింట్లకు తగ్గి 24 స్థానం నుంచి 28 స్థానానికి పడిపోయింది.

## నగ్నంగా నిలబెట్టి.. మర్మాంగాలకు డంబెల్స్ వేలాడదీసి.. దారుణమైన ర్యాగింగ్



**కొట్టాయం-నవభూమి:**గత నెల కేరళలో 15 ఏళ్ల మిహిర్ అహ్మద్ ఆత్మహత్య యావత్ దేశాన్ని కుదిపేసింది. తాము ఉంటోన్న అపార్ట్‌మెంట్ భవనం 26వ అంతస్తులోని ఫైర్ ఎగ్జిట్ విండో నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. ఆ బాలుడు ప్రాణాలు పోవడానికి తోటి విద్యార్థుల ర్యాగింగ్ కారణం. తాజాగా, కేరళలో అలాంటి మరో అమానవీయ ఘటన వెలుగులోకి వచ్చింది. జూనియర్లపై సీనియర్ల దాష్టీకానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
ర్యాగింగ్ పేరుతో జూనియర్ల పట్ల సీనియర్ల అత్యంత క్రూరంగా వ్యవహరించారు. వారిని నగ్నంగా మార్చి.. ప్రయివేట్ పార్ట్స్‌కు డంబెల్స్ వేలాడదీసి, జామెట్రీ బాక్సులోని కంపాస్‌తో పొడిచి పైశాచిక ఆనందం అనుభవించారు. ఒకటి రెండు రోజులు కాదు ఏకంగా మూడు నెలల పాటు వికృత చర్యలతో జూనియర్లను హింసించి నరకం చూపించారు. శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసిన అత్యంత భయానక ఈ ఘటన కేరళలోని ఓ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారి దాష్టీకం బయటపడింది.
కొట్టాయంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో మొదటి ఏడాది విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో హింసించిన ఐదుగురు థర్డ్ ఇయర్ స్టూడెంట్స్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువనంతపురానికి చెందిన జూనియర్ విద్యార్థులు కొట్టాయం గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నవంబరు నుంచి సీనియర్ల తమను చిత్రహింసలకు గురిచేశారని వాపోయారు. బలవంతంగా బట్టలు విప్పదీయించి, మర్మాంగాలకు డంబెల్స్ కట్టి వికృత ఆనందం పొందారని కన్నీళ్లు పెట్టుకున్నారు.వారి క్రూరత్వం అక్కడితో ఆగలేదు. జామెట్రీ బాక్సులో కాంపాస్ సహా పదునైన వస్తువులతోనూ రక్తం వచ్చేలా గుచ్చి ఆయ గాయాలకు లోషన్ రాసి హింసించారు. బాధితులు బాధతో కేకలు వేస్తుంటే, లోషన్‌ను బలవంతంగా వారి నోటిలోకి పూసేవారు. ఈ దుశ్చర్యలను వీడియో తీసి, ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారు. ప్రతి ఆదివారం మద్యం పార్టీల కోసం జూనియర్ల నుంచి డబ్బులు లాక్కునేవారు. ఎవరైనా ఎదురుతిరిగితే దారుణంగా కొట్టేవారు. వారి ఆగడాలను తట్టుకోలేకపోయిన ఓ విద్యార్థి తన తండ్రికి చెప్పడంతో ఆయన సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.మూడు నెలల పాటు వాటి ఆగడాలను మౌనంగా భరించిన విద్యార్థులు.. శ్రుతిమించడంతో చివరకు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదుతో యాంటీ ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదుచేసి.. ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న నిందితులు.. మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నారు. కొద్ది వారాల కిందట 15 ఏళ్ల బాలుడు మిహిర్ అహ్మద్.. తోటి విద్యార్థుల ర్యాగింగ్ కారణంగా 26 అంతస్తులు ఎత్తైన భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేరళలో సంచలనం రేపింది. ఈ ఘటన వెలుగులోకి రావడం గమనార్హం.

## ఈవీఎంలలో డాటా తొలగించవద్దు ఎన్నికల కమిషన్‌కు సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో డాటాను తొలగించడం లేదా జోడించడం చేయవద్దని సుప్రీంకోర్టు మంగళవారం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈవీఎంల నుంచి డాటాను తొలగించడానికి అనుసరిస్తున్న ప్రామాణిక నిర్వహణ పద్ధతి ఏమిటో తెలపాలని కూడా నిర్దేశించింది. ఒకవేళ ఎన్నికలలో ఓడిపోయిన అభ్యర్థి కోరితే... ట్యాంపరింగ్ జరగలేదని వివరణ ఇవ్వగలిగేలా ఉండాలని పేర్కొంది. ఏడీఆర్, పలువురు కాంగ్రెస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కూడా ఈవీఎంల నుంచి డాటాను తొలగించవద్దని ఈసీని ఆదేశించాలని పిటిషనర్లు కోరారు.

## ఆ ఎంజైమ్‌ను అడ్డుకుంటే క్యాన్సర్‌కు చెక్!

**సోల్-నవభూమి:** శరీరంలో ఉండే ఆరోగ్యవంతమైన కణాలు.. క్యాన్సర్ కణాలుగా మారకుండా ఆపే ప్రక్రియను నిరోధించే ఒక ఎంజైమ్‌ను దక్షిణ కొరియా శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఆ ఎంజైమ్‌ను నిరోధించడం ద్వారా.. క్యాన్సర్ కణాలు తిరిగి సాధారణ కణాలుగా మారుతాయని ప్రయోగశాలలో వారు చేసిన పరిశోధనల్లో తేలింది! మానవాళికి పెనుముప్పుగా మారిన క్యాన్సర్ మహమ్మారిపై ప్రపంచవ్యాప్తంగా శాస్త్రజ్ఞులు సాగిస్తున్న పోరులో కీలక మైలురాయిగా నిలిచిపోయే ప్రయోగమిది. శరీరంలో క్యాన్సర్ కణాలు తొలగించడానికి శస్త్రచికిత్స, కీమో థెరపీ, రేడియేషన్, ఇమ్యూనోథెరపీ అందుబాటులోకి ఉన్నాయి. వీటివల్ల కొన్ని దుష్ప్రభావాలున్నా వాటివల్ల కలిగే మేలే ఎక్కువ కాబట్టి వైద్యనిపుణులు ఈ చికిత్సలను చేస్తూ వస్తున్నారు. అయితే, దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు దీనికి భిన్నంగా ఆలోచించారు. సాధారణ కణాలు క్యాన్సర్ కణాలుగా మారాక చికిత్స చేసే కంటే.. అసలు అవి ఎందుకు క్యాన్సర్ కణాలుగా మారుతున్నాయో గుర్తించి, అలా మారకుండా అడ్డుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. పెద్దపేగు క్యాన్సర్‌కు సంబంధించిన కణాలను సేకరించి.. వాటితో ప్రయోగశాలలో చిన్నచిన్న కణితులను అభివృద్ధి చేశారు. సాధారణ కణాలు క్యాన్సర్ కణాలుగా మారేలా చేసే ప్రొటీన్లను నాశనం చేసే వ్యవస్థ పనిచేయకుండా అడ్డుకుంటున్న ఎంజైమ్‌ను గుర్తించారు. తాము ల్యాబ్‌లో పెంచిన అర్గనాయిడ్లలో ఆ ఎంజైమ్‌ను నిరోధించారు. అంతే.. ఆ క్యాన్సర్ కణాల (అర్గనాయిడ్ల) పెరుగుదల ఆగడమే కాక, అవి మళ్లీ సాధారణ కణాలుగా మారాయని వారు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రయోగాల దశలో ఉన్న ఈ చికిత్స భవిష్యత్తులో క్యాన్సర్ ట్రీట్‌మెంట్ గతినే మార్చేస్తుందని అమెరికాకు చెందిన ప్రముఖ ఆంకాలజిస్టు డాక్టర్ టిఫనీ ట్రోసో శాండోవల్ తెలిపారు.

## కుంభమేళా సందర్భంలో మేడారం ముచ్చట!

ప్రయాగరాజ్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న కుంభమేళా నేపథ్యంలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. దేశంలోనే ఆ మాటకొస్తే ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం జాతరకు కేవలం నాలుగురోజుల్లోనే కోటిన్నర మంది భక్తులు హాజరవుతారు. వీరిలో దాదాపు 60శాతం మంది గిరిజనులు, 30శాతం మంది అట్టడుగు వర్గాల వారు ఉంటారు. కనీస సౌకర్యాలు లేకున్నప్పటికీ కేవలం గిరిజన దేవతలైన సమ్మక్క సారాలమ్మ, గోవిందరాజు పగిడిద్ద రాజు, జంపనల ఆత్మబలిదానాలను గుర్తు చేసుకుంటూ వారిని దర్శించుకునే అపురూప ఘట్టం రెండేళ్లకోసారి ఆవిష్కృతమవుతుంది. ఫిబ్రవరి 12 నుంచి సంక్షిప్తరూపంలో మినీజాతర జరుగుతుంది.

మేడారం జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రాంతాలతో పాటు, ఛత్తీస్‌గఢ్ నుండి గుత్తి కోయలు, ఆదివాసీలుబీ జార్కండ్, మహారాష్ట్ర నుంచి గోండులు, కోయలు, లంబాడాబీ మధ్యప్రదేశ్ నుంచి బిల్లులు, రతీసాగర్ గోండులుబీ ఒరిస్సా నుంచి సవర ఆదివాసీలు కూడా పెద్ద ఎత్తున తరలివస్తారు. ప్రపంచంలో ఆదివాసీలు ఇంత పెద్ద ఎత్తున హాజరయ్యే వేడుక మరొకటి లేదు. ఆదివాసీలు కాకుండా ఇతర మత, వర్గ, వర్ణాల వారు కోట్లాదిగా హాజరయ్యే ప్రార్థనాలయాలు, పూజా స్థలాలు-శబరిమల, మక్కా, జెరూసలేం, కుంభమేళా, తిరుపతి వంటివి-ఉన్నాయి. కానీ ఏమాత్రం కనీస సౌకర్యాలు లేకుండా, దట్టమైన అటవీ ప్రాంతంలో, కేవలం కొయ్యలను కోయ దేవతలుగా భావిస్తూ పూజించడానికి కోటిన్నరమంది రావడం ప్రపంచంలోనే మరెక్కడా కానరాదు. అందుకే, దీనిని, అత్యంత అరుదైన జన జాతరగా భావించవచ్చు.

ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.7500కోట్లతో వివిధ సౌకర్యాలను కల్పించింది. ఈ మహామేళావల్ల ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి 25 వేల కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనా. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు కూడా జాతీయ హోదా కల్పిస్తే గిరిజన జిల్లాగా పేరొందిన ములుగు జిల్లా రూపురేఖలు మారడమే గాక, ఆదివాసీ గిరిజన కుటుంబాలు ఆర్థిక పురోభివృద్ధిని సాధిస్తాయి. జాతర మేడారం కుగ్రామంలో సాగడం, నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు కోటిన్నర మంది హాజరు కావడం, పూర్తిగా గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలను ఈ జాతరలో అనుసరించడం తదితర కారణాలు దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి అనువుగా ఉన్నాయి. ఇటీవలే మన రాష్ట్రంలోని సుప్రసిద్ధ కాకతీయ కట్టడం రామప్ప రుద్రేశ్వరాలయానికి యునెస్కో గుర్తింపు లభించింది. ఇదే కోవలో యునెస్కో ఇంటాంజిబుల్ కల్చరల్ విభాగం క్రింద మరో అద్భుతమైన గిరిజన సాంస్కృతిక వేడుకగా నిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు కూడా అంతర్జాతీయ గుర్తింపు లభించేందుకు అన్ని అర్హతలూ ఉన్నాయి.

మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో పాటు తాడ్వాయి మండలానికి సమ్మక్క సారలమ్మ పేరు పెట్టింది. ఈ జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆదివాసీ, గిరిజన సంఘాలు ఎంతోకాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. అటు చారిత్రక శిల్పసంపద ఉన్న రామప్ప దేవాలయం, ప్రకృతి సౌందర్యంతో అలరాడే లక్నవరం చెరువు, విస్తారమైన అటవీప్రాంతం, వేలసంవత్సరాల నాటి శిలాజాలు ఉన్న పాండవుల గుట్ట, సహజంగా పారే గోదావరీ నదీ... ఇలా ప్రతీ అంశంలోనూ ప్రత్యేకత గాంచిన ములుగు జిల్లాలోని మేడారం జాతరకు కూడా జాతీయ గుర్తింపు లభించేందుకు అన్ని అర్హతలున్నాయి. ఈ గుర్తింపు లభిస్తే మేడారం జాతరపై అధ్యయనం చేయడానికి, ఇక్కడి గిరిజన, ఆదివాసీ సంస్కృతిని తెలుసుకోవడానికి వివిధ దేశాలనుండి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. రామప్పకు వరల్డ్ హెరిటేజ్ హోదా దక్కడంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర వహించింది. ఇప్పుడు మేడారం జాతరను జాతీయ పండగగా ప్రకటిస్తే దేశంలోని ఆదివాసీ గిరిజనుల పూర్తిస్థాయిలో మద్దతు లభించే అవకాశం కూడా ఉంటుంది.

# మనం మానవత్వం వైపా? రాక్షసత్వం వైపా?



ప్రజలు ఎటువైపో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మానవత్వం వైపా? రాక్షసత్వం వైపా? దేశంలో ఇటీవల జరుగుతున్నటువంటి సంఘటనలు తీవ్రమైనటువంటి ఆందోళనలు కలిగిస్తున్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో మధ్య భారతదేశం, అంబుజ్మడ్ ఛత్తీస్గడ్ దండకారణ్య ప్రాంతాలలో వేలాది సైనిక పోలీసు బలగాలు మోహరించబడి జరుపుతున్న మారణ కాండ చూస్తుంటే తీవ్ర ఆవేదనను కలిగిస్తుంది. ఆధునిక భారత సమాజంలో జరుగుతున్న విచ్చలవిడి హింసాకాండ మరో రక్తసిక్త చరిత్రను సృష్టిస్తుంది. ఇది రాజరిక కాలము నాటి సైనిక బలగాలు ఒక రాజ్యంపై మరో రాజ్యం జరుపుతున్నటువంటి ఘోర మారణకాండలా కనిపిస్తుంది. అనాగరిక సమాజంలో తెగల మధ్య యుద్ధాలు జరిగి ఒక తెగను ఇంకొక తెగ అంతం చేసిన చరిత్ర ఉన్నది. రాజరిక కాలంలో ఒక రాజ్యాన్ని ఇంకో రాజ్యం మట్టు పెట్టినటువంటి చరిత్ర మనం చూశాం. నాగరిక సమాజంలో ఒక దేశం ఇంకో దేశంపై దండేత్తి యుద్ధాలు చేసి ధ్వంసం చేయటాన్ని చూశాం. కానీ ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలో ఒక దేశానికి చెందిన పౌరులను ఆ దేశ ప్రభుత్వాలే అంతం చేయటం ప్రపంచంలోనే మొట్టమొదటిసారి ఇప్పుడే చూస్తున్నాం. అది మన భారత దేశంలోనే చూస్తున్నాం. భారతదేశ దండకారణ్య ప్రాంతంలో ఆదివాసీలపై జరుపుతున్న క్రూరమైన హింసాత్మక మారణకాండ. ఇది అత్యంత అమానుష దుర్మార్గ మారణకాండ. మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆపరేషన్ కగారులో జరుగుతున్న హింసాకాండ. ఇంత హింసను ప్రభుత్వాలు జరపటం దేశంలోనే ఇది మొదటిసారి కావచ్చు. 2025 జనవరి మాసంలో 65 మంది పైగా మావోయిస్టులు పేరుతోటి కాల్చి చంపబడ్డారు. ఫిబ్రవరిలో చంపబడిన వారు కూడా అంతే సంఖ్యతో సరి సమానం. ఇంతమందిని భారత సైనిక బలగాలను ఉపయోగించి ప్రభుత్వాలు ఎందుకు చంపుతున్నారని సామాన్య పౌరులు ప్రశ్నిస్తున్నారు పౌరులు ప్రశ్నించడం సహజం. ఎందుకంటే అవి ప్రాణాలు కాబట్టి, మానవ ప్రాణాలు కాబట్టి. మానవ ప్రాణం కంటే ఈ ప్రపంచంలో విలువైనది ఏదీ లేదు. ఒక ప్రాణం పోతే ఆ ప్రాణాన్ని తీసుకురావడం సాధ్యం కాదు. అత్యంత నిర్దయగా అమానవీయంగా చాలా సులువుగా అత్యంత ఆధునిక మారణాయుధాలను ఉపయోగించి అవలీలగా పదుల సంఖ్యలో ఎన్కౌంటర్ పేరు తోటి ఆదివాసి పుత్రులు చంపబడుతున్నారు. మావోయిస్టులను బోర్డు తగిలించేస్తున్నారు. ఎన్కౌంటర్ పేరుతో, ఆపరేషన్ పేరుతో జరుపుతున్నటువంటి ఈ దుర్మార్గపు మారణకాండలో మావోయిస్టులు ఎంతమంది సామాన్య పౌరులు ఎంతమందని లెక్కలు తేల్చలేని పరిస్థితి మానవ హక్కుల సంఘాలను, పౌర హక్కుల సంఘాలను, సమాజంలోని ఇతర మేధావులను ప్రజాస్వామిక వాదులను, అభ్యుదయ వాదులను క్రూరమైన మారణకాండ జరుగుతున్న ప్రాంతాలకు కాలు కూడా పెట్టనీయడం లేదు. కన్నెత్తి చూడటానికి కూడా వీలు లేకుండా తీవ్రమైనటువంటి అణచివేతను, నిర్బంధాన్ని ప్రభుత్వాలు ప్రయోగిస్తున్నాయి. ఒక ఆధునిక రాజ్యం ఇంత క్రూరమైనటువంటి అణచివేతను ప్రయోగించడం మనం మునుపెన్నడు ఎరుగం. అసలు మావోయిస్టులు ఎవరు? మావోయిస్టుల పేరుతో ఇంత హింసను కొనసాగించడం ఏమిటి. మావోయిస్టుల మేనిఫెస్టో నిబంధనలను పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది. వారి మేనిఫెస్టోలో సమసమాజాన్ని నిర్మించాలని ఇటువంటి ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకున్నట్లుగా తెలుస్తుంది. సమాజంలో పేదలు ధనికులు అనే తేడా లేకుండా కోరుకుంటున్నట్లుగా అర్థమవుతుంది. అదేవిధంగా ఒక మనిషిని వేరే మనిషి దోపిడీ చేయకూడదనే వారి సూత్రబద్ధ ఆలోచనగా తెలుస్తున్నది. అవినీతి అక్రమాలు లేని ఒక ఉన్నతమైనటువంటి సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లుగా అర్థమవుతున్నది. వారు ఈ సమాజంలోనే పౌరుల యోగ క్షేమాల కోసం పనిచేస్తున్న వారుగా చెప్పుకుంటున్నారు. అలాంటప్పుడు వారిని ఎందుకు ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వాలు వేటాడి వెంటాడి చంపుతున్నాయి అనేది ఒక ప్రశ్న. దీన్ని ప్రజలు సంపూర్ణంగా పరిశీలించే అర్థం చేసుకోవాల్సినటువంటి అవసరం ఉన్నది. వారు దండకారణ్య ప్రాంతంలో ఏం చేస్తున్నారు అనేది మనకు అర్థం కావాలి. అక్కడ ఉన్నటువంటి ఆదివాసీలకు అండగా నిలబడుతున్నారు. ప్రభుత్వాలు వారి పాదాల కిందట వంటి సహజ సంపదను అప్పనంగా ఈ దేశంలో ఉన్నటువంటి కొద్దిమంది కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం పనిచేస్తున్నాయి. అందుకే ఆదివాసీలను అక్కడ నుండి వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే వందలాది సైనిక పోలీసు మిలిటరీ బలగాలను మావోయిస్టుల ఏరువేత పేరుతో కూంబింగ్ లకు పాల్పడుతూ మారణకాండను సృష్టిస్తున్నారు. ఆదివాసీల పాదాల కింద ఉన్నటువంటి ఖనిజ సంపద, సహజ సంపద దేశ ప్రజలకు దక్కాలని కార్పొరేట్లకు దక్కకూడదని ఆదివాసీలను చైతన్యపరిచి ఆదివాసీలతో పోరాటాలు చేయిస్తున్నారు. ఆ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నారు. వారికి అండగా నిలబడ్డారు. అదే ప్రభుత్వాలకు కట్టగింపయింది. అందుకే మావోయిస్టులు ఏరివేత పేరుతో ఆదివాసీలను కాల్చి చంపుతున్నారని మావోయిస్టులు ప్రార్థిస్తున్నారు. ఇది సమాజంలో ప్రజలందరూ కాకపోయినా జగమెరిగిన సత్యం.




**నంబూరి శ్రీమన్నారాయణ**
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది
విజయవాడ, సెల్: 94938 61875

# ప్రపంచ దిశదశను మార్చిన రేడియో



**12 ఫిబ్రవరి నాడు ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా...**

ఈ రోజు మనం వాడుతున్న మొబైల్ ఫోన్, జిపిఎస్, వైఫై, బ్లూటూత్, హాట్ స్పాట్, ఇంటర్నెట్ లాంటి డిజిటల్ పరికరాలతో పాటు, దేశరక్షణ కోసం వినియోగిస్తున్న రాడార్లు, అంతరిక్షంలో సంచరిస్తున్న ఉపగ్రహాలు నుండి అందుకుంటున్న సకల సమాచారానికి రేడియో తరంగాలే ఆధారం !



**ప్రపంచ రేడియో దినోత్సవం:**

ప్రపంచ రేడియో దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న నిర్వహించబడుతుంది. 13 ఫిబ్రవరి 1946 నాడు ఐక్యరాజ్యసమితి రేడియో ప్రారంభ సందర్భంగా, 2011 నుండి ప్రతి ఏటా ఈ రోజున ఈ దినోత్సవం జరుపుకునేలా ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. రేడియో మాధ్యమ ప్రాధాన్యతను తెలియజేయడమే ఈ రోజు లక్ష్యం.

**రేడియో తరంగాలంటే ?**

సైన్స్ భాషలో చెప్పాలంటే రేడియో తరంగాలు విద్యుదయస్కాంత వర్ణపటంలో అత్యల్ప పౌనఃపున్యాలు, పొడవైన తరంగదైర్ఘ్యాలు కలిగిన ఒక రకమైన విద్యుదయస్కాంత వికిరణం. 1867లో స్కాటిష్ గణిత భౌతిక శాస్త్రవేత్త జేమ్స్ క్లర్క్ మాక్స్వెల్ ప్రతిపాదించిన విద్యుదయస్కాంత సిద్ధాంతం ద్వారా రేడియో తరంగాలను మొదట అంచనా వేశారు.1887లో జర్మన్ భౌతిక శాస్త్రవేత్త హెన్రిచ్ హెర్ట్జ్ తన ప్రయోగశాలలో కాంతి కంటే తక్కువ పౌనఃపున్యంలో విద్యుదయస్కాంత తరంగాలను ప్రయోగాత్మకంగా ఉత్పత్తి చేయడం ద్వారా మాక్స్వెల్ విద్యుదయస్కాంత తరంగాల వాస్తవికతను ప్రదర్శించాడు. ఇటాలియన్ ఆవిష్కర్త గుగ్లిఎల్మో మార్కోని 1894%-%1895 ప్రాంతంలో మొదటి ఆచరణాత్మక రేడియో ట్రాన్స్మిటర్లు రిసీవర్లను అభివృద్ధి చేశాడు. అతను తన రేడియో పనికి 1909లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. 1900 ప్రాంతంలో రేడియో కమ్యూనికేషన్ వాణిజ్యపరంగా ఉపయోగించడం ప్రారంభమైంది. ఆధునిక పదం " రేడియో వేవ్ " 1912 ప్రాంతంలో అసలు పేరు " హెర్టియన్ వేవ్ " స్థానంలో వచ్చింది.

**ప్రపంచంలో తొలి రేడియో ప్రసారాలు:**

అమెరికాలోని పిట్స్‌బర్గ్ లో 2 నవంబరు1920 న "అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యారు" అనే వార్తను ప్రసారం చేయడం ద్వారా ప్రపంచలో మొట్టమొదటి రేడియో ప్రసారం కేంద్రం ఏర్పాటయింది. అనంతరం ఇంగ్లాండ్లో 1922 అక్టోబర్ 18 న బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ స్థాపించారు. 1922 నవంబరు 14 బీబీసీ లండన్ కేంద్రంగా తన ప్రసారాలను ప్రారంభించింది.

**మనదేశంలో రేడియో ప్రసారాలు:**

భారతదేశ ప్రసార ప్రయాణం 1923 జూన్ లో రేడియో క్లబ్ ఆఫ్ బాంబే మొదటి ప్రసారంతో ప్రారంభమైంది. ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ (ఐబిసి) 1927 జూలై 23 న స్థాపించబడింది. ఆలిండియా రేడియో (ఎఐఆర్) 1936లో ఇండియన్ స్టేట్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్ నుండి ఉద్భవించింది. స్వాతంత్ర్యానంతరం 1956లో "ఆకాశవాణి" అనే పేరును స్వీకరించి ఎ.ఐ.ఆర్ శరవేగంగా విస్తరించింది. అప్పటికి దేశంలో ఢిల్లీ , బొంబాయి, కలకత్తా, మద్రాస్ , తిరుచిరాపల్లి, లక్నోలలో ఆరు రేడియో స్టేషన్లు ఉన్నాయి. ఎఫ్ఎం ప్రసారం 23 జూలై 1977న మద్రాసులో ప్రారంభమైంది. నేడు ఎఐఆర్ 591 స్టేషన్లను నిర్వహిస్తుంది. ఇది భారతదేశ జనాభాలో 98% మందికి రేడియో ప్రసారాలను అందిస్తుంది. 23 భాషలు, 146 మాండలికాలలో ప్రసారం చేస్తుంది. దేశ అభివృద్ధిలో బ్రాడ్ కాస్టింగ్ కీలక పాత్ర పోషించింది. స్వాతంత్ర్య పోరాట సమయంలో రేడియో సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి, ఐక్యతను పెంపొందించడానికి ఒక శక్తివంతమైన సాధనంగా ఉంది. స్వాతంత్ర్యానంతరం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత, ఆరోగ్య అవగాహన, వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది.

**రేడియో తరంగాల ఉపయోగం:**

రేడియో, టెలివిజన్ ప్రసారాలు ఆడియో వీడియోలను పెద్ద సంఖ్యలో ప్రేక్షకులకు పంపడానికి, మొబైల్ ఫోన్లు, బేస్ స్టేషన్లు స్మార్ట్ మీటర్లు కమ్యూనికేషన్ కోసం, రాడార్ ద్వారా వస్తువుల దూరం, వేగం, కోణాన్ని గుర్తించడానికి, వాతావరణ శాస్త్రవేత్తలు వాతావరణాన్ని ట్రాక్ చేయడానికి, అంచనా వేయడానికి, వైద్యరంగంలో సిటి, ఎమ్.ఆర్.ఐ స్కానింగ్ లలో, మైక్రోవేవ్ ఓవెన్లలో, ఉపగ్రహ సమాచార మార్పిడిలో రేడియో తరంగాలను వాడుతారు.

**జనక మోహన రావు దుంగ**
**యం.యస్సీ ( ఫిజిక్స్ )**
**ఫోన్: 8247045230**


# అమెరికా చర్య అనాగరికం



అమెరికా అధ్యక్షుడి ఆలోచనలు, నిర్ణయాలు, చర్యలు అనాగరికంగా తయారవుతున్నాయి. అవి ఆ దేశాన్ని గొప్పగా మారుస్తాయో లేదో గానీ ఇతర దేశాలకు తలనొప్పిని తెస్తున్నాయి. రాజకీయ, ఆర్థిక, భౌగోళిక స్థితుల్ని తలక్రిందులు చేసేవిగా ఉన్నాయి. ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యపై అధ్యక్షుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపడం. అంతవరకూ అభినందనీయమే. ఒకప్పుడు వలసల్ని ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ ఆర్థిక శక్తిగా మారిన దేశం అది. నేడు వలసల్ని అరికట్టాలని అనుకోవడం కేవలం వారి అవసరం. అందునా అక్రమంగా వచ్చిన వాళ్ళని ఆపడం, వెనక్కి పంపించడంలో ఎవరికీ ఆక్షేపణ, అభ్యంతరం ఉండనక్కర లేదు. కానీ వారిని గొలుసులతో బంధించి, అమానవీయంగా సైనిక విమానాల్లో తరలించడం ఒకింత అతి. దొంగతనం నేరమే కావొచ్చు కానీ రూపాయి దొంగిలించినవాడిని గుండుకొట్టి ఊరేగించడం చేస్తే అతి అంటారు. అది అన్యాయం కూడా. తాము కఠినంగా ఉన్నాం అని చెప్పుకోడానికి ఇంత తీవ్రంగా వ్యవహరించనక్కరలేదు. మన దేశం ఈ విషయమై అభ్యంతరం వెలిబుచ్చి, వారిని ఉన్నంతలో మర్యాదగా తీసుకురావడానికి కృషి చెయ్యాల్సింది. మానవ గౌరవం కాపాడడం కనీసపు హక్కు, నాగరిక చర్య కాబట్టి.ఇక రెండోది గాజా భూభాగాన్ని ఖాళీ చేసి అక్కడ నివాసముంటున్న పాలస్తీనీయుల్ని వేరే చోటకు తరలిస్తాడట అమెరికా అధ్యక్షుడు. అలా చెయ్యడానికి అదేమైనా అమెరికా స్వంతమా? ఒక సార్వభౌమిక దేశం. ఇజ్రాయెల్ దాడిలో నష్టపోతూ, లక్షలాది మంది అన్యాయంగా నిరాశ్రయులైన దేశం. వీలైతే యుద్ధాన్ని ఆపి, అక్కడి ప్రజలకు సాంత్వన కలిగించాలి. క్షతగాత్రులకు, అమాయక ప్రజలకు మానవతా దృక్పథంతో అందుతున్న సాయాన్ని కూడా అందనివ్వకుండా చేస్తున్న ఇజ్రాయెల్‌కు బుద్ధి చెప్పాలి. అలా చేయకుండా, అక్కడున్న స్థానిక ప్రజలందరినీ కట్టగట్టి ఎక్కడికో పంపించేస్తాననడం దురహంకారం. ఇలాంటి చర్యల వల్ల, ఆలోచనల వల్లనే తీవ్రవాదం, ఫాసిజం లాంటివి పెరిగి ప్రపంచం నష్టపోతుంది. అన్ని దేశాలూ ముక్తకంఠంతో ఖండించాల్సిన వ్యాఖ్యలివి. ఒక దేశపు అధినేత అహంకారం, ఆ దేశంతో పాటు, మిగతా దేశాల్ని కూడా ప్రమాదంలోకి నెట్టేస్తున్నపుడు, ఇది తప్పు అని గట్టిగా చెప్పగలగాలి. చూడాలి, ఎన్ని దేశాలు స్పందిస్తాయో?

## శాంతిపథంలో తొలి మెట్టు

భక్తి



మనం చదువుకోవాలంటే బడికి వెళ్ళాలి. ఆడుకోవాలంటే ఆట వస్తువులు బజార్లో దొరుకుతాయి. ఇలా మనకు కావలసింది ఏదైనా మన దగ్గర లేదనే విషయాన్ని ప్రపంచం మనకు నేర్పుతుంది. శాంతి విషయంలోనూ ఇలాగే ఆలోచిస్తాం. కానీ అది ఎక్కడో బయట ఉండదు. మన లోపలే ఉంటుంది. ఇది మనం తెలుసుకోవలసిన అతి ముఖ్యమైన విషయం. శాంతి పథంలో ఇదే తొలిమెట్టు.

**శాంతి మీలోనే ఉంది...**

మీరు తొలి అడుగు వెయ్యవలసింది ముందుకు కాదనీ, వెనక్కి అనీ నేను చెప్పినప్పుడు... చాలామంది 'ఎప్పుడూ ముందుకే అడుగు వెయ్యాలి కదా!' అని ఆలోచిస్తూ ఉంటారు. కానీ మనం ముందుకు కాదు, లోపలివైపు అడుగు వెయ్యాలి. ఎందుకంటే మీకు అవసరమైన శాంతి మీలోనే నిక్షిప్తం అయి ఉంది. ఇప్పుడు కూడా ఉంది. మీరు కోపంతో రగిలిపోతున్న సమయంలో కూడా ఉంటుంది. అలాగే మీరు దుఃఖంలో విలవిలలాడిపోతున్న సమయంలో, సుఖ సంతోషాలతో తులతూగుతున్న సమయంలో కూడా ఉంటుంది. ప్రపంచంలో ఎవరు ఎక్కడ ఉన్నా, కటిక పేదవారైనా, గొప్ప ఐశ్వర్యవంతులైనా ప్రతి ఒక్కరూ దాన్ని స్వయంగా అనుభూతి పొందవచ్చు.

**అది అసాధ్యం కాదు...**

ఎవరికో దాహంగా ఉందని తెలిసి... నేను నాలుగు గ్లాసుల నీరు ఇచ్చి వచ్చాను. "అతని దాహం తీరిపోయి ఉంటుందా?" అని ఎవరైనా అడిగితే... "నేను నాలుగు గ్లాసుల నీరు ఇచ్చి వచ్చాను, తప్పకుండా తీరిపోయి ఉంటుంది" అని చెబుతాను. కానీ ఆ వ్యక్తి నీరు తాగకుండా ఉంటే దాహం ఎలా తీరుతుంది? శాంతి విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. యుద్ధాలు జరగకపోతే శాంతి ఏర్పడుతుందని భావిస్తారు. కానీ శాంతిగా ఉన్నప్పుడు యుద్ధం ఎలా మొదలైంది? కాబట్టి ఏవైతే జరుగుతున్నాయో వాటన్నిటికీ కారణం... శాంతి లోపించడం. 'ఇంతమందిని శాంతిపథంలో



# ఝుంకా మెరుపుల్




దక్షిణ భారత మూలాలు కలిగిన సంప్రదాయ ఆలయ ఆభరణాలైన ఝుంకాలు గుడి గంట ఆకారంలో తయారవుతూ ఉంటాయి. ఆకారంలో పెద్దవిగా, బరువుగా ఉండే ఈ ఆభరణాలు కాలక్రమేణా కొత్త హంగులు అద్దుకుంటూ వినూత్నమైన డిజైన్లతో రూపొందడం మొదలుపెట్టాయి. ప్రారంభంలో దక్షిణ భారత దేశంలోని భరతనాట్య కళాకారిణులు చంప సరాలతో కలిపి వీటిని ధరించడం మొదలుపెట్టారు. ప్రాంతాన్ని బట్టి భిన్నమైన పేర్లను పొందిన ఈ ఆభరణాలను రాజస్థాన్‌లో మీనాకారి ఝుంకాలుగా పిలుస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలో ఇవి పూలు, నెమలి డిజైన్లతో రూపొందుతూ ఉంటాయి. బంగారం, వెండి, వజ్రాలతో రూపొందే ఝుంకాలు వేర్వేరు పరిమాణాలు, డిజైన్లలో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

వేర్వేరు నమూనాల్లో...గుండ్రని, గంటాకారపు, చంద్రాకారపు, శంఖాకార ఝుంకాలు తయారవుతూ ఉంటాయి. వీటిలో పెద్దవీ, చిన్నవీ ఉంటాయి. అయితే ఆకారంలో పెద్దవిగా ఉండే వాటిని అన్ని సందర్భాల్లో ధరించడం వీలు కాదు కాబట్టి వాటిని స్టడ్‌గా, ఝుంకాగా వేర్వేరుగా విడదీసే వీలుండే డిటాచబుల్ నమూనాలు కూడా దొరుకుతున్నాయి. వీటికి మ్యాచ్ అయ్యే చంపసరాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి. కాబట్టి పెళ్లిళ్లు లాంటి వేడుకల్లో భారీ ఝుంకాలనూ, రోజువారీ వాడుక కోసం తేలికపాటి ఝుంకాలను ఎంచుకోవచ్చు. మరీ ముఖ్యంగా సంప్రదాయ వేడుకల్లో టెంపుల్ జ్యువెలరీ విభాగానికి చెందిన ఝుంకాలు చాలా బాగుంటాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్ బుధవారం 12 । ఫిబ్రవరి । 2025

# వేడి వాతావరణంలో చెక్కుచెదరకుండా



**ప్రైమర్:** గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పనిచేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె... సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జిడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.

**పౌడర్:** మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.

**ఫౌండేషన్:** వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్‌వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.

మస్కారా: ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమ యం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

**లిప్ టింట్:** టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

# వెండి నగలు మెరవాలంటే.

మహిళలు మేకప్ వేసుకోవడం, అత్తరు చల్లుకోవడం లాంటి పనులు పూర్తిచేసిన తరవాతనే వెండి నగలు పెట్టుకోవాలి. లేదంటే మేకప్ సామగ్రిలోని రసాయనాల వల్ల నగలు నల్లబడే అవకాశం ఉంది.

వర్షాకాలంలో వెండి ఆభరణాలు ధరించకూడదు. వర్షపు నీటివల్ల నగలపై పలుచని పొర ఏర్పడి మెరుపుని కోల్పోతాయి.

అనుకోకుండా నగలు తడిచినప్పుడు వాటిని పొడి గుడ్డతో శుభ్రంగా తుడవాలి. మెరుగు పెట్టించుకోవడం మంచిది.

ఇంటి పనులు చేసేటప్పుడు, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు వెండి నగలు ధరించకూడదు.


వెండి ఆభరణాలను గాలి తగలని పొడి ప్రదేశంలో భద్రపరచాలి. ఆ ప్రదేశంలో రెండు సుద్ద ముక్కలు లేదా సిలికా జెల్ ప్యాకెట్‌ని ఉంచాలి. ఇవి గాలిలోని తేమను పీల్చుకుని ఆభరణాలు నల్లబడకుండా కాపాడతాయి.

జిప్‌లాక్ సౌకర్యం ఉన్న ప్లాస్టిక్ కవర్లలో వెండి నగలు దాచుకుంటే అవి ఎప్పటికీ కొత్తవాటిలాగే ఉంటాయి.

వెండి నగలు దాచే బాక్స్‌లో నాలుగు మూలలా దూది ఉండలు లేదా వెల్వెట్ వస్త్రం ఉంచితే మంచి ఫలితం ఉంటుంది.

వెండి ఆభరణాలను రసాయనాలతో కూడిన ద్రవాలతో శుభ్రం చేయకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో ఉండే వెనిగర్, బేకింగ్ సోడాలను ఉపయోగించి టూత్‌బ్రష్‌తో రుద్ది కడిగితే అవి సహజంగా మెరుస్తాయని సూచిస్తున్నారు.







# వ్యర్థాలను వదిలించారు... ఆదాయ మార్గం చూపించారు!

ఆదాయాన్నిచ్చే సాగుని మానుకో లేక, వ్యర్థాల్ని వదిలించు కోలేక సతమతమవుతున్న రైతులను కొత్తదారిలో నడిపించారు అనసూయ జెనా. భర్తతో కలిసి ఆమె చేసిన ప్రయత్నం... అరటి వ్యర్థాలను ఆదాయ మార్గంగా మార్చింది. వెయ్యికి పైగా రైతు కుటుంబాల ఆర్థిక సుస్థిరతకు దోహదం చేసింది. "నిబద్ధతతో, కలిసికట్టుగా పని చేయడమే మంచి ఫలితాలు సాధించే మార్గం" అంటున్న అనసూయ కథ ఆమె మాటల్లోనే...

"అరటి చెట్ల నుంచి గెలలు తీసేసిన తరువాత..... నరికిన చెట్లను తోటలలోంచి తొలగించడం శ్రమతోనే కాదు, ఖర్చుతో కూడా కూడుకున్న వ్యవహారం. కూలీలకు రోజుకు రెండువేల రూపాయల వరకూ ఇవ్వాలి. సాధారణ రైతులు ఈ ఖర్చు భరించలేరు. దాంతో తమ తోటల పక్కనే వాటిని పడేసి, ఎండిపోయిన తరువాత కాల్చేసేవారు. ఆ పొగ చుట్టు పక్కల ప్రాంతాల్లో వ్యాపించేది. ఇక మరికొందరు రైతులు ఆ వ్యర్థాలను ఊరి బయట పారబోసేవారు. ఆ కుప్పలు పెద్ద గుట్టల్లా ఉండేవి. ఎండకు ఎండి, వానకు తడిసి, కుళ్ళిపోవడంతో... ఆ వైపు వెళ్ళలేనంత దుర్వాసన. ఈ వాతావరణ కాలుష్యం ప్రభావం సమీప గ్రామాల్లో కూడా తీవ్రంగానే ఉండేది. కొన్నేళ్ళ క్రితం మాకు ప్రతిరోజూ ఎదురయ్యే దృశ్యాలివి.

**వాటికి అర్థం కల్పించేందుకు...**

మాది ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లాలోని బలిపట్న. మా జిల్లాలో సాగుచేసే వాణిజ్య పంటల్లో అరటి ప్రధానమైనది. ముఖ్యంగా మాకు దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బనమాలిపూర్ అరటి పంటకు ప్రసిద్ధి. దాదాపు ప్రతి ఇంటి పెరట్లోనూ అరటి మొక్కలు ఉంటాయి. రైతులకు ఆ పంట జీవనాధారమైతే, దానిద్వారా వచ్చే వ్యర్థాలు తీవ్ర అనారోగ్యానికి కారణమయ్యేవి. నా భర్త కాశీనాథ్ జెనా గత ముప్ఫయ్యేళ్ళ నుంచి రూరల్ డెవల్‌పమెంట్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు, అణగారిన వర్గాలకు జీవనోపాధి కల్పించడం లాంటి కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండేవారు. తరచుగా మేము బనమాలిపురా మీదుగా ప్రయాణించేవాళ్ళం. అప్పుడు అరటి వ్యర్థాల సమస్యే మా సంభాషణల్లో ప్రధానంగా ఉండేది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే... రాబోయే రోజుల్లో దుష్ప్రభావాలు మరింత పెరిగిపోతాయనే ఆందోళన కలిగింది. కొందరు రైతులతో మాట్లాడినప్పుడు... పంట కోత తరువాత వ్యర్థాల్ని వదిలించుకోవడమే వారి ప్రధాన సమస్య అని గ్రహించాం. దీన్ని ఇతర ప్రాంతాల్లో ఎలా పరిష్కరిస్తున్నారో తెలుసుకోడానికి నా భర్త ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రల్లో పర్యటించారు. అరటి బెరళ్ళ నుంచి నారు తీసి వస్త్రాలు నేయడం, ఉత్పత్తుల తయారీ లాంటివి గమనించారు. ఈ విధంగా వ్యర్థాలకు ఒక అర్థం







కల్పించవచ్చనిపించింది. ఎన్నో నెలలపాటు పరిశోధన చేసిన తరువాత... 2021లో 'జయదేవ్ బనానా ఫార్మర్స్ అండ్ ఆర్టిసన్స్ అసోసియేషన్'ను ఏర్పాటు చేశాం.

మూడు విభాగాల్లో...ఆ తరువాత ఒక ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసి, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఇ) మంత్రిత్వ శాఖకు అందజేశాం. 'స్పెషల్ పర్పస్ వెహికిల్' (ఎస్‌పీవీ)గా ఈ సంఘాన్ని పరిగణి స్తూ... గ్రామీణ ఉపాధి, ఆర్థికాభివృద్ధి కోసం సహకరించడానికి ఆ శాఖ అంగీకరించింది. తొలి విడతగా, 350 మంది రైతులు మాతో చేరారు. ఆ సంఖ్య క్రమంగా పెరిగి ఇప్పుడు వెయ్యి దాటిపోయింది. అలాగే దాదాపు 40 మంది యువతకు, మహిళలకు ఉద్యోగాలను మా కల్పించాం. ఉత్పత్తుల విషయానికి వస్తే... వాటిని ఆహారం, వ్యవసాయం, ఉపయుక్తమైన వస్తువులు అనే మూడు విభాగాల్లో తయారు చేస్తున్నాం. అరటి దవ్వ పచ్చడి, జామ్, మురబ్బా, జ్యూస్, వడియాల్లాంటి ఆహార ఉత్పత్తులు, భూమి సారాన్ని పెంచే సూక్ష్మ పోషకాలు ఉన్న 'జీవసార', అలాగే అరటి నారతో బ్యాగ్‌లు, కోస్టర్లు, బాస్కెట్లు, గిఫ్ట్ బాక్సులు, టేబుల్ మ్యాట్స్... ఇలా అనేక ఉత్పత్తులను తయారు చేయించి విక్రయిస్తున్నాం.

ఇంతకుముందు రైతుల వద్దకు మేమే వెళ్ళి... వ్యర్థాలను సేకరించేవాళ్ళం, ఇప్పుడు వారే నేరుగా మా కేంద్రానికి వచ్చి విక్రయిస్తున్నారు. ఎలాంటి ఖర్చు లేకుండానే వారి పొలాలు తదుపరి పంట కోసం శుభ్రంగా మారుతున్నాయి. ఉత్పత్తుల తయారీ ద్వారా లాభాలు కూడా దక్కుతున్నాయి.

**పురస్కారాలు... ప్రశంసలు**

ఖుర్దాతోపాటు కటక్, పూరీ జిల్లాల రైతులు కూడా మా సంఘంలో భాగస్వాములయ్యారు. వారు తమ పంట దిగుబడి వల్ల వచ్చే మొత్తంతో పాటు ఈ వ్యర్థాల ద్వారా సగటున రూ.7 వేల నుంచి రూ.10 వేల మధ్య ఆదాయం పొందుతున్నారు. మా కార్యక్రమాలకు గుర్తింపుగా... రెండేళ్ళ నుంచి ఎన్నో పురస్కారాలు లభించాయి. అలాగే దేశంలోని పలుచోట్ల మేము ఏర్పాటు చేసిన ప్రదర్శనలకు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మా ప్రాంతంలో అరటి వ్యర్థాలను తగులబెట్టడం, కుప్పలుగా పోయడం లాంటి దృశ్యాలు కనిపించడం లేదు. మరోవైపు రైతులకు అదనపు ఆదాయం కూడా లభిస్తోంది. ఒక సమస్య పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా నిలబడి, నిబద్ధతతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయనడానికి మా సంస్థ ఒక ఉదాహరణగా నిలుస్తోంది.

# పర్యావరణహితంగా ఉపాధి మార్గంగా

స్వశక్తితో ఎదగాలన్న తపన ఆమెను కుదురుగా కూర్చోనివ్వలేదు. ఆ తపనతోనే లక్షల రూపాయలు తెచ్చిపెట్టే కొలువు వదిలేసి... భర్త, సోదరుడితో కలిసి అంకుర సంస్థను నెలకొల్పారు.ఆహార పదార్థాల కోసం ప్లాస్టిక్ రహిత కంటైనర్ల తయారీతో... పర్యావరణహిత ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఐదున్నరేళ్లలో కంపెనీని ఐదు కోట్లకు పైబడిన టర్నోవర్‌కు తీసుకువెళ్లి... తనలాంటి ఎంతోమంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ధన్విత సత్యానంద్ కథ ఇది."చదువుకొనే రోజుల్లో నాకంటూ ప్రత్యేకమైన లక్ష్యాలేవీ లేవు. మంచి మార్కులు తెచ్చుకోవాలి. అందరు అమ్మాయిల్లా మంచి ఉద్యోగంలో స్థిరపడాలి. ఇవే నా కోరికలు. కానీ ఒక్కసారి కొలువులో కుదురుకున్నాక... నా గురించి నేను ఆలోచించడం మొదలుపెట్టాను. అప్పుడే అర్థమైంది... ఇది కాదు నేను కోరుకున్న జీవితం అని. నాకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలి. కష్టపడి పని చేసి మరికొంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరుకున్నా. ఇదే విషయం మావారు శ్రీనిధి రాఘవన్, నా సోదరుడు భరత్ సత్యానంద్‌లకు చెప్పాను. వారూ అందుకు మద్దతునిచ్చారు. అలా ముగ్గురం కలిసి పలు బిజినెసలు చేసి, చివరకు 'ఏకాజ్' స్టార్టపను నెలకొల్పాం. ఈ కంపెనీ ద్వారా మేం కోరుకున్నట్టే మరికొందరికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వగలుగుతున్నాం. దీని వెనుక ఎన్నో ఏళ్ల శ్రమ, త్యాగాలు ఉన్నాయి. కర్ణాటక టుమ్కూరు జిల్లా మధుగిరి మాది. పాఠశాల విద్యాభ్యాసం తరువాత డిగ్రీ కోసం బెంగళూరుకు వచ్చాను. 2007లో 'మహావీర్ జైన్ కాలేజీ' నుంచి బీఎస్సీ డిగ్రీ, 2010లో పూణె 'సింబియోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ' నుంచి 'ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్'లో పీజీ పట్టాలు అందుకున్నాను. పీజీ అవ్వగానే బెంగళూరు 'ఆడెన్ పబ్లిక్ స్కూల్'లో అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్‌గా చేరడంతో నా ఉద్యోగ జీవితం ప్రారంభమైంది.



**ఉద్యోగాలు మారినా...**

స్కూల్లో ఎక్కువ కాలం పని చేయలేకపోయాను. ఏడాది తిరక్కుండానే ఓ ఫైనాన్సియల్ కంపెనీలో రెండేళ్లకు పైగా సేవలు అందించాను. కార్పొరేట్ కొలువు, దానికి తగిన జీతం... అన్నీ బానే ఉన్నాయి. జీవితం సంతోషంగానే సాగిపోతోంది. కానీ ఏదో వెలితి. రాఘవన్, భరత్‌లదీ అదే పరిస్థితి. ఐటీ కంపెనీల్లో మంచి హోదాల్లో ఉన్నారు. కానీ రొటీన్ పని... ఒక మూస పద్ధతికి అలవాటుపడిపోయాం. మాకు అలా ఉండడం నచ్చలేదు. ఉద్యోగాలు మారినా సంతృప్తి లేకపోవడంతో ముగ్గురం రాజీనామా చేసేశాం. సొంతంగా ఏదైనా వ్యాపారం మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాం. అలా 2015లో బెంగళూరులోనే 'కార్టియర్ హోటల్స్' పేరుతో ఫోర్ స్టార్ హోటల్ ఒకటి ప్రారంభించాం. అయితే అందులో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

అప్పుడే తెలిసింది...ఆతిథ్య, ఆహార రంగాల్లో ముడిసరుకు సేకరించడం, వినియోగించడం మధ్యన అంతరంవల్ల ఎంతో సమయం, వనరులు వృథా అవడాన్ని గమనించాం. సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నాం. ఈ ఆలోచనతోనే మా రెండో వెంచర్... 'ఆగ్రిన్జ్ సొల్యూషన్స్' సంస్థను నెలకొల్పాం. ముడిసరుకు కొనుగోలులో వృథాను సాధ్యమైనంత తగ్గించడంపై దృష్టి పెట్టాం. చీజ్, బటర్ తదితర 450 రకాల ఉత్పత్తులను సరఫరా చేసేవాళ్లం. అదే సమయంలో కొవిడ్ విజృంభించడంవల్ల డిమాండ్ తగ్గి, నష్టాలు పెరిగాయి. అవి భరించలేక, సంస్థను పక్కన పెట్టేశాం. అయితే దిగులు పడలేదు. మరో వినూత్న ఆలోచనతో 2020 చివర్లో 'ఏకాజ్ బయోవేర్'ను ప్రారంభించాం. ఆహార పరిశ్రమకు ప్యాకింగ్ కంటైనర్లను సరఫరా చేసే సంస్థ ఇది.

పర్యావరణ హితం...మన దగ్గర ప్లాస్టిక్ నిషేధం అంటున్నారు కానీ... అది పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. దానివల్ల భూమికి భారం పెరిగిపోతోంది. పర్యావరణానికి ఎనలేని నష్టం వాటిల్లుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని బయోడీగ్రేడబుల్ ప్యాకింగ్ మెటీరియల్స్ తీసుకువస్తున్నాం. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్‌తో కప్స్, బౌల్స్, డబ్బాలు తయారు చేస్తున్నాం. ఫుడ్ డెలివరీ సమయంలో ఇవి లీకవుతాయనే సందేహాలు మా కస్టమర్ల నుంచి ఉత్పన్నమయ్యాయి. అయితే మేం రూపొందించేవాటికి ఆ సమస్య లేదు. దీని కోసం కంటైనర్లకు ప్రత్యేక కోటింగ్ వేస్తాం. వాడి పడేసిన ఆరు నెలల్లో ఇవి మట్టిలో కలిసిపోతాయి. మా ఉత్పత్తులు 'సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' (సిపెట్) ధృవీకరించినవి."

ఐదు కోట్లు దాటిన ఆదాయం...మా సంస్థ నెలకొల్పి ఐదేళ్లు పూర్తయింది. ఆరంభంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా, క్రమంగా అనుభవం గడించి, సమష్టి కృషితో నిలదొక్కుకున్నాం. ప్యాకింగ్ కంటైనర్ల తయారీకి ప్రత్యేక మిషన్లు ఏర్పాటు చేశాం. ఒక్కో మిషన్ నిమిషానికి నలభై నుంచి నలభై ఐదు డబ్బాలు ఉత్పత్తి చేస్తుంది. 50 ఎంఎల్ నుంచి 1000 ఎంఎల్ వరకు కాగితం డబ్బాలు సరఫరా చేస్తున్నాం. ఇప్పటివరకు కప్స్, బౌల్స్, కంటైనర్లు, మూతలు, బాక్స్ తదితర అన్నీ కలిపి నాలుగు కోట్ల యూనిట్స్ విక్రయించాం. 5.2 కోట్ల రూపాయల వార్షిక ఆదాయాన్ని రాబట్టగలిగాం. అన్నిటికంటే ముఖ్యంగా నాలుగు లక్షల కిలోల ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించగలిగాం. తద్వారా ఆహార పరిశ్రమ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని కొంతవరకు అరికట్టగలిగాం.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
6 | హైదరాబాద్ గురువారం 13 । ఫిబ్రవరి । 2025

## బెంగాల్‌లో టీఎంసీ ఒంటరిపోరు



**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్‌కు మరో 'ఇండీ' కూటమి పార్టీ ఝలక్ ఇచ్చింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జట్టుకట్టే ప్రసక్తే లేదని టీఎంసీ అధినేత, సీఎం మమతా బెనర్జీ తేల్చేశారు. వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్లో జరిగే ఈ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని స్పష్టం చేశారు. దరిమిలా టీఎంసీ ఎంపీలు మంగళవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పునాదే లేదని.. సొంత పార్టీని పణంగా పెట్టి కూటమి బలోపేతానికి ప్రయత్నించబోమన్నారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓటమికి కాంగ్రెస్ కారణమని బర్ధమాన్-దుర్గాపూర్ టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ మండిపడ్డారు. మిత్రపక్షాలకు ఆ పార్టీ వెన్నుపోటు పొడుస్తోందన్నారు. అసలు ఇండీ కూటమిలో ఉండే హక్కే కాంగ్రెస్‌కు లేదన్నారు. 'కాంగ్రెస్ మునిగిపోయే నావ. దురహంకారంతో వ్యవహరిస్తోంది. కూటమికి మమత సారథిగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు' అని వ్యాఖ్యానించారు. మమతకు సమాజ్‌వాదీ ఎంపీ రాంగోపాల్ యాదవ్ కూడా మద్దతు ప్రకటించారు. రాజకీయాల్లో ఎప్పటికప్పుడు సమీకరణలు మారుతుంటాయని, ఎన్నికల ముందు పరిస్థితులు మారవచ్చని జేఎంఎం ఎంపీ మహువా మాజీ అన్నారు.

## బిజినెస్




## టీవీకే నేతలతో పీకే భేటీ.. అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై చర్చ



**చెన్నై-నవభూమి:** ప్రముఖ సినీ నటుడు విజయ్‌నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ప్రత్యేక సలహాదారుగా ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నియమితులయ్యారు. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే విజయమే లక్ష్యంగా ప్రశాంత్ కిశోర్ వ్యూహ రచన చేయనున్నారు. ఈ మేరకు ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. ఇందులో భాగంగా సోమవారం విజయ్‌తో భేటీ అయిన ప్రశాంత్ కిశోర్.. టీవీకే పార్టీ సిద్ధాంతాల గురించి, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన, ప్రజలను ఆకట్టుకునే హామీల గురించి కూడా చర్చించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం పార్టీ ఎన్నికల విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున్ నివాసంలో ఆ పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా శాఖ కార్యదర్శులను ప్రశాంత్ కిషోర్ వరుసగా కలుసుకున్నారు. విక్రవాండిలో జరిగిన పార్టీ మహానాడులో డీఎంకే తనకు ప్రధాన రాజకీయ శత్రువని విజయ్ చేసిన ప్రకటనకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన స్పందన గురించి కూడా పార్టీ నాయకుల వద్ద ఆయన ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 14 నెలల గడువు మాత్రమే ఉండటంతో ఆలోగా పార్టీని పటిష్టం చేసి, రాష్ట్ర వ్యాప్తంగా రోడ్‌షోలు నిర్వహించి ఆ ఎన్నికలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ప్రశాంత్ కిషోర్ సూచించారు. జిల్లా కార్యదర్శులు, డిప్యూటీ కార్యదర్శులు, కోశాధికారులతో ఆయన చర్చించారు. ఏళ్లతరబడి రాష్ట్ర ప్రజలకు పరిష్కారం కాని సమస్యలేమిటో తెలుసుకుని వాటిని పరిష్కరించేలా తక్షణమే చేపట్టాలని టీవీకే నేతలకు ఆయన సలహా ఇచ్చారు. వీలైతే వచ్చే నెల నుంచే విజయ్ రాష్ట్ర వ్యాప్త పర్యటన చేయాలని, అప్పుడే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాస్త వెసులుబాటు వుంటుందని సూచించినట్లు తెలిసింది. టీవీకే జిల్లా కార్యదర్శులం దరితోనూ ప్రశాంత్‌కిశోర్ వేర్వేరుగా మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కూడా పాల్గొన్నారు.

## మాఘపూర్ణిమ సందర్భంగా కుంభ మేళాకు పోటెత్తిన భక్తజనం.. 73.60 లక్షల మంది పుణ్యస్నానాలు



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** మహా కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. ఈరోజు మాఘపూర్ణిమ సందర్భంగా మాములు రోజుల కంటే పెద్ద ఎత్తున వస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటల నాటికే 73.60 లక్షల మంది పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈరోజు త్రివేణి సంగమంలో స్నానం చేసిన వారు, వారి జీవితంలోని కష్టాల నుంచి విముక్తి పొందుతారని పండితులు భావిస్తున్నారు. వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఈ క్రమంలో మహా కుంభమేళా ప్రాంతానికి చేరుకునే క్రమంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతోంది. మాఘ పూర్ణిమ సందర్భంగా భక్తుల రద్దీ నిరంతరం పెరుగుతోంది. దీంతో శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు 15 జిల్లాలు, 20 మంది లు, 85 మంది అధికారులను విధుల్లో మోహరించారు. అలాగే, సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఉదయం 4 గంటల తర్వాత వార్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఆయనతో పాటు డీజీ ప్రశాంత్ కుమార్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా భక్తులకు సౌకర్యాలు అందించేందుకు అన్ని సన్నాహాలు చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు భోజనాలు, పర్యాటక సౌకర్యాలు అందించడం సహా వారి ఆధ్యాత్మిక ప్రయాణం సాఫీగా సాగేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**స్నానం ప్రాముఖ్యత**

మత విశ్వాసం ప్రకారం ఈరోజు దేవతలు భూమిపై వస్తూ త్రివేణి సంగమంలో స్నానం చేస్తారని, తద్వారా భక్తులు శాంతిని, మోక్షాన్ని పొందగలుగుతారని ఇంకొంత మంది పండితులు అంటున్నారు. అందుకే మహాకుంభమేళాలో ఈ రోజు స్నానం అత్యంత పవిత్రమైన రాజస్నానంగా పరిగణించబడుతుందని చెబుతున్నారు. 2025 ఫిబ్రవరి 11 సాయంత్రం 6:55 నుంచి ఫిబ్రవరి 12 సాయంత్రం 7:22 వరకు మాఘపూర్ణిమ స్నాన సమయం కొనసాగుతుంది.

ఈరోజు ఉదయం స్నానం చేయడానికి శుభ సమయం 05:19 నుంచి 06:10 గంటల వరకు ఉంది. ఈ సమయాన్ని అనుసరించి భక్తులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు చేసి వారి సమస్యల నుంచి విముక్తి పొందుతారని పండితులు భావిస్తున్నారు. ఇప్పటికే మహా కుంభమేళాకు 40 కోట్ల మందికిపైగా వచ్చారు. ఈ క్రమంలో మహాశివరాత్రి ఫిబ్రవరి 26, 2025 వరకు కొనసాగనున్న ఈ మేళాకు మరింత మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది.

## భార్యతో ఇష్టం లేకుండా అసహజ శృంగారం నేరం కాదు.. కోర్టు సంచలన తీర్పు

**రాయిపూర్-నవభూమి:** భార్యతో లైంగిక సంబంధం విషయంలో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ క్రమంలో భార్యకు ఇష్టం లేకుండా తనతో అసహజ శృంగారం లాంటివి చేయడాన్ని నేరంగా భావించలేమని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి కోర్టు సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. లైంగిక సంబంధం లేదా అసహజ శృంగారం విషయంలో భార్య 'సమ్మతి' లేదని నేరంగా పరిగణించలేమని జస్టిస్ నరేంద్ర కుమార్ వ్యాస్ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ స్పష్టం చేసింది. భార్య వయస్సు 15 ఏళ్లకు మించి ఉన్నట్లైతే, ఆమెతో లైంగిక సంబంధం విషయంలో భర్తపై అత్యాచారం లేదా అసహజ లైంగిక చర్య కింద నేరం మోపడం సబబు కాదని కోర్టు తెలిపింది. ఈ తీర్పులో భార్య సమ్మతి లేనప్పటికీ, భర్తపై నేరం మోప డం అసంబద్ధమని కోర్టు చెప్పింది.

# మా పిల్లలు అమెరికన్లా? కాదా? భారతీయ పేరెంట్స్‌లో తీవ్ర ఆందోళన



**న్యూయార్క్-నవభూమి:** అమెరికా అధ్యక్షుడిగా జనవరి 20న బాధ్యతలు చేపట్టిన వెంటనే తాత్కాలిక వీసాదారులకు జన్మతః పౌరసత్వ హక్కును రద్దుచేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వుల అమల్లోకి వస్తే అమెరికాలోని వలసదారులు ముఖ్యంగా భారతీయులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ట్రంప్ ఉత్తర్వులను కోర్టులు ప్రస్తుతానికి నిలిపివేసినప్పటికీ భారతీయులను ఆందోళనకు గురిచేస్తోంది. హెచ్-1బీ వీసాదారులైన భారతీయ వృత్తినిపుణులకు దీని వల్ల తీవ్ర నష్టం జరుగుతోంది. అమెరికాలో పుట్టిన విదేశీయుల పిల్లలకు అక్కడ పౌరసత్వం లభిస్తుంది. కానీ, ట్రంప్ ఉత్తర్వులతో ఇలాంటి వారి పౌరసత్వం ప్రమాదంలో పడింది. కాలిఫోర్నియాలోని శాన్ జోస్‌లో ఉంటోన్న భారతీయ ఇంజినీర్ అక్షయ్ పైస్ మాట్లాడుతూ.. ట్రంప్ ఉత్తర్వుల ప్రభావం తమపై నేరుగా ఉంటుందని అన్నారు. 'జన్మతః పౌరసత్వ ఉత్తర్వులు అమల్లోకి వస్తే తర్వాత ఏం జరుగుతుందో మాకు తెలియదు.. ఇది మాకు తెలియని ప్రదేశం' అన్నారు. ప్రస్తుతం గర్భవతి అయిన తన భార్య నేహా సత్పుతేకు మరో నెల రోజుల్లో డెలివరీ అవుతుందని అన్నారు. ప్రసవానికి గడువు సమీపిస్తుండటంతో ముందస్తు ప్రసవం కోసం ఆలోచించినా.. ఈ విషయంలో నిర్ణయాన్ని మార్చుకున్నారు. ప్రసవం సహజ ప్రక్రియ.. నేను అదే కోరుకుంటున్నాను" అని సత్పుతే అన్నారు. అక్షయ్ సైతం సురక్షితమైన డెలివరీ, నా భార్య ఆరోగ్యం నాకు ముఖ్యం. పౌరసత్వం తరువాత వస్తుందని అక్షయ్ పేర్కొన్నారు. ఇలాంటి ఆందోళనలతో అమెరికాలోని ఉండే పలువురు విదేశీయులు ముందస్తు ప్రసవాలకు ప్రయత్నించినట్టు నివేదికలు వచ్చాయి. కానీ, కఠినమైన అమెరికా వైద్య చట్టాలు దీనిని అంగీకరించవని, పౌరసత్వం కోసం నెలలు నిండకుండా ముందస్తు ప్రసవాలు ప్రమాదమని భారత సంతతి అమెరికన్ ఫిజీషియన్స్ సంఘం అధ్యక్షులు సతీశ్ కథులా అన్నారు. శాన్ జోస్‌లో ఉండే ప్రియాన్ని జాజూ అనే మహిళకు కూడా ఏప్రిల్‌లో ప్రసవానికి డేట్ ఇచ్చారు. 'పాస్‌పోర్ట్ కోసం భారత కాన్సులేట్‌ను సంప్రదించాలా? ఏ వీసా వర్తిస్తుంది? స్పష్టమైన సమాచారం లేదు.' అని ఆమె అన్నారు. అమెరికాలో పుట్టిన వ్యక్తికి వలసేతర హోదా ఇవ్వడానికి అమెరికా చట్టంలో ఎటువంటి నిబంధన లేదు అని న్యూయార్క్‌కు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ సైరస్ మెహతా అన్నారు. కానీ, జన్మతః పౌరసత్వం లేకుండా, హోల్డర్ల పిల్లలు చట్టపరమైన అనిశ్చితిని ఎదుర్కొంటారని తెలిపారు. ఇది ఒత్తిడితో ఒత్తిడితో కూడుకున్న అనిశ్చితి అని నేహ సత్పుర అన్నారు. 'గర్భధారణ చాలా ఒత్తిడితో కూడుకుంది... కానీ ఇక్కడకు వచ్చిన ఒక దశాబ్దం తర్వాత తేలికవుతుందని మేము భావించాం.. ఇప్పుడు మరింత ఒత్తిడికి గురిచేస్తోంది' వాపోయారు. అక్షయ్ మాత్రం తాము చట్టబద్ధమైన, పన్ను చెల్లించే వలసదారులమని, నా బిడ్డ అమెరికా పౌరసత్వానికి అర్హురాలని వ్యాఖ్యానించారు.

అమెరికాలోని వలసదారుల్లో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఉత్తర్వులు వారిపై పెను ప్రభావం చూపనున్నాయి. 50 లక్షల మందికిపై నాన్-ఇమిగ్రెట్స్ వీసాదారుల పిల్లలకు పౌరసత్వం దక్కకుండా పోతుంది. గ్రీన్ కార్డుకోసం ఎదురుచూస్తోన్న విదేశీయుల్లో భారతీయులే అధికంగా ఉన్నట్టు ఇమ్మిగ్రెంట్ పాలసీ ఎనలిస్ట్ స్నేహ పూరి పేర్కొన్నారు. ప్రస్తుత అమెరికా చట్ట నిబంధనలు ప్రకారం ఒక్కో దేశానికి 7 శాతం గ్రీన్ కార్డులు దక్కుతాయి. ఏటా 72 శాతం మంది భారతీయులు హెచ్-1బీ వీసాలు పొందుతున్నారు.

కొత్తగా గ్రీన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకున్న భారతీయులు జీవితకాలం నిరీక్షించాల్సిందేనని, కార్డులు పొందకుండానే 4 లక్షల మంది కాలం చేయొచ్చని కేటో ఇన్‌స్టిట్యూట్ ఇమ్మిగ్రేషన్ డైరెక్టర్ డేవిండ్ బైర్ హెచ్చరించారు. ట్రంప్ ఉత్తర్వ్యు.. డ్యాకుమెంట్లు లేని వలసదారులను కూడా ప్రభావితం చేస్తుంది. అమెరికా జన్మించిన వారి పిల్లలకు జన్మతః పౌరసత్వ హక్కును హరించింది. ఇలాంటి వారికి 21 సంవత్సరాల వయస్సులో గ్రీన్ కార్డ్ కోసం తల్లిదండ్రులు దరఖాస్తు చేసేవారు. ఇటువంటి వారిలో భారతీయలు 7.5 లక్షల మంది ఉన్నట్టు ప్యూ రిసెర్చ్ అంటే... మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ 3.75 లక్షల మంది ఉంటారని అంచనా వేసింది.

### ముగ్గురు విద్యార్థినులను గర్భవతులను చేసిన

# 'లవ్ గురు'కు జీవిత ఖైదు!



**రాజ్‌కోట్-నవభూమి:** ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఓ 50 ఏళ్ల వ్యక్తి 2012లో ఇద్దరు మైనర్ విద్యార్థినులను ప్రేమిస్తున్నానంటూ మాయ మాటలు చెప్పి వారితో పారిపోయాడు. ఆపై వారు గర్భం దాల్చాకా వదిలేశాడు. ఒకరి తర్వాత మరొకరిపైనే ఇలా అత్యాచారం జరిగగా.. వీరి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు అయింది. ఆపై న్యాయస్థానం అతడికి జీవితఖైదు విధించింది. అయితే పెరోల్‌పై బయటకు వచ్చాక ఇతడు మరో అమ్మాయిని ముగ్గులోకి దింపి ఆమెతో పారిపోయాడు. గర్భం దాల్చాకా వదిలేశాడు. దీంతో మరోసారి పోలీసులకు చిక్కిన ఇతడికి.. సీబీఐ ప్రత్యేక కోర్టు అతడికి పెరోల్ కూడా లభించకుండా ఆదేశాలు జారీ చేసింది. అలాగే 7 లక్షల రూపాయల జరిమానా కూడా విధించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. గుజరాత్‌కు చెందిన ధవల్ త్రివేది రాజ్ కోట్ జిల్లాలోని పదధారిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసేవాడు. ప్రస్తుతం 52 ఏళ్ల వయసు కల్గిన అతడు 2012లో అక్కడే చదువుకుంటున్న ఓ మైనర్ విద్యార్థినిపై మనసు పాడేసుకున్నాడు. ఆమెకు మాయ మాటలు చెప్పి ముగ్గులోకి దింపాడు. ఆపై ఆమెతో పారిపోయి పెళ్లి చేసుకోకుండానే గర్భవతిని చేశాడు. ఆపై వదిలేయగా.. సదరు బాలిక ఇళ్లు చేరింది. ఇది జరిగిన కొంత కాలానికే మళ్లీ అదే బడికి చెందిన మరో విద్యార్థినితో ప్రేమలో పడ్డాడు. ఆమెను సైతం ఇంటి నుంచి తీసుకెళ్లిపోయి గర్భవతిని చేశాడు. ఆపై వదిలేయగా.. ఆమె కూడా ఇళ్లు చేరింది. ఇద్దరి విద్యార్థినులపై అత్యాచారం చేసినందుకు గాను వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలోనే కోర్టుకు వెళ్లగా.. గుజరాత్ హైకోర్టు అతడికి 2014లో జీవిత ఖైదు విధించింది. అయితే నాలుగేళ్ల పాటు జైల్లోనే ఉన్న అతడు 2018లో పెరోల్‌పై బయటకు వచ్చాడు. ఈక్రమంలోనే ట్యూషన్ పెట్టి.. ఇంగ్లీషు నేర్పిస్తానంటూ నమ్మబలికాడు. ఇలా తన వద్ద ట్యూషన్ తీసుకుంటున్న మరో మైనర్ విద్యార్థినితే ప్రేమాయణం ప్రారంభించాడు. ఆపై ఢిల్లీకి పారిపోయి.. బాలికను కూడా అతడితో వచ్చేలా చేసుకున్నాడు. ఆపై వేర్వేరు రాష్ట్రాలు తిరుగుతూ.. పేర్లు మార్చుకుంటూ జీవనం సాగించారు. ఈక్రమంలోనే సదరు బాలిక గర్భవతి అయింది. చివరకు జంషెడ్‌పూర్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో తప్పుడు గుర్తింపుతో బాలిక మగబిడ్డకు జన్మను ఇచ్చింది. ఆ తర్వాత కొంత కాలం బాగానే ఉన్న ధవల్ త్రివేది తీరు నచ్చక సదరు అమ్మాయి 2020లో అతడితో విడిపోయింది. ఆపై బాబును తీసుకుని గుజరాత్‌లోని తన ఇంటికి చేరింది. విషయం తెలుసుకున్న సీబీఐ అధికారులు ఆమెను విచారించగా.. ధవల్ త్రివేది ఎక్కడుంది తెలిసింది. ఇలా మరోసారి అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్నాళ్లూ అతడిని జైల్లోనే పెట్టగా.. తాజాగా సీబీఐ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టింది. ఈక్రమంలోనే మరోసారి ధవల్ త్రివేదికి జీవితఖైదు విధిస్తున్నట్లు వివరించింది. అలాగే 7 లక్షల రూపాయల జరిమానా కూడా విధిస్తున్నట్లు పేర్కొంది. పెరోల్‌పై బయటకు వచ్చాకా కూడా ఇదే నేరం చేయడాన్ని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ముఖ్యంగా ప్రేమను నటిస్తూ.. నిజమైన గుర్తింపును దాచిపెట్టి, అబద్ధాలు చెబుతూ మైనర్ విద్యార్థినుల జీవితాన్ని నాశనం చేసిన ధవల్ త్రివేదికి భవిష్యత్తులో పెరోల్ కూడా ఇవ్వొద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## 'కీచక టీచర్ల' చిట్టా సిద్ధం..



**చెన్నై-నవభూమి:** విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే కీచకులుగా మారుతున్న వేళ.. వారి భరతం పట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా లైంగిక వేధింపులకు పాల్పడే టీచర్లను ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు వారి విద్యార్హత కూడా రద్దు చేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. ఆ మేరకు చర్యలకు ఉపక్రమించింది. గత పదేళ్లలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న టీచర్ల వివరాలు సేకరిస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు ఒకదాని తర్వాత ఒకటి వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా కృష్ణగిరి జిల్లా లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు కలిసి 13 ఏళ్ల విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ కేసులో ఆ ఉపాధ్యాయులను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు తరలించగా, పాఠశాల విద్యాశాఖ ఆ ముగ్గురుని డిస్మిస్ చేసింది. అదే విధంగా తిరుచ్చి, ఈరోడ్, హోసూరు, శివగంగ సహా పలు ప్రాంతాల్లో విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురవుతున్నారనే వార్తలు ఇటీవల వెలుగుచూడడంతో ఈ విషయం తీవ్రరూపం దాల్చింది. విద్యార్థులు పాఠశాలల్లో సురక్షితంగా ఉంటారని భావిస్తున్న తల్లిదండ్రులు, విద్యావేత్తల్లో ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న ఉపాధ్యాయులను డిస్మిస్ చేయాలనే డిమాండ్ కూడా పెరుగుతోంది.

**కఠిన చర్యలు...** రాష్ట్రవ్యాప్తంగా పదేళ్లలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుల జాబితా సేకరిస్తున్నారు. ఫిర్యాదులు, శాఖాపరమైన చర్యలు, కేసులు, విచారణ కమిటీ నివేదిక, శిక్ష విధింపబడినవి, పెండింగ్‌లో, విచారణలో ఉన్నవి, కేసులు ఎదుర్కొంటూ ఇంకా విధుల్లో ఉన్నవారు తదితర వివరాలను తీసుకుంటున్నారు. ప్రాథమిక విద్యాశాఖలో 80 మంది, పాఠశాల విద్యాశాఖలో 175 మంది చొప్పున మొత్తం 255 మంది జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. తప్పు చేసిన ఉపాధ్యాయులపై ఆర్డినెన్స్ 121 ప్రకారం తొలగించే అవకాశముంది. త్వరలోనే దీనికి సంబంధించిన స్పష్టమైన ఉత్తర్వులు వెలువడే అవకాశముందని విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

**రుజువైతే విద్యార్హత రద్దు....** లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి ఆరోపణ నిజమని తేలితే సంబంధిత ఉపాధ్యాయుల విద్యార్హత రద్దు చేస్తామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా లైంగిక ఫిర్యాదులకు పాల్పడిన ఉపాధ్యాయుల జాబితా, వారిపై తీసుకున్న చర్యలను నివేదిక సమర్పించాలని ఆ శాఖ డైరెక్టర్లకు ఉత్తర్వులందినట్లు సమాచారం. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ... విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అలాంటి వాటికి స్వస్తి పలికి విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకోవాలని, ఘటనలకు బాధ్యులైన ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు కఠినతరం చేయాలని నిర్ణయించామన్నారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోవాలని 2012లో ఆర్డినెన్స్ (121) జారీ చేసిందని తెలిపారు. తమిళనాడు ప్రభుత్వ సేవకుల ప్రవర్తనా నియమావళిలోని 19 (2) ఉపాధ్యాయులకు వర్తిస్తుందన్నారు. అయితే వివిధ కారణాలతో ఈ ఉత్తర్వులు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఈ ఉత్తర్వులు అమలుచేసేలా చర్యలు చేపట్టామన్నారు.


### పాత కుక్కర్‌లో బంగారం దాచింది..

# మరిచిపోయి అమ్మేసింది.. సీన్ కట్ చేస్తే!



**కొల్లాం-నవభూమి:** సాధారణంగా ఇళ్లల్లో ఉండే ఆడవాళ్లు ఎక్కువగా తమ వద్ద ఉన్న డబ్బులను ఏ పోపుల డబ్బాలోనే, బియ్యం బస్తాల్లోనే పెట్టుకుని దాచుకుంటూ ఉంటారు. ఇంట్లో వాళ్లకి తెలిసేలా పెడితే తీసుకుంటారని కొందరు, ఇలా పొదుపు చేస్తే కష్ట సమయాల్లో పనికి వస్తాయని మరికొందరు ఇలా చేస్తుంటారు. అలాగే చేసిందో మహిళ. ముఖ్యంగా దొంగల భయం ఎక్కువ కావడం వల్ల తన బంగారాన్ని తీసి ఓ పాత పాడైన కుక్కర్‌లో వేసింది. కానీ ఆ విషయం మర్చిపోయి ఆ కుక్కర్‌ను తుక్కు వ్యాపారికి అమ్మేసింది. ఆపై ఏం జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం. కేరళలోని కొల్లం అంచల్‌కు చెందిన సుభద్ర తంగల్.. తన కుటుంబంతో కలిసి అక్కడే జీవిస్తోంది. అయితే ఈ మధ్య కాలంలో ఆ గ్రామంలో చాలా దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో భయపడిపోయిన సుభద్ర తన వద్ద బంగారు గొలుసు, కమ్మలు, ఉంగరాన్ని ఎక్కడైనా దాచాలనుకుంది. బీరువాలోని లాకర్‌లో పెట్టినా, మరెక్కడ పెట్టినా దొంగలు వాటిని సులువుగా గుర్తిస్తారని చాలా ఆలోచించి ఓ అద్భుతమైన ప్లాన్ వేసింది. ముఖ్యంగా తన ఇంట్లో ఉన్న ఓ పాత పాడైన ప్రెషర్ కుక్కర్‌లో తన బంగారం వేసి మూత పెట్టేసింది. ఆపై ఓ పక్కన ఉంచింది. అయితే 15 రోజుల క్రితం తమిళనాడుకు చెందిన తుక్కు వ్యాపారి మహేష్ ఆ గ్రామానికి వచ్చాడు. పాత సామాన్లు కొనుగోలు చేస్తూ డబ్బులు ఇవ్వగా.. సుభద్ర దాన్ని గమనించింది. వెంటనే తన వద్ద ఉన్న పనికి రాని సామాన్లను అమ్మాలనుకుంది. వెంటనే కూతురితో కలిసి తన ఇంట్లోని పాత, పనికరాని వస్తువులను తీసుకు వచ్చింది. అందులోనే తాను బంగారం దాచిన కుక్కర్ కూడా ఉంది. కానీ విషయం మర్చిపోయిన సుభద్ర వాటన్నిటినీ తుక్కు వ్యాపారి మహేష్‌కు అమ్మేసింది. ఈ సామాన్లు అన్నీ తీసుకు వెళ్లిన తుక్కు వ్యాపారి మహేష్.. రెండ్రోజుల తర్వాత స్టీలు పాత్రలు కరిగించేందుకు వెళ్లాడు. అక్కడకు వెళ్లాకే సుభద్ర ఇచ్చిన పాత కుక్కర్ తెరవగా అందులో బంగారం కనిపించింది. వెంటనే దాన్ని తీసుకున్న ఆయన.. అమ్ముకుని డబ్బు చేసుకోవాలనుకోలేదు. మంచి మనస్సుతో దాన్ని తిరిగి వెనక్కి ఇచ్చేయాలనుకున్నాడు. అందులో భాగంగానే ఆ కుక్కర్ తనకు ఎవరు అమ్మారో కనుక్కోవాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలోనే తాను సామాన్లు కొనుగోలు చేసిన గ్రామానికి వెళ్లాడు. ఓ వార్డు మెంబర్ సాయంతో ఆ కుక్కర్ ఎవరిదో కనుక్కునే పనిలో పడ్డాడు. రోజంతా గ్రామంలోని ఇండ్లన్నీ తిరిగి ఆ కుక్కర్‌ను సుభద్రకు ఇచ్చాడు. ముఖ్యంగా అందులో ఉన్న బంగారు గొలుసు, కమ్మలు, ఉంగరం (15 గ్రాములు) ఆభరణాలను తిరిగి ఇచ్చారు. అది చూసిన సుభద్ర దొంగల భయం వల్ల దాచానని.. మర్చిపోయి అమ్మానని చెప్పింది. తన బంగారం తనకు తిరిగి ఇచ్చిన తుక్కు వ్యాపారి మహేష్‌కు ధన్యవాదాలు తెలిపింది. ఆనోటా ఈనోటా పాకిన ఈ విషయం నెట్టింట వైరల్ కాగా.. ప్రతీ ఒక్కరు తుక్కు వ్యాపారి మంచి మనసుకు ఫిదా అయిపోతున్నారు. లోకమంతా అలాంటి వాళ్లే ఉంటే ఎంత బాగుంటుందో కదా అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# అయోధ్య రామ మందిర ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ కన్నుమూత



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** అయోధ్య రామ మందిరం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ ఇకలేరు. ఇటీవలే ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రాగా.. కుటుంబ సభ్యులు లఖ్‌నవూలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతున్న ఆయనకు మధుమేహంతో పాటు బీపీ ఎక్కువ కాగా.. బుధవారం రోజు ఉదయం ప్రాణాలు కోల్పోయారు. 85 ఏళ్ల వయసులో ఆయన అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన అభిమానులు అంతా కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూనే.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు. ఆ పూర్తి విశేషాలు మీకోసం. అయోధ్య రామాలయం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్‌కు 85 ఏళ్ల వయసులో ఫిబ్రవరి 3వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఆశ్రమంలోనే ఆయన ఒక్కసారిగా కుప్పకూలగా.. అనుచరులు అతడిని లఖ్‌నవూలోని సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడే ఉన్న పూజారికి.. వైద్యులు మెరుగైన చికిత్సనే అందించారు. కానీ బీపీ, మధుమేహం వంటి సమస్యలు ఎక్కువ కాగా.. ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. ఈ విషయాన్ని నేరుగా అక్కడి వైద్యులే తెలిపారు. ముందుగా ఐసీయూలో ఉంచి చికిత్స అందించిన వైద్యులు.. ఆ తర్వాత సత్యేంద్ర దాస్‌ను న్యూరాలజీకి చెందిన హై డిపెండెన్సీ యూనిట్‌కు మార్చారు. తొమ్మిది రోజులుగా ఆస్పత్రిలోనే ఉంచి.. అనుక్షణం ఆయన ఆరోగ్య పరిస్థితిని కనిపెట్టుకుని ఉంటున్నారు. అలాగే అవసరమైన అన్ని చికిత్సలను అందిస్తూ.. ఆయన్ను కాపాడేందుకు తీవ్రంగానే కృషి చేశారు. కానీ దురదృష్టవశాత్తు ఆయన ఈరోజు ప్రాణాలు విడిచారు. ఈ విషయం తెలుసుకున్న రాజకీయ ప్రముఖులతో పాటు రాష్ట్ర ప్రజలంతా తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్.. ఆచార్య సత్యేంద్ర దాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. సత్యేంద్ర దాస్ మహారాజ్ మరణం అత్యంత విచారకరం అని.. ఆధ్యాత్మిక ప్రపంచానికి ఆయన మృతి తీరని లోటని చెప్పుకొచ్చారు. అలాగే తీవ్ర దుఃఖంలో ఉన్న ఆయన శిష్యులు, అనుచరులకు ఈ అపారమైన నష్టాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్ గురువారం 13 । ఫిబ్రవరి । 2025






## భారీ నష్టాల నుంచి కోలుకుని.. స్వల్ప నష్టాలతో ముగిసి..

**ముంబై-నవభూమి:** వివిధ దేశాలతో అమెరికా వాణిజ్య యుద్ధాల కారణంగా, అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. స్టీల్, అల్యూమినియంతో పాటు ఇతర ఉత్పత్తులపై కూడా దిగుమతి సుంకం విధించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతుండడం, విదేశీ మదుపర్లు భారీగా అమ్మకాలకు దిగడం స్టాక్‌మార్కెట్ల సెంటిమెంట్‌ను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. మంగళవారం భారీ నష్టాలను చవిచూసిన సూచీలు బుధవారం ఉదయం కూడా అదే ధోరణిలో కొనసాగాయి. మధ్యాహ్నం తర్వాత కోలుకున్నాయి. మంగళవారం ముగింపు (76, 293)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం వంద పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 950 పాయింట్లకు పైగా కోల్పోయి 75, 388 వద్ద ఇంట్రాడే కనిష్టానికి పడిపోయింది. అయితే మధ్యాహ్నం తర్వాత కోలుకుంది. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లు సాగించడంతో ఇంట్రాడే కనిష్టం నుంచి 1100 పాయింట్లు పైకి వచ్చింది. చివరకు 122 పాయింట్ల నష్టంతో 76, 171 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. ఉదయం 22, 800 కంటే కింద పడిపోయి ఆ తర్వాత కోలుకుంది. చివరకు 26 పాయింట్ల నష్టంతో 23, 045 వద్ద స్థిరపడింది.

## వారానికి 90 పనిగంటల తర్వాత.. మరోసారి ఎల్అండ్‌టి ఛైర్మన్ సంచలన వ్యాఖ్యలు..



**ముంబై-నవభూమి:** ఎల్అండ్‌టి ఛైర్మన్ సుబ్రమణియన్ మరలా వివాదాస్పద వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించారు. కొన్నిరోజుల క్రితం భార్యను ఎంతసేపు చూస్తూ కూర్చుంటారు. దేశం అభివృద్ధి చెందాలంటే వారానికి 90 గంటలు పనిచేయాలి అని సంచలన వ్యాఖ్యలు చేసి దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ సంగతి అంతా మరిచిపోకముందే మరో మారు వివాదాస్పద వ్యాఖ్యలతో చర్చకు తెరలేపారు. చెన్నైలో జరిగిన CII శిఖరాగ్ర సమావేశంలో సుబ్రమణియన్ మాట్లాడుతూ, కంపెనీలో 2.5 లక్షల మంది ఉద్యోగులు, దాదాపు 4 లక్షల మంది నిర్మాణ కార్మికులను పనిచేస్తున్నారు. ఉద్యోగులు మా కంపెనీని వదిలి వెళ్లినా లేదా కొంతమంది ఉద్యోగులను తొలగించినా అవన్నీ పెద్దగా ప్రభావితం చేయవు. కానీ ఇటీవల నిర్మాణ రంగంలో కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రస్తుతం నిర్మాణ కార్మికులు పని కోసం వలస వెళ్ళడానికి ఇష్టపడటంలేదు. దీనికి ఒక కారణం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు. చాలా మంది కార్మికులకు వారు ఉన్న చోటనే సంపాదిస్తున్నట్లున్నారు. అందుకే వలస వెళ్లడం లేదు. అందుకే ఈ రోజుల్లో నిర్మాణ కార్మికులను నియమించుకోవడం కష్టంగా మారింది." అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

**వైట్ కాలర్ ఉద్యోగుల్లోనూ ఇదే మనస్తత్వం..**

ఈ మనస్తత్వం బ్లూ కాలర్ కార్మికులలో మాత్రమే ఉంటుందని చెప్పలేము. వైట్ కాలర్ కార్మికులకు కూడా ఉండవచ్చు. నేను %వాడు%లో ఇంజనీర్‌గా చేరినప్పుడు, నా బాస్, "నువ్వు చెన్నై వాడివైతే, వెళ్లి ఢిల్లీలో పని చేయి" అని అన్నారు. కానీ ఈ రోజుల్లో నేను ఒక ఉద్యోగికి అలా చెబితే అతడు 'బై' చెప్పి వెళ్లిపోతాడు. నేటి పని సంస్కృతి మారిపోయింది. ఉద్యోగులకు అనుగుణంగా విధానాలను మార్చాల్సిన పరిస్థితిలో ఉన్నాం" అని ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.

గతంలో ఎస్.ఎన్. సుబ్రమణియన్ పనిగంటల గురించి చర్చిస్తూ "ఆదివారాలు మిమ్మల్ని పని చేయించలేకపోయినందుకు నేను చింతిస్తున్నాను. ఎందుకంటే నేను ఆదివారాలు పని చేస్తాను. ఆదివారాలు ఇంటి దగ్గర భార్య ముఖం ఎంతసేపు చూస్తూ ఉంటారు? భార్య తన భర్త ముఖాన్ని ఎంతసేపు చూస్తూ ఉండగలదు? ఆఫీసుకు వచ్చి పని చేయండి. ప్రపంచంలో నంబర్‌వన్‌గా ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాలి" అని వ్యాఖ్యానించి వివాదాన్ని రేకెత్తించారు.

## మూడింట రెండొంతుల పన్ను రిటర్నుల్లో చెల్లింపులు నిల్లు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆదాయం పన్ను (ఐటీ) రిటర్న్‌లు సమర్పించే వారిలో మూడింట రెండొంతుల మంది చెల్లించిన పన్ను సున్నా అని కేంద్రం వెల్లడించింది. వీరి సంఖ్య 2019-20 ఆర్థికతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి దాదాపు రెట్టింపైంది. లోక్‌సభలో పన్ను చెల్లింపుదారులపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖిత పూర్వకంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మంత్రి సమర్పించిన డేటా ప్రకారం.. 2019-20లో 6.48 కోట్ల మంది ఐటీ రిటర్న్‌లు సమర్పించగా.. అందులో సున్నా పన్ను బకాయితో దాఖలైన రిటర్నులు 2.9 కోట్లు. అంటే మొత్తం రిటర్న్‌ల్లో 44.75 శాతానికి సమానం. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31 నాటికి 8.39 కోట్ల మంది రిటర్న్‌లు ఫైల్ చేశారు. అందులో 5.58 కోట్ల(66.5 శాతం) మంది సున్నా పన్ను బకాయితో రిటర్న్‌లు సమర్పించినట్లు మంత్రి తెలిపారు.

## ఐపీఓలపై స్టార్టప్‌ల దృష్టి



**న్యూఢిల్లీ-నవభూమి:** నిధుల సమీకరణ లేదా పెట్టుబడుల ఉపసంహరణ కోసం అనేక స్టార్టప్ కంపెనీలు ఈ సంవత్సరం ఐపీఓ మార్కెట్‌వైపు చూస్తున్నాయి. అంతర్జాతీయంగా కొన్ని సవాళ్లున్నా ఈ సంవత్సరం ఈ కంపెనీల నిధుల సమీకరణకు పెద్ద ఇబ్బందులేమీ ఉండక పోవచ్చని ఇన్నోవెన్ క్యాపిటల్ అనే సంస్థ తన తాజా 'ఇండియా స్టార్టప్ ఔట్‌లుక్ నివేదికలో తెలిపింది. ఈ సర్వేలో పాల్గొన్న 100 స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లలో 47 మంది ఈ సంవత్సరం నియామకాల జోరు పెరుగుతుందని చెప్పారు. అయితే నిధుల సమీకరణలో సమసత్యలు ఉండవన్న 79 శాతం మంది చెప్పగా ఐపీఓల ద్వారా పెట్టుబడుల ఉపసంహరణకు 73 శాతం స్టార్టప్ కంపెనీల ప్రమోటర్ల ఆసక్తి ప్రదర్శించారు. వచ్చే రెండు మూడేళ్లలో తమ వ్యాపార మోడల్స్‌పై ఏఐ ప్రభావం ఉంటుందని 28 శాతం స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లన్నారు. 83 శాతానికిపైగా స్టార్టప్ కంపెనీల నాయకత్వ స్థానాల్లో మహిళలు 20 శాతం కూడా లేరని ఆ సర్వేలో తేలింది.

## 49% వార్షిక వృద్ధితో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ రాబడి రూ.700 కోట్లు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ నేడు డిసెంబర్ 31, 2024తో ముగిసిన మూడవ త్రైమాసికానికి తన ఏకీకృత ఫలితాలను ప్రకటించింది. త్రైమాసిక ఆదాయం రూ.700 కోట్లను అధిగమించగా, ఇది ఏడాది నుంచి ఏడాదికి 49% వృద్ధి చెందింది. బ్యాంక్ నికర లాభాలు రూ.18.5 కోట్లు కాగా, ఏడాది నుంచి ఏడాదికి పోల్చితే, ఈ ఆర్థిక సంవత్సరంలోని 3వ త్రైమాసికంలో 70% వార్షిక వృద్ధితో రూ.87 కోట్లకు చేరుకుంది. ఈ త్రైమాసికంలో, బ్యాంక్ నెలవారీ లావాదేవీ వినియోగదారులు 100 మిలియన్ల పైచిలుకుకు చేరుకోగా, ఇది 62% వార్షిక పెరుగుదలతో 100 మిలియన్లను అధిగమించింది. వార్షిక స్థూల వస్తువుల విలువ రూ.4,000 బిలియన్లకు చేరువలో ఉంది. ఇది బ్యాంక్ డిజిటల్ సేవింగ్స్ ఖాతాలు, వ్యాపారి ప్రతిపాదనలు, ఇతర ఉత్పత్తులకు పెరుగుతున్న స్వీకరణను ప్రతిబింబిస్తుంది. వినియోగదారుల బ్యాలెన్స్‌లు కూడా బలమైన వృద్ధిని చూశాయి. ఇది రూ.3,332 కోట్లను దాటగా, గత ఏడాదితో పోలిస్తే 42% పెరిగింది. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ డిజిటల్ ఆఫర్‌లను బలంగా స్వీకరించడం ద్వారా ఈ వృద్ధికి ఆజ్యం పోసింది. ఎక్కువ మంది వినియోగదారులు తమ రోజువారీ లావాదేవీల కోసం సురక్షిత డిజిటల్ ఖాతాను ఎంచుకుంటున్నారు. ఈ రోజు వరకు 1.7 మిలియన్లకు పైగా రూపే ఎన్‌సిఎంసీ -ఎనేబుల్డ్ కార్డులను జారీ చేయడం ద్వారా బ్యాంక్ బి2బి అర్బన్ ట్రాన్సిట్ విభాగంలోనూ అగ్రగామిగా ఉంది. తన వినూత్న సౌండ్‌బాక్స్‌తో సహా వ్యాపారి ఆఫర్‌లను స్వీకరించే వ్యాపారాలలో వృద్ధి చెందుతూనే ఉంది. దేశంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సేవల పరిష్కారాలను అందిస్తూ బ్యాంక్ చక్కని ఆదరణను అందుకుంటోంది. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ అనుబ్రత బిశ్వాస్ మాట్లాడుతూ, "మా బ్యాంకింగ్ మోడల్ బలాన్ని పునరుద్ఘాటిస్తూ, మరో త్రైమాసికంలో అద్భుతమైన వృద్ధిని ప్రకటిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము. పూర్తిగా ఇంటిగ్రేటెడ్, టెక్నాలజీ ఆధారిత బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్‌గా, మేము పట్టణ గ్రామీణ వినియోగదారుల విభిన్న ఆర్థిక అవసరాలను తీరుస్తూనే ఉన్నాము. ముఖ్యంగా, మేము ఇప్పుడు భారతదేశంలో 3వ అతిపెద్ద మొబైల్ బ్యాంక్ సురక్షితమైన 2వ ఖాతా కోసం ఇష్టపడే ఎంపికగా మేము నిలిచాము" అని వివరించారు ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ భారతదేశ డిజిటల్ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా కొనసాగుతోంది, అర్బన్ డిజిటల్, అండర్‌బ్యాంకెడ్ ఇండస్ట్రీస్ అండ్ ఇన్‌స్టి ట్యూషన్స్ అనే 3 కీలక వినియోగదారుల విభాగాలకు సేవలు అందిస్తోంది. బ్యాంక్ ఏటా 8 బిలియన్లకు పైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తుండగా, 500,000 కన్నా ఎక్కువ బ్యాంకింగ్ పాయింట్లతో, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ అత్యంత మారుమూల ప్రాంతాలకు కూడా ఆర్థిక సేవలను విస్తరిస్తుంది. ఈ బ్యాంకింగ్ పాయింట్లలో 97,000 కన్నా ఎక్కువ మహిళా వ్యాపా ర కరస్పాండెంట్లు నిర్వహిస్తూ, స్థానిక సమాజాలను మరింత శక్తివంతం చేస్తున్నారు. ఇది 46 బిలియన్ల అమెరికన్ డాలర్లచెల్లింపుల సంస్థగా, డిజిటల్ లావాదేవీలను ముందుకు తీసుకువెళడంలో, ఆర్థిక చేరికను ప్రోత్సహించడంలో దేశవ్యాప్తంగా వ్యాపారాలను సాధికారపర్చింది.

## ఇండియాలో టాప్ స్మాల్ బిజినెస్ ఐడియా ఇదే..




**న్యూఢిల్లీ-నవభూమి:** లోన్ చెల్లించే స్థోమత ఉండదు. కానీ ఇంటి దగ్గరే ఉంటూ ఏదైనా వ్యాపారం చేయాలనే ఆశ ఉంటుంది. అప్పు చేయకుండా చేతిలో ఉన్న కొంచెం డబ్బుతోనే జీవితంలో చిన్న స్థాయి వ్యాపారవేత్తగా స్థిరపడాలనే కోరిక మీలో ఉందా. మంచి ఆలోచన తెలిస్తే ఎంత కష్టమైనా పడేందుకు మేం సిద్ధం అనే ఆశయం ఉన్నవారి వారికోసమే ఈ బిజినెస్ ఐడియా. పెట్టుబడి కూడా వేలల్లోనే. డబ్బు పోతుందనే భయమూ లేదు. పెట్టుబడి పెట్టిన డబ్బు రెట్టింపు లాభాలతో తప్పకుండా మీ చేతికి తిరిగొస్తుంది. ఎందుకంటే, ఇండియాలో ఉన్న చిన్న వ్యాపారాల్లో ఇదే టాప్. మరి అదెంటో తెలుసుకోండి. బిజినెస్ కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం కూడా లేదు.

దేశంలో చాలా మంది యువత గ్రామాల్లోనే నివసిస్తుంటారు. సాధారణంగా పల్లెటూళ్లలో వ్యవసాయమే ప్రధానంగా జీవించే కుటుంబాలే ఎక్కువ. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద చదువులు చదివినా ఉద్యోగం లభించడం కష్టంగా మారింది. ఒకవేళ దొరికినా ఆఫీసు పని ఒత్తిడి, టార్గెట్ల మధ్య నలిగిపోతూ ఉండేవాళ్లు ఏదైనా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూసుకోవాలని ఆశిస్తుంటారు. స్వయం ఉపాధి కోసం ఎదురుచూసే వారికి ఊళ్లో కాస్త స్థలం ఉంటే చాలు. వారికి మైక్రో ఫార్మింగ్ బెస్ట్ ఆప్షన్ అవుతుంది. ఎందుకంటే, నేడు ఎక్కువ మంది కల్తీ, రసాయనాలతో పండించిన పంటలు అనారోగ్యం పాలవుతున్నారు. పక్కా ప్లానింగ్ వేసుకుని ఈ బిజినెస్ స్టార్ట్ చేస్తే లాభాలు రావడం ఖాయం.

**మైక్రో ఫార్మింగ్ ప్రారంభించేందుకు కావలసినవి..**

మీ తాహతుని బట్టి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టుకోవచ్చు.

ఎన్ని ఎకరాల్లో చేయాలనేది మీ స్థాయిని బట్టి నిర్ణయించుకోండి.

స్థలం లేదు అనుకునే వారు మేడపై కూడా చేయవచ్చు.

ముల్లంగి, బ్రోకలీ, పొద్దుతిరుగుడు, బఠానీలు, కొత్తిమీర, క్యాబేజీ, ఉసిరికాయ పంటలు లాభసాటిగా ఉంటాయి. మార్కెట్ విషయంలో స్థానికంగా ముందుగానే మాట్లాడి ఉంచుకుంటే మేలు. పెద్ద స్థాయిలో మార్కెట్ చేస్తున్నా, పురుగుల మందులు వినియోగిస్తూ లైసెన్స్ తప్పక తీసుకోవాలి.

## మార్కెట్లోకి నిషేధిత చైనా యాప్స్.. ఎంతకు తెగించార్రా



**న్యూఢిల్లీ-నవభూమి:** చైనా వాళ్ల ఫోకస్ ఎక్కువగా ఇండియాపైనే ఉంటుందని చెప్పవచ్చు. భారతీయులు వినియోగించే అనేక రకాల యాప్స్ సహా ఉత్పత్తులపై వ్యాపారాలు చేస్తూ దోచేస్తుంటారు. ఈ క్రమంలో భారత్ బ్యాన్ చేసిన పలు చైనా యాప్స్ మళ్లీ మార్కెట్లోకి వచ్చాయి. ఆ విశేషాలేంటో ఇక్కడ చూద్దాం. చైనా టార్గెట్ ప్రధానంగా భారత్‌పైనే ఉంటుంది. చైనా మాంజా నుంచి మొదలుకుని బొమ్మలు, పలు రకాల యాప్స్ పేరుతో ఇండియాలోకి ప్రవేశించి దోచేకునేందుకు ప్లాన్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఇప్పటికే నిషేధించిన చైనా యాప్స్ మళ్లీ భారత మార్కెట్లోకి వచ్చాయి. అయితే 2020లో భారతదేశం భద్రతా ఆందోళనల కారణంగా దాదాపు 267 చైనీస్ యాప్‌లను నిషేధించింది. గల్వాన్ లోయలో చైనా భారత సరిహద్దు ఘర్షణ తర్వాత, దేశంలోని భద్రతా పరిస్థితులు బలహీనమైనాయని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తర్వాత అనేక రోజులు ఈ యాప్స్ కనిపించకుండా పోయాయి.

**రూపాన్ని మార్చుకుని..**

అయితే తాజాగా వేగంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ యాప్‌లు వాటి అసలు రూపాన్ని మార్చుకుని, వేర్వేరు పేర్లతో తిరిగి మార్కెట్‌లో ప్రవేశించాయి. ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో గతంలో నిషేధంలో ఉన్న దాదాపు 36 యాప్‌లు ప్రస్తుతం డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లు కొన్ని అంగీకరించిన మార్పులతో తిరిగి రావడంతోపాటు వాటి అసలు గుర్తింపు, లోగో, బ్రాండింగ్, యాజమాన్యాన్ని మార్చుకున్నాయి. గేమింగ్, షాపింగ్, వినోదం, ఫైల్ షేరింగ్, కంటెంట్ సృష్టి వంటి విభాగాల్లో ఈ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.

## ఐపీఓకు మరో రెండు కంపెనీలు.. వివరాలు, ధరల శ్రేణి..




**న్యూఢిల్లీ-నవభూమి:** పవర్ జనరేషన్, ట్రాన్స్మిషన్, డిస్ట్రిబ్యూషన్, ఆటోమేషన్ వంటి రంగాలతో పాటు గ్రిడ్ కనెక్టివిటీ, ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కోసం హై వోల్టాజ్ ఎలక్ట్రిక్ ఎక్విప్మెంట్, సొల్యూషన్స్ ని అందించే కంపెనీ అయిన క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్మెంట్స్ సంస్థ ఐపీవో వాలైంటైన్స్ డే అయిన ఫిబ్రవరి 14న ఓపెన్ కాబోతోంది. ఈ వారంలో మరో రెండు కొత్త కంపెనీలు ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ కు రాబోతున్నాయి. ఐపీఓలలో పెట్టుబడి పెట్టి భారీగా లిస్టింగ్ గెయిన్స్ పొందాలని భావించే వారి కోసం ఒక కొత్త మెయిన్ బోర్డు ఐపీఓ అందుబాటులోకి రాబోతోంది. పవర్ జనరేషన్, ట్రాన్స్మిషన్, డిస్ట్రిబ్యూషన్, ఆటోమేషన్ వంటి రంగాలతో పాటు గ్రిడ్ కనెక్టివిటీ, ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కోసం హై వోల్టాజ్ ఎలక్ట్రిక్ ఎక్విప్మెంట్, సొల్యూషన్స్ ని అందించే కంపెనీ అయిన క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్మెంట్స్ సంస్థ ఐపీవో వాలైంటైన్స్ డే అయిన ఫిబ్రవరి 14న ఓపెన్ కాబోతోంది. క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్మెంట్స్ ఐపీఓ ఫిబ్రవరి 14న ఓపెన్ అయ్యి ఫిబ్రవరి 18న ముగుస్తుంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ. 858.70 కోట్లను సమీకరించేందుకు ప్రయత్నిస్తోంది. క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్మెంట్స్ ఐపీవో ప్రైస్ బ్యాండ్ ను ఒక్కో ఈక్విటీ షేరుకి రూ. 401-425గా కంపెనీ నిర్ణయించింది. ఒక్కో లాట్‌కు 26 షేర్లను కేటాయించారు. అంటే కనీసం రూ.11, 050 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ కంపెనీ షేర్లు ఫిబ్రవరి 21న ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో లిస్ట్ కానున్నాయి.

పెట్రోలియం, చమురు, లూబ్రికెంట్స్‌ను నిల్వ చేసే టెర్మినల్స్‌కు ఆటోమేషన్ పరిష్కారాలను అందించే అడ్వాన్స్‌డ్ సిస్ టెక్ సంస్థ కూడా ఐపీవోకు రావడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఐపీవో ద్వారా నిధులను సేకరించడానికి అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. ఐపీవో ద్వారా సేకరించే నిధులను డబ్బును పెట్టుబడి, దీర్ఘకాలిక అవసరాల కోసం ఉపయోగిస్తారు.

## బంగారం, వెండి కొంటున్నారా.. ఈ రేట్లు తెలుసుకుని వెళ్లండి..



**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు బంగారం, వెండికొనుగోలు చేయాలని చూస్తున్నారా. అయితే ఓసారి రేట్లను తెలుసుకుని వెళ్లండి మరి. ఎందుకంటే వీటి ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. కొనుగోలు చేయాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ క్రమంలో గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం ఉదయం 6.15 గంటలకు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 87,540గా ఉండగా, 22 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములకు రూ. 80,620 స్థాయికి చేరుకుంది. మరోవైపు హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 87,390కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 80,110గా ఉంది. ఇక వెండి రేటు విషయానికి వస్తే హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ. 97,400గా ఉంది.

## తెలంగాణ ఫిట్‌నెస్ ఫెస్టివల్

**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణా స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి సహకారంతో షఫీ సామి క్లాసిక్ ద్వారా తెలంగాణ ఫిట్‌నెస్ ఫెస్టివల్, యువతను ప్రోత్సహించడానికి ఆరోగ్య విద్యను ప్రోత్సహించడానికి షోలో పాల్గొన్నారు. తెలంగాణ నుండి మా టాప్ త్రీ ఫైనలిస్ట్ ఓం సింగ్ బాడీబిల్డింగ్ విజేత. ఢిల్లీకి చెందిన క్లాసిక్ ఫిజిక్ హైదర్ మాలిక్. తెలంగాణ నుండి పురుషుల ఫిజిక్ షోహైబ్, ఫిషర్ కమిటీ చైర్మన్ మిట్టు సాయి సమక్షంలో పాల్గొన్నారు.

## రియల్ టైమ్ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్‌తో లైవ్ అవుతున్న మొదటి చెల్లింపుల బ్యాంకుగా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్

**న్యూఢిల్లీ-నవభూమి:** ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తన ఖాతాదారుల భద్రతను పెంపొందించే చర్యల్లో ఒక మైలురాయిలా నిలిచే ప్రయత్నంలో భాగంగా, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ ద్వారా ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ -సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ తో తన వ్యవస్థలను విజయవంతంగా అనుసంధానించింది. ఆర్థిక మోసాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు తన నిబద్ధతను బలోపేతం చేస్తూ, ఈ ఏకీకరణను అమలు చేసిన మొదటి నాలుగు బ్యాంకులలో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఒకటి - భారతదేశంలోని మొట్టమొదటి చెల్లింపుల బ్యాంకుగా నిలిచింది. ఈ అధునాతన API ఇంటిగ్రేషన్ 1930 హెల్ప్‌లైన్‌తో సహా , నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా దాఖలు చేయబడిన ఫిర్యాదులకు ప్రతిస్పందనగా బ్యాంక్ గతంలో చేపట్టిన మాన్యువల్ చర్యలను ఆటోమేట్ చేస్తుంది. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ×4జ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మధ్య రియల్-టైమ్ సమాచార భాగస్వామ్యం, సైబర్ క్రైమ్ ఫిర్యాదుల వేగవంతమైన, మరింత తార్కిక ప్రాసెసింగ్‌ను నిర్ధారిస్తుంది. ఇది హోం మంత్రిత్వ శాఖలోని 4కి ఫిర్యాదు నంబర్లు, మొబైల్ నంబర్లు, ఖాతా నంబర్లు, ఫిర్యాదు అందుకున్న మోసానికి సంబంధించిన మొత్తాలు, లావాదేవీ సూచనలు వంటి వివిధ వివరాలను అందిస్తుంది. నివేదించబడిన ఖాతా మరింత దుర్వినియోగం కాకుండా నిరోధించేందుకు ఈ వ్యవస్థ బ్యాంకును తక్షణ చర్య తీసుకునేందుకూ అనుమతిస్తుంది. దీని గురించి ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గణేష్ అనంతనారాయణన్ మాట్లాడుతూ, "ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో, మేము చేసే ప్రతి పనిలోనూ వినియోగదారుల భద్రత ప్రధానంగా ఉంటుంది. హోం మంత్రిత్వ శాఖలోని I4Cతో మా ఏకీకరణ ఆర్థిక మోసాలకు వ్యతిరేకంగా పోరాటంలో ముందుండాలనే మా నిబద్ధతను ప్రదర్శించడమే కాకుండా, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో నమోదైన మోసపూరిత ఫిర్యాదులకు రియల్-టైమ్ పరిష్కారాన్ని కూడా నిర్ధారిస్తుంది. ఈ ఏకీకరణ మా వినియోగదారులను రక్షించేందుకు రూపొందించిన మా భద్రతా పరిష్కారాల సూట్‌ను మరింత బలోపేతం చేస్తుంది" అని వివరించారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని I4C నుంచి వచ్చిన ఇన్‌పుట్‌ల ఆధారంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులు/ఆర్థిక సంస్థలకు సమగ్ర సలహాను జారీ చేసింది. డిజిటల్ పర్యావరణ వ్యవస్థలో మోసపూరిత లావాదేవీలను అడ్డుకునేందుకు ఉపశమన చర్యలను అమలు చేసేందుకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ తో సహకరించాలని ఆర్థిక సేవల విభాగం అన్ని బ్యాంకులను ఆదేశించింది.

మధ్యతరగతి ప్రజల డిమాండ్లను పరిగణనలోని తీసుకోవడం లేదన్న ఆందోళనలకు అడ్డుకట్ట వేస్తూ, వ్యక్తిగత ఆదాయ పన్ను స్లాబ్‌లను బడ్జెట్ హేతుబద్ధీకరించింది. మూలం వద్ద తగ్గించిన పన్ను పరిమితులను సవరించింది. పెరిగిన ద్రవ్యోల్బణం, తక్కువ ఆదాయ వృద్ధి నుంచి సవాళ్లను ఎదుర్కొంటున్న మధ్యతరగతికి చెందిన వినియోగదారుల డిమాండ్లను, పొదుపును ఇది పెంచే అవకాశం ఉంది.

## సామాన్యులకు రాయితీలకు మించి, బడ్జెట్ 'లైట్ టచ్' పై దృష్టి



**న్యూఢిల్లీ-నవభూమి:** సామాన్యులకు రాయితీలకు మించి, బడ్జెట్ 'లైట్ టచ్' నియంత్రణ విధానం ద్వారా వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెడుతుంది. తదుపరి ఐదేళ్లకు ఆర్థిక వ్యూహం వ్యవసాయం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సంస్థలు , ఎగుమతులను ప్రోత్సహించడం, ముందుకు సాగుతున్నప్పుడు భారతదేశ సామర్థ్య నిర్మాణంలో ప్రైవేట్ రంగం నుంచి ఎక్కువ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వైపు దృష్టి సారించింది. ఆర్థిక మంత్రి ఆర్థిక వ్యూహం వినియోగాన్ని పెంచడం వైపు మొగ్గు చూపింది. అయితే 2024-25 బడ్జెట్ ప్రణాళికల నుంచి మూలధన లక్ష్యాన్ని విస్తృతంగా మార్చలేదు. బడ్జెట్ అందించిన కౌంటర్- సైక్లికల్ పుష్ దాని విస్తృత ఆర్థిక ఏకీకరణ వ్యూహంలో ఉంది. ఇది 2025-26లో 4.4% ఆర్థిక లోటును లక్ష్యంగా చేసుకుంది. ఆదాయపు పన్ను మార్పుల కారణంగా ఆదాయం కోల్పోయినప్పటికీ, 2025-26లో ఖర్చు వైపు కుదింపుతో ఆర్థిక ఏకీకరణ సాధించేందుకు అవకాశం ఉంటుంది. నేడు బడ్జెట్ ప్రకటన 2025-26లో స్థూల జాతీయోత్పత్తి వృద్ధిలో 6.6% అనే మా అంచనాను పటిష్టం చేస్తుంది. మార్కెట్ రుణాలు అంచనాలకు అనుగుణంగా ఉండటంతో బాండ్ మార్కెట్‌కు పెద్దగా ఆశ్చర్యం లేదు.

రాబోయే రేట్ల కోతలు భారతీయ రిజర్వు బ్యాంకు ఓపెన్ మార్కెట్ కొనుగోళ్లతో పాటు, బాండ్ దిగుబడి తగ్గుతుందని అంచనా.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 హైదరాబాద్ గురువారం 13 ఫిబ్రవరి 2025



# విజయ్, గౌతమ్ తిన్ననూరి టైటిల్ వచ్చేసింది

విజయ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమాకు 'కింగ్‌డమ్' అనే టైటిల్ ఖరారు చేసినట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.టైటిల్ తో పాటు బుధవారం నాడు టీజర్ ను కూడా ఆవిష్కరించారు. ఈ సినిమా టీజర్ తెలుగు వెర్షన్‌కి జూనియర్ ఎన్టీఆర్, తమిళ వెర్షన్‌కి సూర్య, హిందీ వెర్షన్‌కి రణబీర్ కపూర్ వాయిస్ ఓవర్ అందించారు. ఈ ముగ్గురు స్టార్లు తమ గొంతుతో రోమాలు నిక్కబొడుచుకునేలా చేసి, టీజర్‌ను మరో స్థాయికి తీసుకువెళ్లారు."కింగ్‌డమ్' చిత్రానికి విజయ్ దేవరకొండ ప్రాణం పెట్టి పనిచేస్తున్నారు. సినిమాని వేరే స్థాయికి తీసుకొని వెళ్ళడానికి తన వైపు నుంచి నూటికి నూరు శాతం కృషి చేస్తున్నారు.

విజయ్ సినిమాకి సంబంధించిన ఏదైనా అప్డేట్ వస్తే, దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టి ఉండటం సహజం. 'కింగ్‌డమ్' టీజర్ విడుదల తేదీ ప్రకటన వచ్చిన దగ్గర నుంచి, ఈ టీజర్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని దేశవ్యాప్తంగా అందరూ ఎదురుచూశారు. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా టీజర్ కట్టిపడేసింది" అని నిర్మాతలు అన్నారు









# కాక పుట్టించే బ్యూటీ క్రేజీ ఛాన్సులకు దూరంగా!

యంగ్ బ్యూటీ ఇవానా గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు 'లవ్ టుడే' సినిమాతో తెలుగు నాట బాగా ఫేమస్ అయింది. యూత్ ఫుల్ లవ్ స్టోరీతో యువతకి బాగా రీచ్ అయింది. 'లవ్ టుడే' తమిళ అనువాద చిత్రమైనా సక్సెస్ ఆమెకు మంచి గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో తెలుగులో మంచి కెరీర్ ఉంటుందని అంతా భావించారు. కానీ అమ్మడి కెరీర్ మాత్రం అలా సాగడం లేదు. 'లవ్ టుడే' తర్వాత తెలుగులో ఓ సినిమాకి సైన్ చేసింది. అదే 'సెల్ఫిష్'. దిల్ రాజు తమ్ముడు కుమారుడు అశిష్ రెడ్డి హీరోగా మొదలైన ప్రాజెక్ట్ ఇది. అయితే ఈసినిమా ప్రారంభమై చాలా కాలమవుతుంది. ఇంకా ఈ సినిమా సెట్స్ లోనే ఉంది. దిల్ రాజుసొంత నిర్మాణ సంస్థలోనే పట్టాలెక్కించిన చిత్రమిది. అయితే ఇదే సమయంలో రాజుగారు కొన్ని భారీ బడ్జెట్ చిత్రాలు కూడా పట్టా లెక్కించారు. దీంతో నిర్మాణ పరంగా ఇబ్బందులు తలెత్తడంతో సెల్ఫిష్ ని తాత్కాలికంగా వాయిదా వేసారు. అయితే ఈ వాయిదా అన్నది అశిష్ సహా ఇవానా కెరీర్ పై కూడా ప్రభావం పడింది. ఇద్దరు ఆ ప్రాజెక్ట్ బాండ్ అయి ఉన్నారు. కొత్త సినిమా అవకాశాలు రాకపోవడంతో గ్యాప్ ఏర్పడింది. అశిష్ సంగతి పక్కన బెడితే? ఇవానాకి తెలుగులో మంచి క్రేజ్ ఉంది. నటిగా తొలి సినిమాతోనే ప్రూవ్ చేసుకుంది. ఈనేపథ్యంలో తెలుగులో పెద్ద హీరోయిన్ అవుతుంది అన్న అంచనాలు సైతం తెరపైకి వచ్చాయి. కానీ సెల్ఫిష్ ఇంకా సెట్స్‌నే ఉండటతో కొత్త ఛాన్సులు రాలేదు. అటు తమిళ్ లో కూడా అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది ఒక్క సినిమాతోనే ప్రేక్షకుల ముందు కొచ్చింది. మాలీవుడ్ లో కూడా సినిమాలు చేయలేదు. తొలుత కెరీర్ అక్కడే ప్రారంభించింది. అటుపై మరింత మెరుగైన కెరీర్ కోసం కోలీవుడ్ లో లాంచ్ అయింది. అక్కడ బాగానే ఫేమస్ అయింది. అక్కడ నుంచి టాలీవుడ్ కి షిఫ్ట్ అయితే మొదటి కే మోసం వచ్చింది. ఇలా ఇవానా కెరీర్ డే బై డే మరింత నెమ్మదిస్తుంది.


# తండ్రి సినిమాల నిర్మాణంలో బిజీ బిజీగా కూతురు



కాస్ట్యూమ్ డిజైనర్ గా కెరీర్ ను స్టార్ట్ చేసిన సుస్మిత కొణిదెల పలు హిట్ సినిమాలకు పని చేసింది. సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ట్రై చేస్తోన్న చిరంజీవి పెద్ద కూతురు సుస్మిత కొన్నేళ్ల ముందు కాస్ట్యూమ్ డిజైనర్‌గా తన జర్నీని మొదలుపెట్టి చిరంజీవి, రామ్ చరణ్ సినిమాలకు పని చేసింది. కాస్ట్యూమ్ డిజైనర్ గా ఉన్న సుస్మిత తర్వాత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టింది. గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్ ప్రై. లి పేరుతో బ్యానర్ ను స్టార్ట్ చేసి వెబ్ సిరీస్‌లు, సినిమాలు చేయడం మొదలుపెట్టింది. ఓటీటీలో మొదటిగా తన లక్ ను చెక్ చేసుకున్న సుస్మిత తర్వాత సేనాపతి అనే సినిమాను నిర్మించింది. ఆహాలో స్ట్రీమింగ్ అయిన సేనాపతి విమర్శకుల ప్రశంసలు సైతం అందుకుంది. గతేడాది శ్రీదేవి శోభన బాబు పేరుతో మొదటిసారి థియేటర్ సినిమాను నిర్మించి యావరేజ్ అనిపించుకుంది. ఇక రీసెంట్ గా పరువు అనే వెబ్ సిరీస్ ను నిర్మించిన సుస్మిత ఆ సిరీస్ తో మంచి రెస్పాన్స్ అందుకుంది. అయితే నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన దగ్గర నుంచి తండ్రి చిరంజీవితో సినిమా చేయాలని సుస్మిత ట్రై చేస్తున్న విషయం తెలిసిందే. కానీ ఆ ప్రాజెక్టు అనుకోని కారణాల వల్ల లేటవుతూనే వస్తోంది. ఇవన్నీ చూసి ప్రస్తుతానికైతే సుస్మిత కొన్ని ప్రాజెక్టులకు కో ప్రొడ్యూసర్ గా వ్యవహరించడానికి రెడీ అయినట్టు తెలుస్తోంది. త్వరలో తన తండ్రి మెగాస్టార్ చేయబోయే రెండు సినిమాలకు సుస్మిత సహ నిర్మాతగా ఉండబోతోందట. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి చేయబోయే సినిమాను సాహు గారపాటితో కలిపి సుస్మిత నిర్మించనున్నట్టు స్వయంగా చిరంజీవే రీసెంట్ గా వెల్లడించాడు. దీంతో పాటూ డైరెక్టర్ బాబీ చెప్పిన ఓ కథకు చిరూ తలూపాడని, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించబోయే ఆ సినిమాలో కూడా సుస్మిత భాగం కానున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు సినిమాలకు సంబంధించిన నిర్మాణ బాధ్యతలన్నీ సుస్మిత దగ్గరుండి చూసుకోబోతుందట. అంటే ఈ సినిమాల ద్వారా వచ్చే లాభ నష్టాల్లో కూడా సుస్మిత వాటా పంచుకోనుందన్నమాట. మొత్తానికి కాస్ట్యూమ్ డిజైనర్ గా ప్రయాణాన్ని మొదలుపెట్టిన సుస్మిత ఇక రాబోయే రోజుల్లో నిర్మాతగా బిజీ అయిపోతుందన్నమాట.

# నువ్వు గర్వించేలా చేశావు.. చరణ్ గురించి కైఫ్ గ్లోబల్ స్టార్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. మొన్నటి వరకు షూటింగ్‌లో పాల్గొన్న రామ్ చరణ్ చిన్న గ్యాప్ తీసుకుని ముంబయిలో జరుగుతున్న ఐఎస్‌పీఎల్ టీ10 క్రికెట్ లీగ్ సీజన్ 2లో పాల్గొంటున్నారు. ఈ లీగ్‌లో ఫాల్కన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సహ ఓనర్‌గా రామ్ చరణ్ ఉన్నారు. అందుకే ఆ జట్టును ఉత్సాహ పరచడం కోసం



రామ్ చరణ్ ముంబయిలో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన కొన్ని ఫోటోలు, వీడియోలను రామ్ చరణ్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన విషయం తెల్సిందే. రామ్ చరణ్‌తో కలిసి మాజీ టీం ఇండియా క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీసుకున్న పోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎక్స్ ద్వారా కైఫ్ ఈ ఫోటోను పంచుకున్నారు. అంతే కాకుండా గ్లోబల్ స్టార్ ఇమేజ్ సొంతం చేసుకున్నా చాలా సింపుల్‌గా ఉంటారు, ఇతడితో నాటు నాటు అంటూ స్టెప్స్ వేయాలని అనిపిస్తుందని అన్నారు. గ్లోబల్ సూపర్ స్టార్ అయినా డౌట్ టు ఎర్త్ అంటూ రామ్ చరణ్‌ని కైఫ్ ప్రశంసించారు. నువ్వు ప్రతి ఒక్కరిని గర్వించేలా చేశావు అంటూ ట్వీట్ చేశారు. ఆర్ఆర్ఆర్ సినిమాలో నటించి ఆస్కార్ వేదిక వరకు వెళ్లడం ప్రతి ఒక్కరూ గర్వించేలా చేశారని కైఫ్ ఉద్దేశం అయ్యి ఉంటుంది. %ూశ్రీంశీ =ఘుం% – చీరలో చూసి ఇంట్లో వాళ్లు వెక్కిరించేవాళ్లు: విశ్వక్ సేన్ రామ్ చరణ్ మొన్న సంక్రాంతికి 'గేమ్ ఛేంజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. కానీ అంతకు ముందు వచ్చిన ఆర్ఆర్ఆర్ సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు చరణ్ కి గ్లోబల్ స్టార్ ఇమేజ్‌ని తెచ్చి పెట్టింది. అందుకే రామ్ చరణ్ ఏ వేదిక ఎక్కినా, ఎక్కడ ఉన్నా ఆర్ఆర్ఆర్ స్టార్ గా చూస్తున్నారు. అద్భుతమైన నటనతో మెప్పించారు అంటూ రామరాజు పాత్రను గురించి మాట్లాడేవారు చాలా మంది ఉన్నారు. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్ఆర్ఆర్ సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో వెయ్యి కోట్లకు మించి వసూళ్లు రాబట్టిన విషయం తెల్సిందే. ప్రస్తుతం చరణ్ కొత్త సినిమా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోంది. ఉప్పెన వంటి సూపర్ సెన్సేషనల్ మూవీ తర్వాత రామ్ చరణ్‌తో బుచ్చిబాబు రూపొందిస్తున్న సినిమా కావడంతో అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా రామ్ చరణ్, జాన్వీ కపూర్‌ల మూవీ ఉంటుంది అంటూ బుచ్చిబాబు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. గేమ్ ఛేంజర్ నిరాశ మిగల్చడంతో వెంటనే రామ్ చరణ్ ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయ్యారు. ఈ సినిమాలో రామ్ చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.

# హీరోలపై నేషనల్ క్రష్ మనసులో మాట!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న నేడు పాన్ ఇండియాలో ఓ సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తెలుగులో ఎంతో మంది హీరోలతో కలిసి పనిచేసింది. చాలా తక్కువ సమయంలోనే పాన్ ఇండియా హీరోయిన్ అయింది. కేవలం ట్యాలెంట్ తోనే అమ్మడు ఎదిగిందన్నది వాస్తవం. తనదైన చలాకీతనం..పాత్రల్లో పరకాయ ప్రవేశం ఇలా ప్రతీది రష్మికని అగ్ర స్థానంలో కూర్చబెట్టాయి. టాలీవుడ్‌లో ఛలోతో లాంచ్ అయింది. అందులో నాగశౌర్యకి జోడీగా నటించింది. అక్కడ నుంచి అమ్మడి కెరీర్ వెనక్కి తిరిగి చూడకుండా సాగిపోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా రష్మిక తన కోస్టార్స్ లో కొంత మంది గురించి ఇంతకాలం మనసులో దాచేసుకున్న మాటల్ని బటయట పెట్టింది. అవేంటో ఆమె మాటల్లోనే.. అల్లు అర్జున్‌తో తన ఎనర్జీ పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతుందంది. బన్నీతో నటించడం ఎంతో



సౌకర్యంగా ఉంటుందని తెలిపింది. అలాగే రణవీర్ సింగ్ కు..తనకు నాన్సెన్స్ అంటే అస్సలు నచ్చదంది. కేవలం పాత్రల గురించి తప్ప ఇతర విషయాలు ఏవీ మాట్లాడుకోమని తెలిపింది. ఇద్దరు చాలా ప్రోఫెషనల్ గా ఉంటారంది. అలాగే విక్కీ కౌశల్ ని అద్భుతమైన వ్యక్తిగా అభివర్ణించింది. ఇలాంటి వారు చాలా అరుదుగా ఉంటారని పేర్కొంది. ఆయనతో కలిసి పని చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపింది. అలాగే ఇతర హీరోల గురించి మాట్లాడుతూ, తాను నటించిన సినిమాల్లో హీరోలంతా ఎంతో కంపర్ట్ గా ఉంటుందని ,ఎలాంటి సన్నివేశాలైనా తేలిగ్గా చేయడంలో సహకరించారంది. వాళ్లు అలా మద్దతివ్వడంతోనే హీరోయన్ గా మరిన్ని అవకాశాలు అందుకుంటున్నాని తెలిపింది. అందరూ తనతో ఎంతో స్నేహభావంతో ఉంటారంది. వారెవరూ కూడా ఎదుట వారికి ఇబ్బంది కలిగించే స్వభావం కలవారు కాదంది. రష్మిక నటించిన బాలీవుడ్ చిత్రం ఛావా ఫిబ్రవరి 14న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే.

నూతన, నటీ, నటులు కావలెను
కోకిల క్రియేషన్స్ బ్యానర్లో నిర్మించబోయే చలనచిత్రంలో నటించుటకు హీరో, హీరోయిన్ పాత్రలకు నూతన నటీనటులు కావలెను.
కోకిల క్రియేషన్స్ లో, ఫోక్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్ వెబ్ సిరీస్‌లో, నటించుట కొరకు నూతన నటీనటులు కావలెను.
Kokila Craetions
MOVIE
ఆసక్తి కలవారు ఈ క్రింది నంబరు మరియు మెయిల్ ఐడి కి మీ యొక్క వివరాలు ఫోటోలు పంపించగలరు. వాట్సప్ నంబరు : 9246919390
మెయిల్ ఐడి : rk.neega@gmail.com

# చరిత్ర సృష్టించిన గిల్.. తోపుల వల్ల కానిది సాధించాడు



**న్యూఢిల్లీ-నవ భూమి:** భారత వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ చరిత్ర సృష్టించాడు. తోపులకే సాధ్యం కాని ఓ అరుదైన ఘనతను అతడు అందుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఆఖరి వన్డేలో గిల్ ఓ రేర్ ఫీట్ నమోదు చేశాడు. వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 2500 పరుగుల మైలురాయిని అందుకున్న క్రికెటర్‌గా గిల్ రికార్డు క్రియేట్ చేశాడు. 50 ఇన్నింగ్స్‌ల్లో అతడు ఈ మైల్‌స్టోన్‌ను అందుకున్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 2500 పరుగులు బాదిన బ్యాటర్ల జాబితాలో ఇంతకుముందు వరకు సౌతాఫ్రికా లెజెండ్ హాషీమ్ ఆమ్లా టాప్‌లో ఉండేవాడు. ఇప్పుడు అతడ్ని దాటేశాడు టీమిండియా ఓపెనర్.

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతున్న ఆఖరి వన్డేలో భారత్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ప్రస్తుతం 17 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 105 పరుగులతో ఉంది. శుబ్‌మన్ గిల్ (53 నాటౌట్), విరాట్ కోహ్లీ (49 నాటౌట్) క్రీజులో ఉన్నారు. గిల్ వరుసగా మూడో హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. చాన్నాళ్లుగా బ్యాడ్ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న విరాట్ మంచి స్టార్ట్‌ను భారీ ఇన్నింగ్స్‌గా మలిచేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇద్దరూ బౌండరీల మోత మోగిస్తున్నారు. ఒకవేళ చివరి వరకు బ్యాటింగ్ చేస్తే స్కోరు అలవోకగా 330 పరుగుల వరకు చేరుకోవచ్చు. గిల్, కోహ్లీలో ఒకరు ఆఖరు వరకు ఆడితే మరింత బిగ్ టార్గెట్ సెట్ చేయొచ్చు. వీళ్లకు తోడు మిడిలార్డర్ బ్యాటర్లు కూడా రాణిస్తే జట్టుకు తిరుగుండదు.

# టీమిండియాకు బిగ్ షాక్.. ఎంత పనాయె బుమ్రా



**న్యూఢిల్లీ-నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ఆరంభానికి ముందే భారత జట్టుకు గట్టి ఝలక్ తగిలింది. వెన్ను నొప్పి నుంచి కోలుకోక పోవడంతో స్టార్ పేసర్ బుమ్రా ఈ మెగా టోర్నీకి దూరమయ్యాడు. మంగళవారం రాత్రి ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. సిటీ కోసం తమ తుది జట్లను ప్రకటించేందుకు మంగళవారమే తుది గడువుగా ఉంది. దీంతో బుమ్రా స్థానంలో మరో పేసర్ హర్షిత్ రాణాను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో జరిగిన ఆఖరి టెస్టులో బుమ్రా గాయపడిన విషయం తెలిసిందే.అయితే తను ఇంకా మ్యాచ్ ఫిట్నెస్ సాధించలేదని బోర్డు పేర్కొంది. బుమ్రా లేకపోవడంతో జట్టు బౌలింగ్ బలహీనంగా మారినప్పటికీ దేశవాళీ. ఐపీఎల్లో విశేషంగా రాణించిన రాజుపై సెలెక్టర్లు నమ్మక ముంచారు. మరోవైప ప్రాథమిక జట్టులో బైస్వాల్ ఉన్నప్పటికీ. అతడి స్థానంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి సీటీ జట్టులో చోటు కల్పించారు. ఇక నాన్ ట్రావెలింగ్ రిజర్వ్ ఆటగాళ్లలో సిరాజ్, దూవేలతో పాటు తైస్వాల్ ఉండనున్నాడు.

# నందినికి స్వర్ణం



**హైదరాబాద్-నవభూమి:** జాతీయ క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు ఒకే రోజు నాలుగు పతకాలు కొల్లగొట్టారు. డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో హెప్టాథ్లాన్‌లో అగసర నందిని 5,601 పాయింట్లతో పసిడి పతకాన్ని ముద్దాడింది. 200 మీటర్ల పరుగులో జి.నిత్య (హైదరాబాద్) 23.76 సెకన్లలో రేసును ముగించి కాంస్యం అందుకుంది. విశాఖ ఎక్స్‌ప్రెస్ యర్రా జ్యోతి 23.35 సెకన్లలో స్వర్ణం గెల్చుకుంది. ఇక ఆర్టిస్టిక్ ఆల్‌రౌండ్ జిమ్నాస్టిక్స్‌లో తెలంగాణ జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్ 44.767 పాయింట్ల కాంస్యం పతకం సాధించింది. మహిళల నెట్‌బాల్ ఫాస్ట్ 5లో తెలంగాణ రజతం అందుకుంది.

న్యూఢిల్లీ: 39వ జాతీయ క్రీడలకు మేఘాలయ ఆతిథ్యమివ్వనుంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉష.. ఆ రాష్ట్ర సీఎం కాన్రాడ్ సంగ్మాకు లేఖ రాశారు. 2027 ఫిబ్రవరి/మార్చిలో క్రీడలు జరిగే అవకాశం ఉంది. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల ముగింపోత్సవంలో ఐవోఏ జెండాను మేఘాలయకు అందించనున్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**